
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత్ శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:242 హైదరాబాద్, శనివారం, 26 ఏప్రిల్ 2025 పేజీలు: 12 వెల: 1.00



## పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

హైదరాబాద్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో నగరవాసులు పాల్గొని పహల్గాం మృతులకు సంతాపం తెలిపారు.

మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలి: రేవంత్

మొత్తం 140 కోట్ల మంది ప్రజలు ఏకమై ఉగ్రవాదంపై పోరాడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. భారత్‌లోకి చొచ్చుకొచ్చి.. పాక్ ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. "ఉగ్రవాదంపై పోరులో 140 కోట్ల మంది ప్రజలు ప్రధాని వెంట ఉంటారు. ఈ విషయంలో మోదీకి మద్దతు తెలుపుతున్నా. బాధిత కుటుంబాలకు అండగా ఉండాల్సిన అవసరం ఉంది. 1971లో పాకిస్థాన్‌కు ఇందిరాగాంధీ గట్టిగా బుద్ధి చెప్పారు. ఆనాడు ఇందిరాగాంధీని దుర్గామాతతో వాజ్‌పేయీ పోల్చారు. మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలి. పీవోకేను భారత్‌లో కలపాలి. ఇందిరాగాంధీని గుర్తుకుతెచ్చుకొని పాక్‌కు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పాలి. అభివృద్ధి పథంలో నడుస్తున్న భారత్‌పై ఉగ్రదాడి జరిగింది. పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా ఉగ్రవాదంపై పోరు జరపాలి. అందరం ఏకమై తీవ్రవాదాన్ని అంతం చేసి ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. ఉగ్రదాడికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలి" అని అన్నారు.

## దేశ ఐక్యతను సవాల్ చేస్తే.. ఊరుకోవద్దు: పహల్గాం ఉగ్రదాడిపై సల్మాన్ ఖుర్షిద్

%హైదరాబాద్: దేశ ఐక్యతను పదే పదే ప్రశ్నించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే.. తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ విదేశాంగ శాఖ మంత్రి సల్మాన్ ఖుర్షిద్ (%ఖ్రశ్రీఎఖఅ ఖష్ట్రబతీంష్ట్రఱఅ%) సూచించారు. హైదరాబాద్ వేదికగా గ్లోబల్ జస్టిస్, సమానత్వం, ప్రగతిశీల సహకారంపై 100కి పైగా దేశాల ప్రాతినిధ్యంతో ప్రోగ్రెసివ్ అలెయెన్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే భారత్ సమ్మిట్ 2025 సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఈటీవీ భారత్'తో ప్రత్యేకంగా మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడి, తదనంతర పరిణామాలపై స్పందించారు.



ఈ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలపై మాట్లాడుతూ "ఇది తప్పుల గురించి మాట్లాడాల్సిన సమయం కాదు. జాతీయ ఐక్యతను ప్రదర్శించే సమయం. ఇది మన దేశంపై జరిగిన దాడి. మన సోదరభావం, సామరస్యత, సంస్కృతికి సవాల్. దేశ ప్రజలందరితో పాటు రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని నిశ్చయించుకున్నాయి. ఈ సమయంలో కేంద్రం నుంచి నిర్దిష్టమైన, దృఢమైన చర్యలు ఉంటాయని ఆశిస్తున్నాం" అని అన్నారు.

పాక్‌తో సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంపై స్పందించిన ఖుర్షిద్.. పాక్‌ని దెబ్బకొట్టేలా ఇది కేవలం ఒక అడుగు మాత్రమే అని అన్నారు. కానీ, మనకు జరిగిన నష్టానికి ఇది ఓ నిర్ణయాత్మకమైన ప్రతిస్పందన అవుతుందని ఎవరూ విశ్వసించడంలేదని పేర్కొన్నారు. తర్వాత ఏం జరుగుతుందో వేచి చూడాల్సి ఉందని తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకున్నా కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి మద్దతు ఇస్తుందని తాము ఇప్పటికే చెప్పామన్నారు.

బిహార్‌లోని మధుబనిలో నిన్న జరిగిన సభలో ప్రధాని నరేంద్ర మోదీ అకస్మాత్తుగా ఇంగ్లిష్‌లో ప్రసంగించడం అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ వ్యూహంలో భాగమా? అని వస్తోన్న ప్రశ్నలకు స్పందిస్తూ.. "ఇది ఎన్నికల ర్యాలీలు లేదా ఎన్నికల సమయం అని మేం అనుకోవడంలేదు. దేశ ఐక్యతపై దాడి జరిగింది. జాతీయ ఐక్యతను బలోపేతం చేయడం మనందరి బాధ్యత. రాహుల్ గాంధీ ఈరోజు ఇక్కడికి రావడానికి బదులుగా కశ్మీర్ వెళ్లడానికి కారణం కూడా ఇదే. గాయాలను నయం చేసేలా యావత్ దేశానికి సందేశం పంపడం కోసమే ఆయన అక్కడికి వెళ్లారు" అని ఖుర్షిద్ చెప్పారు.

## పాక్ జాతీయుల వీసా సస్పెన్షన్లు: సీఎంలతో మాట్లాడిన అమిత్‌షా..

ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాక్ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాలను కోరారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారం కేంద్రానికి పంపించాలని కోరారు. అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందన్నారు.గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాక్ జాతీయులకు భారత్‌లో పర్యటించే అవకాశాలను కల్పించారు. ఈ ప్రోగ్రామ్ కింద భారత్‌లో ఉన్న ఎవరైనా సరే 48 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.మెడికల్ వీసాలు పొందిన వారికి మాత్రం ఏప్రిల్ 29వ తేదీ వరకు అవకాశం ఉంది. ఇక పాక్ నుంచి కొత్త దరఖాస్తుదారులకు వీసా సర్వీసులను తక్షణమే నిలిపివేశామని విదేశాంగ శాఖ పేర్కొంది. దీంతోపాటు పాక్‌లో ఉన్న భారత జాతీయులు తిరిగి వచ్చేయాలని అడ్వైజరీ జారీ చేసింది. అదే సమయంలో ఇక్కడ పాక్ జాతీయులు గడువు ముగిసేలోపు దేశం విడిచి వెళ్లిపోవాలని హెచ్చరించింది. పహల్గాంలో ఉగ్రవాదులు 26 మంది అమాయకుల ప్రాణాలు తీయడంతో భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ క్రమంలో పాక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని



క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ నిర్ణయించింది. దీంతో సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో పాటు.. పాక్ జాతీయులు భారత్‌ను వీడాలని నిర్ణయం తీసుకుంది.

## ఎన్‌డీఎస్ఏ నివేదిక చూసి సిగ్గుపడండి.. బీఆర్ఎస్‌పై ఉత్తమ్ ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 25: బీఆర్ఎస్‌పై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఎన్‌డీసీఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ) ఇచ్చిన నివేదికను చూసి బీఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలంటూ మండిపడ్డారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నామని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారని.. ఎన్‌డీఎస్ఏ నివేదిక చూసి బీఆర్ఎస్ సిగ్గుపడాలన్నారు. 'మీరే డిజైన్ చేశారు.. మీరే కట్టారు.. మీరుండగానే కూలిపోయింది' అని తెలిపారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు నిరుపయోగంగా ఉన్నా కూడా రికార్డు స్థాయిలో పంటలు పండాయని తెలిపారు.అబద్ధాలు తప్పులపై బతకాలని బీఆర్ఎస్ అనుకుంటోందని.. అది కుదరదని స్పష్టం చేశారు. నిర్మాణం చేసిన వాళ్ళు.. చేయించిన వాళ్ళు రైతులకు ద్రోహం చేశారని ఆరోపించారు. 'ఎన్‌డీఎస్ఏను రేవంత్ రెడ్డినో.. నేనో వేసింది కాదు. దేశంలో బెస్ట్ ఎక్స్‌పర్ట్స్ ఎన్‌డీఎస్ఏలో ఉన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడే ఎన్‌డీఎస్ఏ వచ్చింది ' అని చెప్పుకొచ్చారు. రైతులకు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్టుపై అధ్యయం చేస్తామన్నారు. వచ్చే కేబినెట్‌లో ఎన్‌డీఎస్ఏపై చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవడి అయ్య జాగీరు అని కట్టారని ప్రశ్నిస్తూ.. కాళేశ్వరం రైతుల కోసం కాదు జేబులు నింపుకునేందుకు కట్టారు అంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.కాగా.. కాళేశ్వరం



ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు దెబ్బతిన్న నేపథ్యంలో ఏం చేయాలనే దానిపై నివేదిక ఇవ్వాల్సిందిగా గతంలో ఎన్‌డీఎస్ఏను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దాదాపు పద్నాలుగు నెలల పాటు అధ్యయనం చేసి, ఎన్నో పరీక్షలు నిర్వహించిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌డీఎస్ఏ అందజేసింది.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలు పెను ప్రమాదంలో ఉన్నాయని.. ఆ బారేజీలు నిరుపయోగమే అంటూ నివేదికలో తెలిపింది. మూడు బ్యారేజీలకు విస్తృత, పెను నష్టం జరిగిందని పేర్కొంది. ఈ నష్టం ఇక్కడితోనే ఆగదని, నీటి ఒత్తిడి ఎక్కువైతే మొత్తం పూర్తి బ్యారేజీలకే ప్రమాదమని పేర్కొంది. మూడు బ్యారేజీల్లోని ప్రతి ఒక్కటి ఈ ప్రమాదపుటంచులో ఉంటాయని నివేదికలో ఎన్‌డీఎస్ఏ వెల్లడించింది.

## మంత్రి వర్గం వాయిదాల పర్వంతోనే సరి..

హైదరాబాద్, ఏప్రిల్ 25,

ఇదిగో.. అదిగో.. అన్నారు. కొందరైతే డేట్ కూడా ఫిక్స్ చేశారు. తీరా చూస్తే ఏదీ లేదు. వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ ఎప్పుడనేది.. అసలు అంతుచిక్కని ప్రశ్నగా మారిపోయింది. అయితే ఇప్పుడు మీనాక్షి నటరాజన్ కామెంట్స్‌తో మరోసారి కేబినెట్ అంశం తెరపైకొచ్చింది. మంత్రివర్గ విస్తరణ ఎవరి పరిధిలో ఉంటుందన్న టాపిక్‌పై తెలంగాణలో హాట్‌హాట్ డిబేట్స్ నడుస్తున్నాయిమంత్రివర్గ విస్తరణ కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూపులు.. అంతకంతకూ పెరిగిపోయిన ఆశావహులు.. కాలం గడిచిపోతున్నా పదవీ కాంక్ష నెరవేరని నాయకుల ప్రయత్నాలకు ఫుల్‌స్టాప్ పడింది. ఇప్పట్లో కేబినెట్ విస్తరణ కష్టమేనన్న సంకేతాలతో కొన్నాళ్లుగా నేతలంతా సైలెంట్ అయిపోయారు. అయితే లేటెస్ట్‌గా మంత్రివర్గ విస్తరణపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ చేసిన వ్యాఖ్యలు సరికొత్త చర్చకు తెరలేపాయి. కేబినెట్ విస్తరణ అంశం ముఖ్యమంత్రి పరిధిలో ఉందంటూ పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. ఈ కామెంట్సే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. మొన్నటిదాకా కేబినెట్ విస్తరణ అంశం కాంగ్రెస్ హైకమాండ్ చేతిలో ఉంటుందని చెబుతూ వచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులనే మంత్రిపదవి వరిస్తుందని.. ఆ నేతలు ఎవరనేది మాత్రం నిర్ణయించేది అధిష్టానమే పదేపదే చెప్పారు రేవంత్‌రెడ్డి. దీంతో ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవుల కోసం ఎంతోమంది సీనియర్లు అధిష్టానం పెద్దలను కలవడం, లేఖలు రాయడం జరిగింది.సీనియర్ నేత జానారెడ్డి కూడా హైకమాండ్‌కు లెటర్ రాశారు. రంగారెడ్డి జిల్లాకు ఛాన్సివ్వాలని ఖర్గేకు, కేసీ వేణుగోపాల్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అయితే ఓ అడుగు ముందుకేసి.. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే రాజీనామా చేస్తానంటూ పార్టీ పెద్దలకే అల్టిమేటం ఇచ్చారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టారన్న ప్రచారం జరిగింది. ఇటు నల్గొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సైతం ఢిల్లీ పెద్దలతో లాబీయింగ్ జరిపినట్లు జోరుగా ప్రచారం నడిచింది. ఇలా ఒక్కరేంటి? మంత్రివర్గంలో చోటు దక్కించుకోవాలన్న తపనతో ఎందరో నేతలు హస్తినబాట పట్టారు.మరికొందరు విజ్ఞప్తి లేఖలు ఢిల్లీకి పంపారు.మొత్తంగా? కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ ఒకలా.. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మరోలా మాట్లాడటంతో నేతలంతా కన్‌ఫ్యూజన్‌లో పడ్డట్లు తెలుస్తోంది. మరీ ఈ కేబినెట్ విస్తరణ కన్‌ఫ్యూజన్‌పై క్లారిటీ రావాలంటే కాస్త ఆగాల్సిందే..!

## కేటీ రామారావుకు ఫుల్ పవర్స్

హైదరాబాద్, ఏప్రిల్ 25,



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం వచ్చే ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. ఎన్నికల్లో ఆయనే అంతా డిసైడ్ చేసేటట్లున్నారు. కేసీఆర్ పార్టీ అధినేతగా ఉన్నప్పటికీ ఆయన గౌరవం ఆయనకు ఉంటుంది. ఆయన సలహాలు, సూచనలు మాత్రమే తీసుకుంటారు. కేసీఆర్ చెప్పే వ్యూహాలను రాజకీయంగా అమలు చేయనున్నారు. అంతే తప్ప నియోజకవర్గాల్లో కేసీఆర్ జోక్యం మాత్రం ఇక ఉండకపోవచ్చని అంటున్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారు. కేసీఆర్ రాజకీయంగా యాక్టివ్ గా ఉండకపోవచ్చన్న ఊహాగానాలు గులాబీపార్టీలో జోరుగా ఊపందుకుంటున్నాయి. అదే సమయంలో కేటీఆర్ ను ప్రసన్నం చేసుకోవడానికి నేతలు కూడా క్యూ కడుతున్నారు. వచ్చే ఎన్నికలకు ముందు అంటే రానున్న ఏడాది తాను తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ వచ్చే ఏడాది పాదయాత్ర చేసిన తర్వాత కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఇప్పటికే అక్టోబరు నెలలో బీఆర్ఎస్ అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందని కూడా కేటీఆర్ ప్రకటించారు. ఇక తాజాగా కేటీఆర్ రాజేంద్ర నగర్ ఉప ఎన్నికల్లో పటోళ్ల కార్తీక్ రెడ్డి పేరును ప్రకటించడం కూడా ఈ చర్చకు కారణమయింది. ఏ మాత్రం కేసీఆర్ తో సంబంధం లేకుండా ముందుగానే, ఉప ఎన్నికల ఊసే లేకముందే అభ్యర్థిని ప్రకటించడంతో ఇంకా కారు స్టీరింగ్ కేటీఆర్ చేతుల్లోనే ఉన్నట్లు స్పష్టమయింది. కేసీఆర్ కూడా తొలి పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇక పెద్దగా ఆయన రాష్ట్రం కోసం పనిచేయాలన్న ఆకాంక్ష కూడా లేదు. దీంతో పాటు ఎక్కువ కాలం ఫామ్ హౌస్ లోనే పరిమితమవుతున్నారు. వ్యవసాయంలోనే ఆయన ఎక్కువ గడుపుతూ చాలా వరకూ సేద తీరుతున్నారు. వ్యవసాయ క్షేత్రం అంటే ఆయనకు మక్కువ. రాజకీయంలో అంచులన్నీచూశారు. పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ కు మిగిలిన రాజకీయ నేతలకు మాదిరిగా పెద్ద లక్ష్యాలు ఏవీ ఉండవు. కానీ తాను స్థాపించిన పార్టీని మరొకసారి అధికారంలోకి తీసుకు వస్తే చాలునన్న భావనలో ఉన్నారు. అందుకే ఈసారి ఎన్నికలలో కేటీఆర్ క్రియాశీలకంగా మారనున్నారు. టిక్కెట్లను కూడా ఆయనే కేటాయించనున్నారు. ఇది ఫైనల్ అంటూ గులాబీ పార్టీలే అభిప్రాయపడుతున్నాయి.

భారత శక్తి
VOICE OF INDIAN

## పీఓకే విలీనమే పరిష్కారమా...

పహల్గామ్ లో ఉగ్రదాడితో అందాల కశ్మీరం... అల్లకల్లోలంగా మారింది. ఉగ్రతూటాకు ఆ ప్రాంతం అల్లాడిపోయింది. ముష్కరుల రాక్షసకాండకు 26 మంది అమాయకులు బలయ్యారు. దీంతో భారత్, పాక్ మధ్య వివాదం మరింత ముదిరింది. భారత్ సరిహద్దుల్లో ఆయుధాలు సిద్ధం చేసుకుంటూనే... పాక్‌కు వెన్నులో వణుకుపుట్టేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఖరాకండిగా పాక్‌తో దౌత్య సంబంధాలు తెంచేసుకుంది.పహల్గామ్ ఉగ్రదాడిని అమెరికా, రష్యా, చైనా, శ్రీలంక, ఇటలీ, ఇజ్రాయెల్, ఫ్రాన్స్, జర్మనీ సహా పలుదేశాలు ఖండించాయి. ఉగ్రవాదుల ఏరివేతకు, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశాలపై పోరాటంలో మద్దతుగా ఉంటామని ప్రకటించాయి. దీంతో ప్రపంచదేశాల సపోర్టుతో పాక్‌ను భారత్ ఒంటరిని చేసేందుకు ప్లాన్ రెడీ చేస్తోంది.ఇటు జీ20 దేశాల రాయబారులతోనూ భారత విదేశాంగ శాఖ భేటీ అయ్యింది. దౌత్యవేత్తలకు పహల్గామ్ ఉగ్రదాడి గురించి కళ్లకు కట్టినట్లు వివరించారు భారత విదేశాంగ అధికారులు. ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ ప్రోత్సహిస్తున్న తీరును? భారత్‌పై పాక్ పదేపదే కవ్వింపులకు దిగుతున్న పరిణామాలను దౌత్యవేత్తలకు తెలియజేశారు. పాక్ కుట్రలను ఇటు అఖిలపక్ష సమావేశంలోనూ వివరించింది కేంద్రం. రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాక్ తీరుపై అన్నిపార్టీలు కన్నెర్ర చేశాయి. పాక్ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా స్వాగతిస్తామంటూ కాంగ్రెస్ అగ్రనేతలు సైతం మద్దతిచ్చారు.పాక్ ఆక్రమిత కశ్మీర్ విలీనం' భారత్‌లో రాజకీయంగా, భద్రతపరంగా అత్యంత చర్చనీయమైన అంశం. ఈ విషయంపై భారత్‌లో ప్రభుత్వ విధానాలూ, ప్రజల భావోద్వేగాలూ గట్టి స్థాయిలో ఉన్నాయి. పహల్గామ్ ఉగ్రదాడితో మరోసారి పీఓకే విలీనంపై జోరుగా చర్చ జరుగుతోంది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దుశ్చర్యకు 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశం మొత్తాన్నిగ్భ్రాంతికి గురిచేస్తోంది. అయితే, ఈ దాడిని పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్ తిరిగి స్వాధీనం చేసుకోడానికి మార్గం సుగమం చేసిందా? పాకిస్థాన్‌తో పూర్తిస్థాయి యుద్ధం జరిగి త్వరలోనే పీఓకే విలీనం అవుతుందా? దాయాది పాకిస్థాన్ కుట్రలకు అడ్డుకట్ట పడుతుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఈ దిశగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేయబోతుందని చెబుతున్నారు.ఇదే సమయంలో తాజాగా, ప్రముఖ జ్యోతిషుడు ఏడాది కిందట చెప్పిన జోస్యం ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. పహల్గామ్ దాడి పీఓకేలోని చాలా భూభాగాన్ని భారత సైన్యం స్వాధీనం చేసుకోడానికి కీలక అవకాశం కల్పించిందని, ఈ విషయంలో ఆర్మీ విజయం సాధిస్తుందంటూ రుద్ర కరణ్ ప్రతాప్ అనే జ్యోతిషుడు అంచనా వేశారు. గతంలో ఈయన చెప్పిన జోస్యాలు ఫలించడంతో దీనిపై నమ్మకం పెరిగింది. వాస్తవానికి గతేడాది ఏప్రిల్ మొదటి వారంలోనే ఈ జ్యోతిషుడు.. ప్రధాని మోదీ, పీఓకే స్వాధీనం గురించి జాతకం చెప్పడం విశేషం.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం కుజ మహాదశలోకి ప్రవేశించారని, మూడోసారి ఆయన పదవిలోకి వచ్చి.. దేశ భూభాగానికి సంబంధించిన వివాదాలపై దృష్టిసారించి సత్ఫలితాలు సాధిస్తారన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఏప్రిల్ 2025 నుంచి సెప్టెంబరు 2025 మధ్య భారత్‌లో విలీనం అవుతుందని 2024 ఏప్రిల్ 6న ట్వీట్ చేశారు. దీనికి ప్రత్యేక క్రెడిట్ లేదా గుర్తింపు అవసరం లేదంటూ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది.తాజాగా, పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం అప్పట్లో తాను పెట్టిన పోస్ట్‌ను జ్యోతిషుడు రీపోస్ట్ చేస్తూ.. “ఏప్రిల్ 22, 2025 నాటి సంఘటనలు ఒక కీలకమైన క్షణాన్ని సూచిస్తాయి.. పహల్గామ్‌లో జరిగిన ఒక దారుణమైన, పిరికిపంద ఉగ్రవాద దాడి రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను రేకెత్తిస్తుంది..ఈ సమయంలో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లోని గణనీయమైన భాగాన్ని భారత సైన్యం తిరిగి స్వాధీనం చేసుకుంటుంది” అని ట్వీట్ చేశారు.దేశ విభజన అనంతరం 1947లో పాకిస్థాన్ ఆక్రమించుకున్న కశ్మీర్‌లోకి కొంత భూభాగమే పీఓకే. దీనిని అధికారికంగా తమ భూభాగంగా భారత్ భావిస్తుంది. సంవిధాన పరంగా జమ్మూ కశ్మీర్ రాష్ట్రం మొత్తం భారత్‌లో భాగమే. పీఓకేను స్వాధీనం తిరిగి స్వాధీనం చేసుకోవడమే లక్ష్యమని భారత పార్లమెంటు 1994లో ఏకగ్రీవంగా తీర్మానించింది కూడా.అయితే, విలీనం అంత ఆషామాషీ కాదు. ప్రస్తుతం పాకిస్థాన్ అధీనంలో ఉన్న పీఓకేలో పాక్ సైన్యం ఆధిపత్యం చెలాయిస్తోంది. ఇటీవల అక్కడ హమాస్ నేతల పర్యటన, ఉగ్రవాద శిబిరాల ఉనికిపై భారత్‌కు ఆగ్రహాన్ని కలిగించాయి. ఉగ్రదాడుల నేపథ్యంలో ఖనీఐపై కేంద్రం మరింత దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయి. రాజకీయ-దౌత్యపరంగా: అంతర్జాతీయంగా పాక్‌పై ఒత్తిడి తెచ్చి, దానిని భారత్‌కు తిరిగి అప్పగించే మార్గం (కానీ ఇది చాలా కష్టం).రక్షణ చర్య: సైనిక మార్గంలో తిరిగి స్వాధీనం చేసుకోవడం. అయితే, ఇది పూర్తి స్థాయి యుద్ధానికి దారితీయవచ్చు.ప్రజా ఉద్యమాల ద్వారా: పీఓకే లో నివసించే ప్రజలు పాకిస్థాన్ పాలనపై అసంతృప్తిగా ఉండటం, స్వేచ్ఛను కోరడం దీన్ని భారత్ అనుకూలంగా మలచుకోవడం.ఇటీవల కేంద్రంలోని పెద్దలు కొన్ని సందర్భాల్లో పీఓకేను స్వాధీనం చేసుకుంటామని బహిరంగంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సరిహద్దు ఉగ్రవాదంపై తీవ్ర స్థాయిలో స్పందిస్తున్న నేపథ్యంలో ఖనీఐపై మరింత దృష్టిసారించే అవకాశం ఉందని అంటున్నారు. మరి ఈ ప్రయత్నాలు ఎంతవరకు సఫలమవుతాయో? జోస్యం ఫలిస్తుందో లేదో వేచిచూడాల్సిందే.

==========================

# జాతీయ ప్రాజెక్టుగా రాజధాని..?

విజయవాడ, ఏప్రిల్ 26,

నవ్యాంధ్ర రాజధాని అమరావతిని.. ఇప్పటి వరకు ఊహిస్తున్న దానికి భిన్నంగా.. మరింత డెవలప్ చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు ప్రయత్నాలుచేస్తోంది. దీనిలో భాగంగా.. రాజధానిని జాతీయ ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలో ప్రధాన జాతీయ రహదారులతో రాజదానిని అనుసంధానించే ప్రక్రియకు సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఇది పూర్తయితే.. అమరావతి.. అందరిదీ అనే భావనను మరింత పెంచి.. దీనిని పొరుగు రాష్ట్రాలకు కూడా చేరువ చేయనున్నారు. ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులు పెట్టేవారిని ఆహ్వానిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. దీనికి తగిన విధంగా ఏర్పాట్లు చేస్తోంది. అంతర్జాతీయ విమానాశ్రయం అమరావతిలోనే ఉండేలా చర్యలు తీసుకుంటోంది. దీనికి సంబంధించి మరో 30-40 వేల ఎకరాల భూమిని సేకరించే దిశగా అడుగులు వేసింది. ఇది పూర్తయ్యేందుకు రెండేళ్ళ గరిష్ఠ సమయాన్ని నిర్దేశించుకుంది. ఇక, ఈ క్రమంలోనే రహదారుల విస్తరణకు కూడా.. కీలక నిర్ణయాలు తీసుకుంది. దీనిలో భాగంగా.. చెన్నై-కోల్‌కతా-హైదరాబాద్‌లతో రాజధానిని అనుసంధానించే జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. 2015-19 మధ్యే దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందించినా.. వివిధ కారణాలతో ముందుకు సాగలేదు. కానీ.. ఇప్పుడు దీనిని సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. తద్వారా.. రాజధానిని దేశవ్యాప్తంగా.. అన్ని ప్రాంతాలకు అనుసంధానించాలని నిర్ణయించింది. దీనిలో కీలకమైన మూడు రహదారులపై మాస్టర్ ప్లాన్‌రెడీ చేసుకుంది. ఎలివేటెడ్ కారిడార్-5, ఎలివేటెడ్ కారిడార్-13, నేషనల్ హైవే ? 13లను నిర్మించి..వాటి ద్వారా హైదరాబాద్, చెన్నై, కోలకత వంటి నగరాలకు అమరావతిని కలుపుతారు.. తద్వారా.. దేశవ్యాప్తంగా రహదారి కనెక్టివిటీ మెరుగుపడుతుంది. పలువురుపెట్టుబడి దారులు.. కూడా..ఈ మార్గాలపై ఇటీవల సీఎం చంద్రబాబుతో చర్చించారు.

దీంతో ఈ విషయంపై తాజాగా సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది.అదేసమయంలో కేంద్రానికి కూడా సమాచారం పంపించి.. ఆయారహదారుల నిర్మాణంపై క్లారిటీతీసుకుంటారు. దీంతో అమరావతి రాజధానిని జాతీయ ప్రాజెక్టుగా మరింత తీర్చిదిద్దాలని చంద్రబాబు భావిస్తున్నారు.

పటేల్ తరహాలో

అమరావతిలో 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతిలోని నీరుకొండపై 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. విగ్రహ బేస్‌లో ఎన్టీఆర్ జీవితం, కళాకృతులు, మినీ థియేటర్ తదితరాలు ఉండనున్నాయి. డీపీఆర్ తయారీకి కన్సల్‌టెంట్ కోసం టెండర్లు ఆహ్వానించారు. నందమూరి తారకరామారావు భారీ విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండు రోజుల కిందట మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి గుజరాత్ పర్యటనలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని సందర్శించి వచ్చారు. ప్రాథమిక అంచనాల మేరకు 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇందులో నీరుకొండ ఎత్తు 300 అడుగులు ఉంటుంది. దీని మీద 100 అడుగుల ఎత్తులో బేస్‌ను నిర్మిస్తారు. ఈ బేస్‌లోనే ఎన్టీఆర్ మెమోరియల్ హాల్, ఎన్టీఆర్ మ్యూజియం, ఎన్టీఆర్ జీవిత చరిత్ర తెలుసుకునేలా కళాఖండాలు, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్ ఉంటాయి. ఈ బేస్ పైన 200 అడుగుల ఎత్తైన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.

# వంశీ ఇంకెన్నాళ్లు...

విజయవాడ, ఏప్రిల్ 26,

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు అరెస్టయి దాదాపు డెబ్భయి రోజులు అవుతుంది. అయినా ఆయన ఇంకా జైలులోనే మగ్గుతున్నారు. కేసుల మీద కేసులు ఆయనపై వరస పెట్టి పెడుతున్నారు. అందుకోసమే బెజవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వల్లభనేని వంశీని టీడీపీ కార్యాలయంలో ఉన్న సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల కేసులో వల్లభనేని వంశీని ఈ ఏడాది ఫిబ్రవరి 13న అరెస్ట్ చేశారు. అంటే నేటికి వల్లభనేని వంశీ అరెస్టయి దాదాపు డెబ్భయి రోజులవుతుంది. కొన్ని కేసుల్లో బెయిల్ వస్తున్నా మరికొన్ని కేసుల్లో మాత్రం బెయిల్ లభించడం లేదు. అందుకే ఆయన విజయవాడ జిల్లా జైలులోనే మగ్గిపోతున్నారు.. గన్నవరం పోలీస్ స్టేషన్ లో నమోదైన రెండు కేసుల్లో పీటీ వారెంట్లు జారీ అయ్యాయి. వారెంట్లపై నేడు విచారణ చేపట్టనున్న న్యాయస్థానం నిర్ణయాన్ని వెలువరించనుంది. కేవలం సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల కేసులతో పాటు గన్నవరం నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్స్ అక్రమ తవ్వకాలపై కూడా కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులోనూ వల్లభనేని వంశీ నిందితుడిగా ఉన్నారు. వీటికి తోడు భూ కబ్జాల ఆరోపణలపై కూడా వంశీపై అనేక కేసులు నమోదు కావడంతో ఒక దాంట్లో బెయిల్ వస్తే మరొక కేసు మెడకు చుట్టుకుంటుంది. ఫిబ్రవరి 13న... వైసీపీ అధికారంలో ఉండగా వల్లభనేని వంశీ వ్యవహరించిన తీరుపై ఆగ్రహంగా ఉన్న కూటమి ప్రభుత్వం వల్లభనేని వంశీని అరెస్ట్ చేస్తుందని ముందే తెలిసినప్పటికీ ఇలా వరస కేసులు వచ్చిపడతాయని ఊహించలేదు. సోషల్ మీడియాలో టీడీపీ క్యాడర్ ప్రభుత్వాన్ని నిలదీస్తుండటంతో ఇక ఫిబ్రవరి 13న పకడ్బందీగా కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వల్లభనేని వంశీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గన్నవరం నియోజకవర్గాన్ని వదిలేసి హైదరాబాద్ లోనే ఉంటున్నారు. అక్కడే మకాం వేశారు. అయితే పోలీసులు మాత్రం అన్నికోణాల్లో ఆలోచించి వరస కేసులు నమోదవుతుండటంతో ఇప్పట్లో వల్లభనేని వంశీ బయటకు వచ్చే అవకాశం కనిపించడం లేదు. తాను వేసిన సింగిల్ బ్యారక్ కాదని, అందరిలోనూ కలిపి ఉంచాలని, బయట నుంచి ఆహారాన్ని తెప్పించుకునేందుకు అవకాశం ఇవ్వాలని వల్లభనేని వంశీ గతంలో న్యాయస్థానాన్నిఆశ్రయించారు. అదే సమయంలో మిగిలిన ఖైదీలతో పాటు తనను ఉంచాలని కూడా కోరారు. తనకు ప్రాణభయం ఉందని కూడా వల్లభనేని వంశీ చెప్పారు. అయితే వరసగా కేసులు నమోదవుతుండటం, ఒక కేసులో బెయిల్ వచ్చినా మరొక కేసులో అరెస్ట్ చేయడానికి పోలీసులు అన్నీ సిద్ధం చేస్తున్నారు. అందుకే వల్లభనేని వంశీ ఇప్పట్లో బయటకు వచ్చేందుకు ఛాన్స్ లేదు. ఇంకా బెజవాడలోని మండుటెండలకు మరికొద్ది కాలం జైలులోనే ఉండి పోవాల్సి పరిస్థితులు ఉన్నాయంటున్నారు.

కేడర్ లోనూ నిరుత్సాహం

గత ఏడాది జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోరంగా పరాజయం పాలైన వైసీపీని చాలా మంది వదిలేశారు. కీలక రెడ్డి నాయకుల నుంచి అనేక మంది బీసీల వరకు.. కూడా పార్టీకి దూరమయ్యారు. ఈ క్రమంలో ఇప్పుడు కీలకమైన కార్యకర్తల వంతు వచ్చింది. ఏ పార్టీకైనా.. నాయకులతోపాటు.. కార్యకర్తలు చాలా కీలకం. నాయకులు జంప్ చేస్తారు..కానీ.. కార్యకర్తలు మాత్రం ఎంతో కొంత అంకిత భావంతో పార్టీలను అంటిపెట్టుకుని ఉంటారు. ఎన్నికల సమయంలోనూ..వారే కీలకం.ఈ విషయాన్ని గుర్తించే.. దాదాపు అన్ని పార్టీలూ..కార్యకర్తలే తమకు బలమని.. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని చెబుతాయి. కార్యకర్తల సెంట్రిక్‌గా అనేక కార్యక్రమాలు కూడా చేపడతాయి. అయితే.. వైసీపీ విషయానికి వస్తే.. కార్యకర్తలనను పక్కన పెట్టిన విషయం తెలిసిందే. గత వైసీపీ హయాంలో వలంటీర్లే సర్వస్వంగా అప్పట్లో సీఎం జగన్ వ్యవహరించారు. ఇది పార్టీకి మేలు



చేయకపోగా.. ఓడించేసింది. తద్వారా.. పార్టీ నామరూపాలు లేకుండా పోయిందన్న చర్చ ఉంది.ఇంత పరాభవం తర్వాత.. ఒకటి రెండు సార్లు.. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తున్నానని జగన్ చెప్పుకొచ్చా రు. కానీ.. నెలలు గడిచిపోతున్నా.. ఆయన కార్యకర్తల విషయంలో ఎలాంటి నిర్ణయాలూ తీసుకోవడం లేదు. గుర్తింపు అంతకన్నా లేదు. పైగా.. టీడీపీ సహా కూటమి నాయకులు.. కార్యకర్తలపై పోరాటాలు చేయాలని పిలుపునిస్తున్నారు. ఇదే జరిగితే.. జైలుకు వెళ్తోంది.. కార్యకర్తలు, నాయకులే. కనీసం వారిని పరామర్శించడంలోనూ.. న్యాయపరంగా రక్షణ కల్పించడంలోనూ..వైసీపీ అధినేత విఫలమవుతున్నారు.ఆయా విషయాలను గమనిస్తున్న వైసీపీ కార్యకర్తలు.. ఇప్పుడు ప్లేట్ మార్చేస్తున్నారు. టీడీపీ కానీ.. జనసేన కానీ..కార్యకర్తలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని వారు గుర్తించారు. సీఎం చంద్రబాబు సైతం..తన ప్రొటోకాల్ ను పక్కన పెట్టి మరీ.. కార్యకర్తలు, నాయకుల ఇళ్లకు వెళ్లి కష్టాల్లో ఉంటున్నవారిని ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారు. భరోసా కల్పిస్తున్నారు. ఈ పరిణామాలతో వవైసీపీలో అలజడి రరేగింది. ఇంకా పార్టీని నమ్ముకుని ఇక్కడే ఉంటే కష్టమనిభావిస్తున్న వారు.. జెండా మార్చేసేందుకు రెడీ అయ్యారు. గుంటూరు, కృష్ణా, నెల్లూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక మంది కార్యకర్తలు.. గత రెండు రోజుల్లోనే టీడీపీ, జనసేనల బాటపట్టడం గమనార్హం

# బాలినేనికి చిక్కని పట్టు

ఒంగోలు, ఏప్రిల్ 25,

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. అయితే తనకు పట్టున్న ఒంగోలు కార్పొరేషన్ కు చెందిన కార్పొరేటర్లను అయితే తనతో పాటు జనసేనలోకి తీసుకు వచ్చారు. అయితే మరికొందరు కీలక నేతలను పార్టీలోకి తీసుకు రావాలన్న ఆయన ఆలోచన మాత్రం కార్యరూపం దాల్చడం లేదని తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జనసేనలోకి వచ్చేందుకు ఎవరూ పెద్దగా సుముఖత వ్యక్తం చేయడం లేదని సమాచారం. అందుకే బాలినేని శ్రీనివాసులు రెడ్డి ఎంతగా ప్రయత్నించినా కొందరు నేతలు సున్నితంగా తిరస్కరిస్తుండగా, మరికొందరు నేతలు మాత్రం తాము వైసీపీని వదిలి రాలేమని తెగేసి చెబుతున్నారు. జిల్లాపై పట్టున్న నేతగా... బాలినేని శ్రీనివాసులు రెడ్డి కాంగ్రెస్ లో ఉన్నప్పటి నుంచే ప్రకాశం జిల్లాను తన చెప్పు చేతల్లో పెట్టుకుని ఉన్నారు. నాడు పీసీసీ చీఫ్ గా, తర్వాత ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డికి సమీప బంధువు కావడంతో ఆయన చెప్పిందే మాట.. చేసిందే శాసనం అన్నట్లు ఉండేది. నాటి నుంచి 2019 ఎన్నికల వరకూ బాలినేని శ్రీనివాసులు రెడ్డి చెప్పిన వారికే టిక్కెట్లు దక్కేవి. అందుకే బాలినేని అందరు నేతలతో టచ్ లో ఉంటారు. వారు కూడా బాలినేని ప్రాపకం కోసం పాకులాడేవారు. అలాంటిది 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత బాలినేని వైసీపీకి రాజీనామా చేయడం, తర్వాత జనసేనలో చేరిపోవడం ఒకరకంగా మిగిలిన నేతలకు కూడా షాకింగ్ కు గురి చేశాయి.కానీ బాలినేని శ్రీనివాసులు రెడ్డి పార్టీని వీడితే అనేక మంది నేతలు కూడా ఆయన వెంట పోలోమంటూ క్యూ కడతారని భావించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అదే ఊహించారు. అందుకే బాలినేనికి అంత ప్రాధాన్యత ఇచ్చారు. కానీ బాలినేని చేరి నెలలు కావస్తున్నా ఒక్క పేరున్న నేత కూడా ప్రకాశం జిల్లా నుంచి రాకపోవడం జనసేనలోనూ చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న పరిణామాలు, హామీలు అమలు చేయకపోవడం, తిరిగి జగన్ పుంజుకునే అవకాశాలుంటాయన్న అంచనాలు వినపడుతుండటంతో నేతలు పార్టీని వీడి వచ్చేందుకు సుముఖంగా లేరని చెబుతున్నారు. బాలినేని వదలకుండా ప్రయత్నిస్తున్నా కార్పొరేటర్లు మినహా మరో ముఖ్యనేత ప్రకాశం



జిల్లాలో ఆయన వెంట రాకపోవడానికి ఇదే కారణమని అంటున్నారు. ప్రకాశం జిల్లా రాజకీయాల్లో బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక స్థానం ఉంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచి.. నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో మంత్రిగా బాలినేని పని చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు వైఎస్ జగన్ కాంగ్రెస్ పార్టీని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపించారు.దీంతో బాలినేని సైతం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి.. వైఎస్ జగన్ అడుగులో అడుగు వేసి నడిచారు. ఆయన ఒంగోలు ఎమ్మెల్యేగా ఆరుసార్లు గెలిచారు. ఇక 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి జగన్ కేబినెట్‌లో స్థానం సంపాదించారు. రెండున్నరేళ్ల తర్వాత జగన్ కేబినెట్‌ను పునర్ వ్యవస్థీకరించారు. దీంతో మంత్రి పదవిని బాలినేని కోల్పోయారు.అయితే వైఎస్ జగన్ కుటుంబంతో బాలినేనికి సమీప బంధుత్వం ఉంది. అయినా ఆయన్ని కేబినెట్ నుంచి తొలగించడంతో తీవ్ర మనో వేదనకు గురయ్యారనే గట్టి ప్రచారం అయితే జిల్లా గట్టిగానే సాగింది. అందువల్లే నాటి నుంచి పార్టీ అధిష్టానానికి ఆయన సాధ్యమైనంత దూరంగా ఉన్నారనే చర్చ సైతం సాగింది. ఇక ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారానికి దూరమైంది. ఎమ్మెల్యేగా సైతం బాలినేని ఓటమి పాలయ్యారుపార్టీ వీడేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్ వద్ద కుండ బద్దలు కొట్టారు. బాలినేనికి నచ్చ జెప్పేందుకు పార్టీ అధినేతే కాదు.. అగ్రనేతలు సైతం ప్రయత్నించారు. కానీ బాలినేని మాత్రం వారి సూచనలు సలహాలు పట్టించుకోలేదు

# 3 ఏపీఎస్సీఎస్సీలో 18 నోటిఫికేషన్లు

విజయవాడ, ఏప్రిల్ 25, (న్యూస్ పల్స్)

ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ అంశం కొలిక్కి రావడంతో ఏపీలో ఉద్యోగ నియామక ప్రక్రియలో వేగం పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. మెగా డిఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదలైంది.ఎస్సీ వర్గీకరణ అంశం కొలిక్కి రావడంతో ఏపీపీఎస్సీలో పెండింగ్‌లో ఉన్న నోటి ఫికేషన్ల విడుదలకు ఏపీపీఎస్సీ సిద్ధమైంది. ఈ ఏడాది జనవరిలోనే నోటిఫికేషన్లు జారీ చేయాలని భావించినా ఎస్సీ వర్గీకరణ కార్యరూపం దాల్చక పోవడంతో నోటిఫికేషన్లు ఆలస్యమయ్యాయి.ఏపీ ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 866 పోస్టుల భర్తీకి సంబంధించి 18 నోటిఫికేషన్లు ఏపీపీఎస్సీలో పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో అటవీ శాఖకు సంబంధించి 814 పోస్టులున్నాయి.ఎస్సీ వర్గీకరణకు తగ్గట్లు అన్ని శాఖల్లో రోస్టర్ పాయింట్లు ఖరారు చేయాల్సి ఉంది. ఈ కసరత్తు పూర్తవగానే ఏపీపీఎస్సీ నోటి ఫికేషన్ల జారీ చేయాలని భావిస్తోంది.

శాఖల వారీగా భర్తీ చేయనున్న ఉద్యోగాలుఅటవీ శాఖలో సెక్షన్ ఆఫీసర్ పోస్టులు 100 ఉన్నాయి. వీటిలో 30 పోస్టులు క్యారీ పార్వర్డ్ పోస్టులుగా ఉ?నాయి.అటవీ శాఖలో బీట్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ ఆఫీసర్ పోస్టులు 691 ఉన్నాయి. వీటిలో 141 క్యారీ ఫార్వర్డ్ పోస్టులు ఉన్నాయి.

డ్రాఫ్ట్స్ మెన్ గ్రేడ్-2 టెక్నికల్ అసిస్టెంట్: పోస్టులు 13 ఉన్నాయి.వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టులు 10, దేవాదాయ శాఖలో ఈవో పోస్టులు 7, జిల్లా సైనిక సంక్షేమ అధికారుల పోస్టులు 7, ఇంటర్మీడియట్ విద్యలో లైబ్రేరియన్ పోస్టులు 2, ఉద్యానశాకలో హార్టికల్చర్ పోస్టులు 2, మత్స్య శాఖలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు 2, భూగర్భ జలశాకలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు 2, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ క్యాటగిరీ 2 పోస్టులు 2, మునిసిపల్ శాఖలో సీనియర్ అకౌంటెంట్ పోస్టులు 11, టైపిస్ట్ పోస్టులు 1, అసిస్టెంట్? మోటర్ వెహికల్ పోస్టులు 1 ఉన్నాయి. వీటితో పాటు పలు క్యారీ ఫార్వార్డ్ పోస్టులు ఉన్నాయి.

# అమల్లోకి ఇంటర్ బోర్డులో సంస్కరణలు

గుంటూరు, ఏప్రిల్ 25,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఇంటర్ విద్యలో పలు సంస్కరణలు తీసుకువస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఐదు సబ్జెక్టులకు బదులు ఆరు సబ్జెక్టులను ఎంచుకోవల్సి ఉంటుంది. అయితే విద్యార్థులు ఎంపిక చేసుకున్న ఆరో సబ్జెక్టులో ఉత్తీర్ణత తప్పనిసరి కాదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో తీసుకువచ్చిన అనేక సంస్కరణలపై సందేహాలు వ్యక్తమవుతుండటంతో బోర్డు ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. ఫస్ట్ ఇయర్‌లో పార్ట్ 1 కింద ఇంగ్లిస్ సబ్జెక్టు ఉంటుంది. పార్ట్ 2 కింద తెలుగు, సంస్కృతం, అరబిక్ ఇలా భాష సబ్జెక్టులతోపాటు గ్రూపు సబ్జెక్టులు కూడా ఉంటాయి.పార్ట్ 3లో గ్రూపు సబ్జెక్టులు ఉంటాయి. అభ్యర్థి ఎంపీసీ గ్రూపు ఎంపిక చేసుకుంటే గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం గ్రూపు సబ్జెక్టులు ఉంటాయి. అయితే విద్యార్థి ఎంపీసీ గ్రూపు తీసుకొని గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, ఇంగ్లిష్, తెలుగు చదువుతూ ఆరో సబ్జెక్టుగా జీవశాస్త్రం తీసుకున్నాడనుకుంటే జీవశాస్త్రంలో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిన అవసరం ఉండదన్నమాట. అంతేకాకుండా ఆరో సబ్జెక్టులో ఫెయిల్ అయినా ఐదు సబ్జెక్టులు పాసైనట్లు మెమో ఇస్తారు. ఒకవేళ ఆరో సబ్జెక్టులోనూ పాసైతే ప్రత్యేకంగా మరో మెమో జారీ చేస్తారు.కానీ పార్ట్2లో తెలుగు, సంస్కృతం, అరబిక్‌లాంటి భాష సబ్జెక్టులతోపాటు గ్రూపు ఆప్షనల్ సబ్జెక్టులు కలిపి మొత్తం 24 వరకు ఉంటాయి. వీటిల్లో ఏ సబ్జెక్టునైనా విద్యార్థి ఎంపిక చేసుకోవచ్చు. ఉదాహరణకు ఎంపీసీ విద్యార్థి గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ఆంగ్ల భాష సబ్జెక్టుతోపాటు జీవశాస్త్రాన్ని ఎంపిక చేసుకుంటే జీవశాస్త్రంలో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ ఐదు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత తప్పనిసరన్నమాట. వీళ్లు జేఈఈతోపాటు నీట్ పరీక్ష కూడా రాసుకోవచ్చు. ఒకే కోర్సులో ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ చదివేందుకు అర్హత లభిస్తుంది. ఈ మేరకు ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను ప్రవేశ పెట్టడంతోపాటు ప్రశ్నపత్రాల విధానాన్ని మార్పు చేశారు. గతంలోలానే ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉంటాయి. వీటిల్లో పార్ట్ 2లో ఎంపిక చేసిన సబ్జెక్టును చదువుకోవచ్చు. వీటితోపాటు విద్యార్థి ఆసక్తి మేరకు అదనంగా ఆరో సబ్జెక్టు చదువుకోవడానికి వీలుంటుంది.

# విద్యార్థులను మార్కుల యంత్రాలుగా మార్చకండి.... . ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు లక్ష్మీరాజా...

బద్వేలు

ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎస్ వి ఇంజనీరింగ్ కాలేజ్ నందు విద్యార్థులు -మార్కుల యంత్రాలు -విలువలు అనే అంశం మీద ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బి లక్ష్మీరాజ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బి లక్ష్మీరాజా ఎస్ వి ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ వీర సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నం ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపకురాలిపై ఓ విద్యార్థి చెప్పుతో దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రుల పైన సమాజం పైన ఉపాధ్యాయ అధ్యాపకుల పైన ఉంది అని తెలిపారు. విద్యార్థులను మార్కుల యంత్రాలుగా చూడటం వలన తయారు చేయటం వలన ఈ సమాజానికి ఈ దేశానికి ఉపయోగం ఉండదన్నారు. సమాజ మార్పు కోసం సమాజంలో జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకొని సమ సమాజం నిర్మించుటలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యార్థుల అభ్యున్నతి కోసం విద్యార్థుల తల్లిదండ్రుల తర్వాత గురువు నిరంతరం శ్రమిస్తాడు అన్నది నగ్న సత్యం. అయితే ఇటీవల కాలంలో స్వల్ప దండనలకు కూడా విద్యార్థుల తల్లిదండ్రులు జోక్యం చేసుకొని గురువులపై దాడులకు తెగబడమనేది సమాజాన్ని అట్టడుగుకు తీసుకు వెళ్లేలా కనిపిస్తుందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను మార్కుల యంత్రాలుగా చూసి వారికి వచ్చిన మార్కులను ఇతర విద్యార్థులకు వచ్చిన మార్కులతో పోల్చుకుంటూ మరిన్ని మార్పులు తెచ్చుకోవాలని తల్లిదండ్రులు తీవ్రంగా విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారు.

అలాగే ప్రస్తుతం విద్యార్థుల బోధనాంశాలలో నీతి కథలు మారల్ పీరియడ్స్ లాంగ్వేజ్ లలో విద్యార్థుల నిజ జీవితానికి అవసరమైన పాఠ్యాంశాలు లేకపోవడం ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఒక లోపంగా కనిపిస్తున్నది.ఉపాధ్యాయులకు అధ్యాపకులకు విద్యార్థులు పైన ఎలాంటి ద్వేషంతో శత్రుత్వంతో కానీ ఉండరని వారిని సరైన మార్గంలో నడపాలి అన్నదే గురువుల లక్ష్యంగా పనిచేస్తారు తప్ప మరో ప్రయోజనం వారి నుండి కోరుకోరని తెలిపారు. అందుకోసం సమాజంలో విద్యార్థులను మార్కుల యంత్రాలుగా కాకుండా నైతిక విలువలు పెంపొందించుకోవటానికి పెద్దల పట్ల గురువుల పట్ల వినయ విధేయతలతో ఉండటం తల్లిదండ్రులను గౌరవించడం పాఠశాల స్థాయి నుండి విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఉన్నత పాఠశాల స్థాయి నుండి ఇంటర్మీడియట్ డిగ్రీ ఇంజనీరింగ్ మెడికల్ తదితర కళాశాల యందు సైకలాజిస్టులను నియమించి ఎప్పటికప్పుడు విద్యార్థులలో వస్తున్న పరిణామాలను గుర్తించి వారిని తీర్చి దిద్దాల్సిన అవసరం ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఏపీటీఎఫ్1938 జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి కృష్ణారెడ్డి నాయకులు నరసింహులు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులకు అన్ని స్థాయిలలో సదస్సులు నిర్వహించి వారిలో సామాజిక చైతన్యాన్ని పెద్దలు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల పట్ల గౌరవాన్ని పాఠశాల స్థాయి నుంచి పెంపొందించేలా కృషి చేస్తామని తెలిపారు.

===============================చీచీ

# క్రియాశీలక రాజకీయాల్లోకి భువనమ్మ..

నెల్లూరు, ఏప్రిల్ 25,

ప్రజా నాయకుడు.. లేదా నాయకురాలు.. కావడానికి జెండా పట్టుకునే తిరగాల్సిన అవసరం లేదని.. ఈ దేశంలో అనేక మంది నిరూపించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తూ.. ప్రజల మనసుల్లో చోటు దక్కించుకున్నవారు ఎందరో ఉన్నారు. అంత మాత్రాన వారు రాజకీయా ల్లో పాల్గొని పోటీ చేయాల్సిన అవసరం ఉండదు. ఇలాంటి వారిలో



నర్మదాబచావో(నర్మదా నదిని రక్షించండి) పేరుతో ఉద్యమించిన మేధా పాట్కర్ వంటివారు ఉన్నారు.ఇప్పుడు అలానే అప్రకటిత ప్రజానేతగా.. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వర నిలుస్తున్నారు. ఆమె.. ప్రజలకు చేరువ కావడం.. వారి సమస్యలు పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. నారా వారి సొంత నియోజకవర్గం కుప్పంలో ఎక్కువగా పర్యటిస్తున్నారు. నెలకు మూడు నుంచి నాలుగురోజుల పాటు అక్కడే ఉంటున్నారు. ఇక్కడ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారు. సాయం చేస్తున్నారు. అభివృద్ధి పనులు కూడా చేపడుతున్నారు.అంతేకాదు.. ఒక్కకుప్పమే అయితే.. భువనేశ్వరి గురించి.. ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఎన్టీఆర్ జిల్లా నుంచి ఖమ్మం వరకు కూడా.. ఆమె తన ప్రజా ప్రస్థానాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. కృష్ణాజి ల్లాలోని తన తండ్రి గ్రామం నిమ్మకూరులో పెద్ద ఎత్తున పాఠశాలను నిర్మిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేద విద్యార్థులను ఎంపిక చేసి.. వారికి స్కాలర్ షిప్పులు అందిస్తున్నారు. ఎన్టీఆర్ ట్రస్టును మరింత బలోపే తం చేసి.. పేదలకు, సమాజంలో అణగారిన వర్గాలకు ఆసరా చూపిస్తున్నారు.ఇదంతా స్వచ్ఛంద సేవే కదా.. ప్రజానేత ఎలా అవుతారన్న ప్రశ్నలు సహజం. అయితే.. కేవలం స్వచ్ఛం ద సేవకు మాత్రమే భువనేశ్వరి పరిమితం కాలేదు. అవసరానికి తగిన విధంగా రాజకీయ అవతారం కూడా ఎత్తుతున్నారు. గత ఎన్నికల్లో ఊరూ వాడా ప్రచారం చేశారు. ఇప్పుడు కూడా.. పీ4 పథకంపై ఆమె అంతర్గతంగా పారిశ్రామిక వేత్తలతో చర్చిస్తున్నారు. వీరిలో మహిళా పారిశ్రామికవేత్తలను ఒప్పించే పనిలో ఉన్నారు. తద్వారా.. చంద్రబాబు ఆశయాలకు దన్నుగా నిలిచే ప్రయత్నం చేస్తున్నారు. సో.. భువనేశ్వరి రాజకీయ నేత కాకపోవచ్చు.. కానీ, అప్రకటిత ప్రజానేతగా మాత్రం గుర్తింపు పొందుతున్నారనడంలో సందేహం లేదు. ఇటీవల కుప్పం డిగ్రీ కాలేజీలో భువనేశ్వరి ముఖాముఖిలో పాల్గొన్నారు. డ్రగ్స్, గంజాయి యువతను నాశనం చేస్తోందన్నారు. "వారి స్వలాభం కోసం చాలా మంది మిమ్మల్ని టెంప్ట్ చేస్తారు. చాలా జాగ్రత్తగా ఉండాలి. రోల్ మోడల్ పెట్టుకోవాలి'' అని విద్యార్థులకు సూచించారు. ప్రతి పురుషుని సక్సెస్ మహిళతోనే ముడి పడి ఉంటుందన్నారు. "కాలేజ్ డేస్ గుర్తుకు వస్తున్నాయి. ఆషామాషీగా వెళ్లి మీరందరూ చేసేదే నేను కూడా కాలేజ్‌లో చేసేదాన్ని. మిమ్మల్ని చూసి గర్వంగా ఉంది. ఫ్యూచర్ ఆఫ్ ఇండియా అవర్ ఆంధ్రప్రదేశ్ లీడర్ ప్రతి ఒక్కరిలో ఉంటుంది. మీ హక్కుకోసం నడవాలి. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మీకోసం సంపాదిస్తున్నారు. అది ఈజీ కాదు. హార్డ్ వర్క్. ఏదీ ఫ్రీగా రాదు. కష్టంతోనే వస్తుంది. బాలికలకు పట్టుదల, ధైర్యం, మీమీద నమ్మకం ఉండాలి. పెళ్లి అయ్యేదాకా ఒకటి, తర్వాత మరొకటి. రాజకీయాల్లో బిజినెస్‌లో నన్ను నేను లాక్కుని ముందుకు వెళ్లాను. మన ధైర్యం మనకుండాలి" అని వెల్లడించారు.ముందు నందమూరి కుమార్తెను.. బాబు భార్య సెకండ్. ఒక మహిళగా నేనేమిటి అనేది నాకు తెలుసు. మనందరిలోనూ ఆ శక్తి ఉంది. ఫోకస్ పనిలోపెడితే ముందుకు వెళ్ళచ్చు. హౌస్ వైఫ్ ఉన్నప్పుడు హెరిటేజ్ చూసుకోమన్నారు. నాకే ఏమీ తెలియదు. ఎండీగా బాధ్యతలు ఇచ్చారు. అందరినీ ఒకటే అనుకున్నాను. జీవితాలు బాగుంటాయి. హార్డ్ వర్క్ మీద నమ్మకం పెట్టాలి. నాన్నకంటే గొప్పవాడివి కావాలి. చేయకపోతే నీ ఫ్యూచర్ ఆగుతుంది అని నా కుమారునికి చెప్పా. మీ భవిష్యత్తు నీ చేతిలో ఉంది. ఎవరూ రారు. బద్ధకం ఉంటే జీవితంలో ఎదగలేరు. మీరే ఫ్యూచర్ లీడర్స్, ఏ రంగంలోనైనా. డిసిప్లిన్ ముఖ్యం. నాకు డిసిప్లిన్ ఎక్కువ. స్ట్రిక్ట్ నెస్ లేకపోతే నేను ముందుకు వెళ్లలేను. ఉద్యోగాలకు, ఆర్గనైజేషన్ టీమ్ వర్క్ ఉండాలి. అందరూ మనమే అంటేనే భవిష్యత్తు. సంతోషంగా కార్యక్రమం చేపట్టాలి. జీవితంలో టీచర్స్‌ను మరచిపోవద్దు. రెస్పెక్ట్ ఇవ్వాలి వారికి. అందరిలో ఉంటాయి తప్పులు. ఒక వేలు చూపిస్తే 4 వేళ్ళు మనల్ని చూపిస్తాయి. ఇవన్నీ ఎదుర్కొన్నాను నేను. వ్యాపారం, ఉద్యోగం అన్నింటిలోనూ ఆడపిల్ల దేనిలోనూ తక్కువకాదు. నా జీవితంలో చూస్తున్నాను. సోషల్ మీడియా, యూట్యూబ్ మిమ్మల్ని మీ కుటుంబం నుంచి దూరం చేస్తుంది. కుటుంబానికి ఇంపార్టెన్స్ ఇవ్వండి. ఫోన్లు, సోషల్ మీడియా కుటుంబాలకు దూరం అవుతున్నారు" అని తెలిపారు.

# చంద్రబాబు మాస్టర్ ప్లాన్

విజయవాడ, ఏప్రిల్ 25,

మంద కృష్ణ మాదిగ. పరిచయం అక్కర్లేని పేరు ఇది. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉమ్మడి ఏపీలో ఆయన సుపరిచితం. జాతీయ స్థాయిలో సైతం తనదైన ముద్ర చాటుకున్నారు. ఎక్కడో ప్రకాశం జిల్లాలో 14 మంది యువకులతో మాదిగ దండోరాను ఆయన ప్రారంభించారు. ప్రతి మాదిగ గూడెంలో దండోరా జండా ఎగిరే విధంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని విస్తరించారు. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలను కొన్ని వర్గాలకే దక్కాయని.. అందరికీ విస్తరింపజేయాలన్న ధ్యేయంతో ఆయన చేపట్టిన ఉద్యమం జాతీయ స్థాయిలో సైతం కలిగితురాయిగా నిలిచింది. అందుకే అత్యున్నత న్యాయస్థానం సైతం ఎస్సీ వర్గీకరణకు జై కొట్టింది. దీంతో జాతీయస్థాయిలో సైతం మందకృష్ణ మాదిగ పేరు మార్మోగింది. ఇప్పుడు మందకృష్ణ మాదిగను రాజకీయంగా ప్రోత్సహించాలని ఎన్డీఏ నిర్ణయించుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయంలో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి విజయసాయిరెడ్డి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ పార్టీ ద్వారా తనకు లభించిన రాజ్యసభ పదవిని సైతం ఆయన వదులుకున్నారు. దీంతో ఏపీ నుంచి రాజ్యసభ పదవి ఖాళీ అయింది. ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ తరుణంలో రకరకాల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే ఈ సీటు బిజెపికి విడిచి పెట్టాలని ఆ పార్టీ పెద్దలు కోరినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు అన్నామలై పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మరోవైపు ఢిల్లీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీని సైతం ఏపీ నుంచి రాజ్యసభకు పంపిస్తారని టాక్ నడుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో మందకృష్ణ మాదిగ పేరు తెరపైకి వచ్చింది. దీని వెనుక చంద్రబాబు వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది.ఎస్సీ వర్గీకరణ చేపట్టి.. మెజారిటీ ఎస్సీ ఉప కులాల్లో ఎన్డీఏ కూటమి పార్టీలకు ఆదరణ పెరిగింది. ప్రధానంగా మాదిగ, రెల్లి ఉప కులాల నుంచి విశేష స్పందన వస్తోంది. వాస్తవానికి ఎస్సీ సామాజిక వర్గం ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన మద్దతు దారుగా ఉంది. కానీ 2024 ఎన్నికల్లో ఎస్సీల్లో స్పష్టమైన చీలిక కనిపించింది. దానిని అలాగే ఉంచుకోవాలంటే ఎస్సీ వర్గీకరణ అనేది చేయాలని చంద్రబాబు ప్లాన్. అందుకే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన మరుక్షణం.. ఎస్సీ రిజర్వేషన్ అమలు చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ నివేదిక ఇచ్చిందో లేదో అమలు చేసి చూపించారు. అదే సమయంలో ఆది నుంచి ఎస్సీ వర్గీకరణ విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు మందకృష్ణ మాదిగ అనేక సందర్భాల్లో మద్దతు తెలిపారు. అదే సమయంలో మొన్నటి ఎన్నికల్లో తెలంగాణలో సైతం బిజెపికి మద్దతు ప్రకటించారు. రెండు చోట్ల ఎన్డీఏ అభ్యర్థులు గెలుపు కోసం కృషి చేశారు. అందుకే ఇప్పుడు



మందకృష్ణ మాదిగ పేరును తెరపైకి తెచ్చి.. తెలుగు రాష్ట్రాల్లో ఎన్డీఏ లబ్ధి పొందేలా ప్లాన్ చేస్తున్నారు చంద్రబాబు.వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలోఅధికారంలోకి రావాలన్నది బిజెపి ప్లాన్. అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగానే బీసీ నేత కృష్ణయ్యకు రాజ్యసభ పదవి ఇచ్చింది. ఇప్పుడు మందకృష్ణ మాదిగ కు ఇస్తే.. బీసీలతో పాటు మాదిగ సామాజిక వర్గం బిజెపి వైపు వస్తుందన్నది ప్లాన్. ఇదే విషయాన్ని బిజెపి అగ్ర నేతలకు చంద్రబాబు వివరించినట్లు తెలుస్తోంది. మంద కృష్ణ మాదిగకు రాజ్యసభ పదవి ఇస్తే తెలంగాణతో పాటు ఏపీలో రాజకీయంగా లబ్ధి పొందవచ్చని వారి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మొత్తానికైతే అనూహ్యంగా పెద్దల సభలో మందకృష్ణ మాదిగ అడుగుపెట్టడం ఖాయమని తేలుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# పర్యాటకులపై ఉగ్రదాడి అమానుష చర్య వాకార్స్ అసోసియేషన్ అధ్యక్షులు అంకరి కుమార్

మంథని కశ్మీర్ లోని పహల్గాంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అమాయక పర్యాటకులను టెర్రరిస్టులు కాల్చి చంపిన ఘటన అత్యంత హేయమైన చర్య అని వాకార్స్ అసోసియేషన్ అధ్యక్షులు అంకరి కుమార్ అన్నారు. శుక్రవారం మంథని ప్రభుత్వ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పహల్గాం దుర్ఘటనలో మృతులైన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణ రహితంగా కాల్పులు జరిపి 28 మంది అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్నారన్నారు అతిక్రూరమైన ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# రోజూ రెండుసార్లు మజ్జిగ తాగండి..! బరువు తగ్గండి ...! లావుగా ఉండటం తప్పుకాదు. కాని తగ్గటం చాలా అవసరం ...!

భద్రాద్రి కొత్తగూడెం

అందుకని ఉపవాసం ఉండకూడదు. కానీ ఒళ్ళు పెంచే ఆహారం తినకూడదని తెలుసుకోవాలి. శరీరపు బరువు సమతుల్యమై.. శరీరాకృతి పాడవకుండా ఉండాలంటే.. ఆత్మస్థైర్యం ఉండాలి. ఇంకా శరీరపు బరువును పెంచే నెయ్యి, తీపి పదార్థాలు, పెరుగు, మాంసం, వేపుడు కూరలు, నూనె వస్తువులు ముఖ్యంగా వేరుశెనగ నూనె, దుంపకూరలు, మినుముతో చేసే పదార్థాలు తినకండి. మజ్జిగ ఒళ్ళును పెరగనివ్వదు. రోజూ రెండుసార్లు మజ్జిగ తాగండి.

అన్నం తినేముందు కనీసం నాలుగు గంటలు రాగి చెంబులో నిల్వ ఉంచిన నీటిని కొంచెం తాగండి. రోజూ పరగడుపున అరగ్లాసు గోరు వెచ్చని నీళ్ళలో చెమ్చాన్నర తేనె కలుపుకుని తాగండి. మధ్యాహ్నం నిద్రపోకండి. రాత్రి అన్నం తిన్నాక కనీసం వంద అడుగులు నడిచి అప్పుడు పడుకోండి.

ఇంకా అర గంట సేపు నడవటం, సూర్య నమస్కారాలు చేయడం మంచిది. ఇంకా మిరియాలు, అల్లం, పిప్పలి, ఉసిరికాయ, నిమ్మకాయ, జీలకర్ర, ధనియాలు, వాము.. వీటిని ఆహారంలో చేర్చుకోవాలి. చారు, కూర, పుదీనా చట్నీలో వీటిని చేర్చుకోవడం ద్వారా బరువు తగ్గవచ్చునని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

# వికలాంగులకు ట్రై సెకిల్స్, వీల్ ఛైర్లు పంపిణీ చేసిన ఎంపి చిన్ని

విజయవాడ

విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) సహకారంతో వికలాంగులకు ట్రై సైకిల్స్, వీల్ చైర్స్ ఉచితంగా పంపిణీ జరిగింది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లకి చెందిన వికలాంగులకు ట్రై సైకిల్స్, వీల్ చైర్స్ అందజేసారు.

లబ్దిదారులు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), రాష్ట్ర కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఫతావుల్లాహ్, తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు సొలంకి రాజు, టిడిపి సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, మాజీ మేయర్ తాడి శకుంతల, ఎన్టీఆర్ జిల్లా ఎమ్.ఎస్.ఎమ్.ఈ ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ మాదిగాని గురునాథం, పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు సుఖాసి సరిత, పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, పశ్చిమ నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు నమ్మిభానుప్రకాష్, బిసి నాయకులు పట్నాల హరిబాబు, క్లస్టర్ ఇన్చర్జ్ ధనేకుల సుబ్బారావు ,లోకేష్, బిసి సెల్ రాష్ట్ర నాయకులు గుర్రం కొండ, డివిజన్ అధ్యక్షులు నాగోతి రామారావు, శివాజీ ముదిరాజు , ఈశ్వరరావు, నాయకులు శ్యామ్, బడేషా, ఆలీ తదితరులు పాల్గొన్నారు. .

# బెజవాడలో ఉగ్ర కదలికలు..! నిఘా వర్గాలు అప్రమత్తం

విజయవాడ

విజయవాడలో కొందరికి

సిమితో సంబంధాలపై కేంద్ర నిఘావర్గాల సమాచారంతో పరిశీలన కొనసాగుతోంది. పది మంది అనుమానితుల గుర్తించారు, వారి కదలికలపై నిఘా పెట్టారు. విజయవాడలో నలుగురు.. శివారు ప్రాంతాల్లో మరో ఆరుగురు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరంతా ఏసీ మెకానిక్ లు, మసీదుల దగ్గర భిక్షాటన, బడ్డీకొట్లలో పనులు చేస్తున్నట్లు గుర్తించారు. ఒకప్పుడు నక్సల్స్, తర్వాత మావోయిస్టులకు షెల్టర్ జోన్ గా బెజవాడ వుండేది.

# అలరించిన సుందరకాండ ఏకపాత్రాభినయం.

కమాన్ పూర్

కమాన్ పూర్ మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాల స్వామి వారి దేవాలయం వద్ద శ్రీమాన్ సోమేశ్వర శర్మ, ప్రదర్శన హనుమాన్ సేవాసమితి ఆధ్వర్యంలో సుందరకాండ ఏక పాత్రాభినయం నృత్య ప్రదర్శన ఎంతో అలరించింది. గురువారం రాత్రి సుమారు రెండు గంటల పాటు సుందరకాండ ఏకపాత్ర నృత్య ప్రదర్శనకు వివిధ గ్రామాల నుండి భారీ ఎత్తున భక్తులు ప్రజలు హాజరై వీక్షించారు. ఎంతో ప్రావీణ్యత గల శ్రీమాన్ సోమేశ్వర శర్మ వందలాది ప్రదర్శనలు ఇవ్వడం జరిగిందని అలాగే లండన్ మరియు అమెరికా ప్రాంతాల్లో తమ ప్రదర్శన ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు, ఈ సందర్భంగా సోమేశ్వర శర్మను కమాన్ పూర్ హనుమాన్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు పిన్ రెడ్డి కిషన్ రెడ్డి, చిర్రసత్యం, సూర భాస్కర్, బొజ్జ చారి కొమ్ము శ్రీనివాస్ తో పాటు హనుమాన్ దీక్షపరులు కొట్టే శంకరయ్య, సజ్జనపు చొక్కయు, అవునూరి కిరణ్, కొట్టే సత్తయ్య, కడారి రమేష్ ఇత్తాయితలు పాల్గొన్నారు.

# గూగుల్ లో ట్రెండింగ్ టాపిక్ గా పహల్గామ్

హైదరాబాద్, ఏప్రిల్ 25,

జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిపై భారతదేశంలో మాత్రమే కాదు, పాకిస్తాన్‌లో కూడా వాతావరణం వేడెక్కింది. మంగళవారం అంటే ఏప్రిల్ 22న జరిగిన ఈ దాడిపై ఒకవైపు భారతదేశంలో కోపం, ఆవేదన వ్యక్తం చేస్తుంది. మరోవైపు పాకిస్తాన్ ఇంటర్నెట్ వినియోగదారులు కూడా ఈ ఘటన గురించి ఆరా తీస్తున్నారు జరుగుతున్న చర్చల్లో పాల్గొంటున్నారు. భారత్ చేపట్టే చర్యల గురించి తెలుసుకుంటున్నారు. ఈ దాడి తరువాత పాకిస్తాన్‌లోని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ చీ (గతంలో ట్విట్టర్) గూగుల్‌లో దీనికి రిలేటెడ్‌గా ఉండే కీవర్డ్స్ వేగంగా ట్రెండ్ అవుతున్నాయి. నివేదికల ప్రకారం, పాకిస్తాన్‌లోని ప్రజలు పెద్ద సంఖ్యలో 'పహల్గాం, పహల్గాం ఎటాక్, కాశ్మీర్, పుల్వామా, జమ్ము ' వంటి పదాల గురించి వెతుకుతున్నారు. ఈ ఉగ్రవాద ఘటన తరువాత భారతీయ సోషల్ మీడియాలో చఖజీష్ట్రజీశ్రీణజీమివతీతీనీతీతిబబింబిబిజీఞఎ, చఓనీటతి వంటి హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతుండగా, పాకిస్తాన్‌లో కూడా ఈ దాడిపై ప్రజల ఆసక్తి కనిపిస్తోంది. సోషల్ మీడియాలో పాకిస్తాన్ వినియోగదారులు ఈ దాడిపై వేర్వేరుగా స్పందిస్తున్నారు. ఈ దాడిపై పొరుగు దేశం పాకిస్తాన్ నుంచి ఒక అధికారిక ప్రకటన కూడా వచ్చింది. పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఈ ప్రకటన విడుదల చేశారు. ఈ దాడిలో పాకిస్తాన్‌కు ఎలాంటి సంబంధం లేదని ఖండించారు. అయితే, సోషల్ మీడియాలో పాకిస్తాన్ వినియోగదారుల ప్రతిస్పందన ద్వారా ఈ ఘటన అక్కడ కూడా కలకలం రేపిందని స్పష్టమవుతోందిఅదే సమయంలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా స్పందించారు. ఉగ్రవాదాన్ని భారతదేశం సహించదని ఆయన అన్నారు. అంతేకాదు దానికి తగిన ప్రతిస్పందన ఇస్తుందని అన్నారు. అలాగే ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఢిల్లీలోని ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, 'ఈ దాడి అమానుషమైనది మాత్రమే కాదు, సిగ్గుచేటు ప్రయత్నం. దీనికి స్పందన కచ్చితంగా బలంగా ఉంటుంది. చేసిన వాళ్లనే కాకుండా దీని వెనుక ఉన్న వారిని కూడా బయటకు లాగుతాం' అని అన్నారు.గూగుల్‌లో ట్రెండ్ అవుతున్న కీవర్డ్‌లు భారతదేశం మాత్రమే కాదు, పాకిస్తాన్ ప్రజలు కూడా పహల్గాం దాడికి సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి ఆసక్తిగా ఉన్నారని స్పష్టంగా తెలుస్తోంది. సెర్చ్ ట్రెండ్స్ ద్వారా పాకిస్తాన్ పౌరులు భారత్-పాక్ సంబంధాలపై దీని ప్రభావాన్ని గురించి ఆందోళన చెందుతున్నారని వెల్లడైంది.

## కశ్మీర్ కొండల్లో ఉగ్రవాదులు

శ్రీనగర్, ఏప్రిల్ 25, (జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలోని బైసరన్ వ్యాలీలో జరిగిన ఉగ్రదాడి దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించింది. లష్కర్?ఎ?తొయిబాతో సంబంధం ఉన్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) బాధ్యత వహించిన ఈ దాడిలో 26 మంది, అందులో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ పౌరుడు మరణించారు. ఉగ్రవాదులు కార్బైన్‌లు, అఓ?47 రైఫిళ్లతో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటన తర్వాత, కేంద్ర ప్రభుత్వం భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛను మంజూరు చేసింది, ఉగ్రవాదులను అంతమొందించేందుకు తీవ్ర శోధన కార్యకలాపాలను ప్రారంభించింది.పహల్గాం దాడి తర్వాత, భారత సైన్యం, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సంయుక్తంగా పూంఛ్, బారాముల్లా, పహల్గాం అడవుల్లో ఉగ్రవాదుల కోసం భారీ శోధనను ప్రారంభించాయి. హెలికాప్టర్‌లు, డ్రోన్‌లతో ప్రతి అంగుళాన్ని జల్లెడ పడుతున్నాయి. ఈ ఆపరేషన్‌లో అత్యాధునిక సాంకేతికత ఉపయోగించబడుతోంది, ఇందులో డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన నెట్రా డ్రోన్‌లు 240 డిగ్రీల కవరేజ్‌తో రియల్?టైమ్ డేటాను అందిస్తాయి. ఇజ్రాయెల్ నుంచి దిగుమతి చేసుకున్న ఇఒ/చి?2090 రాడార్ సిస్టమ్స్ 450 కిలోమీటర్ల పరిధిలో లక్ష్యాలను గుర్తిస్తాయి. ఇస్రో ఉపగ్రహాల నుంచి పొందిన రియల్?టైమ్ ఇమేజరీ ఉగ్రవాదుల స్థానాలను ఖచ్చితంగా గుర్తించడంలో సహాయపడుతోంది.

# అమరావతి రైతులు, మహిళలకు గొప్ప అవకాశం

విజయవాడ, ఏప్రిల్ 25,

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవం కోసం ప్రధాని మోదీ వచ్చే నెల 2వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. ఈ సందర్భంగా వలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ప్రధాని చేతుల మీదుగా జరగనున్నాయి. అయితే ఈ సందర్భంగా అమరావతిలో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు కూటమి సర్కార్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇక ప్రధాని సభలో రాజధాని ప్రాంత రైతులు, మహిళలకు గొప్ప అవకాశం కల్పించనున్నారు.గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్సీపీ ప్రభుత్వం 3 రాజధానుల ప్రకటన చేసిన తర్వాత.. అమరావతి ప్రాంత రైతులు, మహిళలు చేసిన అసమాన పోరాటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అమరావతిని రాజధానిగా కొనసాగించాలని.. 3 ఏళ్లకు పైగా నిరసనలు, ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేసిన సంగతి తెలిసిందే. ఇక గతేడాది జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలై టీడీపీ-జనసేన-బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి విజయం సాధించి.. అధికారంలోకి వచ్చింది. దీంతో మళ్లీ రాజధానిగా అమరావతినే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే గతంలో 2014లో అమరావతి ప్రారంభోత్సవానికి పునాది రాయి వేసిన ప్రధాని మోదీ.. ఇప్పుడు మరోసారి అమరావతి నిర్మాణంలో పాలుపంచుకోనున్నారు. ఈ క్రమంలోనే అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు మే 2వ తేదీన ప్రధాని మోదీ.. ఆంధ్రప్రదేశ్ రానున్నారు. అమరావతి రాజధాని, సీఆర్డీఏ పరిధిలో సుమారు రూ.లక్ష కోట్లతో చేపట్టే పనులకు నరేంద్ర మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పురపాలకశాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. అదే సమయంలో భారీ సభను ఏర్పాటు చేయనున్నారు. ఈ సభకు 5 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. అయితే సభస్థలి వద్ద మొత్తం 3 వేదికలు ఏర్పాటు చేయనున్నారు. ఈ సభలో అమరావతి ప్రాంత రైతులు, మహిళలకు గొప్ప అవకాశం కల్పించనున్నారు. 3 వేదికల్లో ఒకదానిపై 30 మంది అమరావతి రైతులు, మహిళలు, రాజధాని పరిరక్షణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబ సభ్యులను కూర్చునేందుకు అవకాశం కల్పించనున్నారు.5 లక్షల మంది రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఏపీ సర్కార్ అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇక ప్రధాని మోదీ.. హెలిప్యాడ్ దిగిన తర్వాత అక్కడి నుంచి సభాస్థలానికి చేరుకునే వరకు 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా అక్కడి ఏర్పాట్లను గుంటూరు పోలీస్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్, సీఆర్డీఏ, పోలీస్ అధికారులతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు. వాహనాలు, జనం రద్దీని నియంత్రించడం.. పార్కింగ్ సమస్యలను పరిష్కరించడంపై అధికారులకు నారాయణ సూచనలు చేశారు. మే 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని మోదీ గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుని.. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సభాప్రాంగణం వద్దకు వస్తారని తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సభ జరుగుతుందని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతిలో పర్యటించిన సీఎం చంద్రబాబు వెంటనే రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. రూ.41 వేల కోట్ల పనులకు టెండర్లు పూర్తై పనులు కూడా ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ పనులను ప్రధాని మోదీ చేతుల మీదుగా మళ్లీ ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. మొత్తం రాజధాని అమరావతిలో రూ.లక్ష కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

# తిరుపతి స్టేషన్ రూ.850 కోట్లతో అభివృద్ధి పనులు

తిరుపతి, ఏప్రిల్ 25,

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే స్టేషన్‌లు కొత్త అందాలను అద్దుకుంటున్నాయి.. అమరావతికి కీలకంగా ఉన్న రైల్వే స్టేషన్‌లకు మహర్దశ వస్తోంది. అమరావతి సమీపంలోని మంగళగిరి రైల్వే స్టేషన్‌తో పాటుగా విజయవాడ రైల్వే స్టేషన్ కేంద్రం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూపురేఖలు మారబోతున్నాయి.. అత్యాధునిక సదుపాయాలతో స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ పథకం కింద విజయవాడ రైల్వే స్టేషన్ త్వరలో విమానాశ్రయంలా మారనుంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.850 కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నారు. రైల్వే బోర్డు దీనికి సంబంధించిన డీపీఆర్‌ను ఆమోదించాల్సి ఉంది.. ఆమోదం రాగానే పనులు మొదలవుతాయి. విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నారు.విజయవాడ రైల్వే స్టేషన్ దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కీలకమైనది.. ఇక్కడ ప్రతిరోజు లక్ష మంది ప్రయాణికులు, అదే పండుగలు, సెలవు రోజుల్లో ఈ సంఖ్య రెండు లక్షల వరకు ఉంటుంది. మొత్తం 10 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి.. ప్రతిరోజు 250కి పైగా ప్రయాణికుల రైళ్లు, 80 గూడ్సు రైళ్లు విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. విజయవాడ రైల్వే స్టేషన్‌కు ఐదు ప్రవేశ ద్వారాలతో అరుదైన గుర్తింపు పొందింది. ప్రతి ఏటా ఏకంగా రూ.500 కోట్ల ఆదాయం వస్తుండటంతో గతేడాది బెజవాడ రైల్వే స్టేషన్ ఎన్ఎస్‌జీ 01 హోదా కూడా పొందిన సంగతి తెలిసిందే.ప్రస్తుతం స్టేషన్లో ఉన్న ప్రవేశ ద్వారాలు చిన్నగా ఉన్నాయి.. వాటిని వెడల్పు చేయనున్నారు. వాహనాల పార్కింగ్ కోసం ఎక్కువ స్థలం కేటాయిస్తారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లు, భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు. స్టేషన్ మొత్తం కొత్తగా కనిపించేలా మార్పులు చేస్తారు. లైటింగ్, ఎస్కలేటర్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను విశాలంగా నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నారు. అలాగే




ప్రయాణికుల కోసం మంచి విశ్రాంతి గదులు, ఏసీ, నాన్ ఏసీ గదులు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. రిజర్వేషన్ కేంద్రాలు, వెయిటింగ్ హాళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర షాపులు కూడా ఉంటాయి.విజయవాడ రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు పెంచుతున్నా ప్రయాణికుల రద్దీకి సరిపోవడం లేదు. విశ్రాంతి గదులు, ప్లాట్‌ఫాంలు, లిఫ్టులు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, పార్కింగ్ స్థలం తక్కువగా ఉన్నాయి. ఈ మేరకు అమరావతి రాజధాని కావడం వల్ల రాబోయే ఐదేళ్లలో విజయవాడ స్టేషన్‌కు రద్దీ మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అందుకే అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించారు.డీపీఆర్‌కు వీలైనంత త్వరగా కేంద్రం ఆమోద ముద్ర వేసేలా రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీలు ప్రయత్నిస్తే అభివృద్ధి పనులు మొదలవుతాయంటున్నారు. అంతేకాదు అమృత్ పథకం కింద కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని రాయనపాడు, గుణదల, గుడివాడ, మచిలీపట్నం రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. గుణదల పనులు దాదాపు పూర్తికాగా.. రాయనపాడు పనులు కూడా త్వరలో పూర్తవుతాయని చెబుతున్నారు అధికారులు.

# మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కేసులో మాధవరెడ్డి అరెస్ట్

మదనపల్లె

రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కేసులో అన్నమయ్య జిల్లా మదనపల్లె రెడ్డీస్ కాలనీకి చెందిన వైసిపి నేత, రైస్ మిల్ మాధవ రెడ్డిని గురువారం రాత్రి తిరుపతి సిఐడి పోలీసులు అరెస్టు చేశారు. సిఐడి డిఎస్పి కొండయ్య నాయుడు కథనం మేరకు.. గత ఏడాది జూలైలో జరిగిన ఫైళ్ళ దగ్ధం కేసులో ఏ టు ముద్దాయిగా ఉన్న మాధవరెడ్డి కండిషన్ బెయిలుపై బయట తిరుగుతూ ఉన్నాడు. ఈ కేసులో ఇప్పటికే సబ్ కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతం తేజ్ ను సీఐడి అధికారులు మూడు నెలల క్రితం అరెస్టు చేయగా ఈ రోజు మాధవరెడ్డిని సిఐడి అధికారులు అరెస్టు చేసినట్లు తెలిపారు..

## కాల్పులు ప్రారంభించిన పాకిస్థాన్

సీజ్ ఫైర్ ఎత్తేయడంతో నియంత్రణ రేఖ వెంబడి భారత్పై పాకిస్థాన్ కాల్పులు ప్రారంభించింది. పాక్ సైనికులు కాల్పులు మొదలుపెట్టారని, వారికి సైన్యం సమర్థంగా బదులిస్తోందని భారత సైనిక వర్గాలు తెలిపాయి. కాల్పుల విరమణ అమల్లో లేని కారణంగా సరిహద్దు వెంబడి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగే అవకాశం ఉంది..

## పాక్కు వత్తాసు పలికిన అస్సాం ఎమ్మెల్యే అరెస్ట్.. దేశద్రోహం కేసు నమోదు

గువహటీ

పహల్గాంలో ఉగ్రదాడిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అయితే, అస్సాంలోని మంకాచార్ నియోజకవర్గానికి చెందిన ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే అమినుల్ ఇస్లాం.. పహల్గాం ఘటనలో పాకిస్థాన్ను సమర్థిస్తున్నట్లు ఆరోపణలున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ సీరియస్ అయ్యారు. సీఎం ఆదేశాలతో ఎమ్మెల్యేని అరెస్టు చేసి, దేశద్రోహం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

## అక్బర్ నగర్ లో ఎంపి వంశికృష్ణ పర్యటన

పెద్దపల్లి

రామగుండం అక్బర్ నగర్ లో ఎన్టిపిసి బూడిద పైప్ లైన్ పగిలి ఇండ్లలోకి చేరి దెబ్బతిన్న ఇండ్లను పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పరిశీలించారు. నష్టపోయిన తమను ఆదుకోవాలనీ అయనను కాలనీ వాసులు కోరారు. ఎన్టిపిసి అధికారులను పైప్ లైన్ పగలడానికి గల కారణాలు ఎంపి తెలుసుకున్నారు.

వంశీ మాట్లాడుతూ ఫ్లాయాస్ అనేది ఒక విషపూర్తిమైంది... అలాంటి విషయం లో ఎన్టిపిసి యాజమాన్యం జాగ్రత్తలు పాటించాలి. ఈ యాష్ వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని అన్నారు. బూడిదతో నిండిన ఇళ్లను పరిశీలించి బాధితులను ఓదార్చారు. పైప్ లైన్ ప్రమాదంపై ఎన్టిపిసి అధికారులతో చర్చించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు.

రామగుండం ప్రజల రక్షణే ఎన్టీపీసీ ప్రథమ బాధ్యత. ఈ నిర్లక్ష్యాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

# యుద్ధం వస్తే..ఎవరి బలం ఎంత.. సైన్యం ఎంత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25,

భారత్ పాక్ మధ్య ఇప్పుడు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనగా.. తాజాగా పహల్గామ్ ఉగ్రదాడితో అవి తారస్థాయికి చేరుకున్నాయి. ఇప్పటికే పాకిస్తాన్‌పై అనేక ఆంక్షలు విధించిన భారత్.. కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశమై 5 కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో సింధూ జలాల పంపిణీ ఆపడం, పాక్ వాసులకు వీసాల రద్దు, అట్టారీ సరిహద్దు మూసివేత, భారత్‌లోని పాక్ అధికారుల తొలగింపు, ఇస్లామాబాద్‌లోని భారత అధికారులను వెనక్కి రప్పించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలకు ప్రతీకారంగా భారత్‌పై పాక్ కూడా అలాంటి నిర్ణయాలే తీసుకుంది. సిమ్లా ఒప్పందం రద్దు, భారత్‌తో వాణిజ్య సంబంధాలు తెంచుకోవడం, పాక్ ఎయిర్‌స్పేస్‌ను భారత్ ఉపయోగించుకోకుండా అడ్డుకోవడం, భారతీయులకు సార్క్ వీసాలు రద్దు, ఇస్లామాబాద్‌లోని భారత దౌత్య అధికారుల తగ్గింపు సహా పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొంది.భారత్‌తో పోల్చుకుంటే పాకిస్తాన్ జనాభా పరంగా, సైనిక పరంగా, ఆయుధాల పరంగా, ఆర్థిక పరంగా, రాజకీయ పరంగా, అంతర్జాతీయ సహకారం పరంగా అన్ని రంగాల్లో వెనకబడే ఉంది. ఇప్పటికే అడుక్కుతినే స్థాయిలో ఉన్న పాకిస్తాన్.. భారత్‌తో యుద్ధం వస్తే ఇంకా పాతాళానికి పడిపోతుందనే విషయం తెలిసినా.. ఆ దేశం కవ్వింపు చర్యలకు దిగుతూనే ఉంది. విదేశీ మారక నిల్వలు పూర్తిగా అడుగంటిపోయి.. రోజు గడవాలంటే విదేశాలు, విదేశీ సంస్థలు, అంతర్జాతీయ సంస్థల వద్ద చేతులు చాచి అడుక్కుంటోంది. పాక్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర పతనావస్థలో ఉంది. మరోవైపు.. అంతర్గతంగా పాక్‌లో అనేక రాజకీయ, వేర్పాటువాద సవాళ్లు ఉన్నాయి. ప్రభుత్వం, సైన్యం మధ్య కూడా సఖ్యత లేదు. ఒకవైపు ప్రత్యేక దేశం కోసం ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్న బలూచిస్తాన్.. ఇటీవలి కాలంలో పాక్‌కు పెద్ద



తలనొప్పిగా మారింది. ఇలాంటి సమయంలో భారత్‌తో యుద్ధం అంటే పాకిస్తాన్ ఇంకా నష్టపోవాల్సిన పరిస్థితే ఉంటుంది.మరోవైపు.. సైనిక పరంగా, ఆయుధాల పరంగా, రక్షణ శాఖ బడ్జెట్ పరంగా చూస్తే.. భారత్‌తో అసలు పాకిస్తాన్ పోటీపడే స్థితిలో కూడా లేదు. భారత్ వద్ద 14 లక్షల మంది సైనికులు ఉండగా.. పాకిస్తాన్ వద్ద కేవలం 6.5 లక్షల మంది సైన్యం మాత్రమే ఉంది. ఇక రిజర్వ్ ఫోర్స్‌లు భారత్ వద్ద 11 లక్షలు ఉండగా.. పాకిస్తాన్‌కు కేవలం 5 లక్షలు మాత్రమే ఉంది. 2024లో భారత రక్షణ బడ్జెట్ 81 బిలియన్ డాలర్లు కాగా.. పాకిస్తాన్ రక్షణ బడ్జెట్ 11 బిలియన్ డాలర్లు మాత్రమే కేటాయించారు. ఫైటర్ జెట్‌లు (సుఖోయ్-30 ఎంకేఐ, రఫేల్) భారత్ వద్ద 600 కంటే ఎక్కువ ఉండగా.. పాకిస్తాన్ వద్ద 350 (జేఎఫ్-17, ఎఫ్-16, మిరాజ్) ఉన్నాయి.యుద్ధ ట్యాంకులు భారత్ వద్ద 4,500కు పైగా ఉండగా.. పాక్ వద్ద కేవలం 2,400 మాత్రమే ఉన్నాయి. నౌకా శక్తిలో భారత్ వద్ద 1 ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, డిస్ట్రాయర్స్, సబ్‌మెరైన్లు ఉన్నాయి. కానీ పాకిస్తాన్ వద్ద నౌకా శక్తి పరిమిత సంఖ్యలోనే ఉంది. ఇక న్యూక్లియర్ ఆయుధాలు భారత్ వద్ద 160 నుంచి 170 ఉన్నట్లు అంచనా ఉండగా.. అదే పాకిస్తాన్ వద్ద 160 నుంచి 165 అణ్వాయుధాలు ఉన్నట్లు అంచనా ఉంది. ఈ ఒక్క అణ్వాయుధాల విషయంలో మాత్రం భారత్‌ను ఢీకొట్టే సత్తా పాకిస్తాన్‌కు కనిపిస్తోంది. మిస్సైల్ శక్తిలో భారత్ వద్ద అగ్ని, బ్రహ్మోస్ వంటి అగ్రశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ మిస్సైళ్లు ఉన్నాయి. అదే పాక్ వద్ద షాహీన్, గౌరీ, బాబుర్ మిస్సైళు ఉన్నాయి.పహల్గామ్ ఉగ్రదాడిని భారత్ చాలా తీవ్రంగా పరిగణిస్తోంది. అంతేకాకుండా ఈ దాడి చేసిన ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తీసుకువచ్చి మట్టిలో కలిపేస్తామని.. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర హెచ్చరికలు చేశారు. కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇలాగే తీవ్రంగా స్పందించారు. నేరుగా యుద్ధమార్గాన్నే ఎంచుకోకుండా భారత్ పలు దౌత్య, ఆర్థిక పరంగా చర్యలు తీసుకుంటోంది.యుద్ధం విషయంలో భారత్ పెట్టుకున్న రూల్ మాత్రం ఎన్నటికీ మారదు. మొదట ప్రత్యర్థి దాడి చేస్తేనే.. దానికి ప్రతిస్పందించడం తప్ప.. భారత్ ఎన్నడూ మొదట యుద్ధానికి కాలు దువ్వదు. ప్రస్తుతం ఇరు దేశాల సరిహద్దుల వద్ద పర్యవేక్షణ పెరిగినా, సైన్యం, ఆయుధాలను మోహరించినా.. యుద్ధం జరగడం అనేది చివరి పరిష్కారంగా మాత్రమే రెండు దేశాలు భావిస్తున్నాయి. ఎందుకంటే ఒకసారి యుద్ధం గనక ప్రారంభమైతే.. రెండు దేశాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. సైనిక పరంగా పాక్ కంటే అత్యంత బలంగా ఉన్న భారత్.. పాక్ కవ్విస్తే తప్ప యుద్ధభూమిలో అడుగుపెట్టదు. అయితే పాక్ వద్ద అణ్వాయుధాలు భారీగా ఉండటం.. తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకసారి అణ్వాయుధాలు ప్రయోగిస్తే.. దాని వల్ల కలిగే నష్టం ఊహించడం కూడా చాలా కష్టంగా ఉంటుంది.

## తాడేపల్లిగూడెం నిట్ సమీపంలో రోడ్డు ప్రమాదం. ఒకరు మృతి..మరోకరికి తీవ్ర గాయాలు

తాడేపల్లిగూడెం

నిట్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరోకరికి తీవ్ర గాయాల్యాయి. ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు ప్రయాణిస్తున్నారు. కరణం వెంకటేశ్వరరావు (30) సంఘటన స్థలంలోని మృతిచెందగా, నవీన్ అనే యువకుడు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాయలైన నవీన్ కి చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వెంకటేశ్వరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియాస్పత్రికి తరలించారు.

## పుల్వామా నిందితుల నివాసాలు పేల్చివేత

న్యూ ఢిల్లీ

పహల్గాం ఘటనలో నిందితులుగా భావిస్తున్న ఇద్దరు ఆదిల్ హుస్సేన్ తోకర్, ఆసి఩్ షేక్ ల నివాసాలను ఆర్మీ కూల్చివేసింది. గురువారం రాత్రి సైన్యం ఆ ఇద్దరి నివాసాల్లో పేలుగు పదార్థాలు పెట్టి పేల్చి వేసింది. తోకర్ అనంతనాగ్ జిల్లాకు, ఆసిఫ్ పుల్వామా జిల్లాకు చెందినవాడు. ఘటనలో పాలు పంచుకున్న మరో ఇద్దరి పాకిస్థాన్ దేశస్థుల పై 20 లక్షల బహుమతి ప్రభుత్వం ప్రకటించింది

## పదవ తరగతి పాసైయిన విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు, సత్కారం

అనపర్తి

తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభినందించారు. అనపర్తి బాలుర ప్రభుత్వ అన్నత పాఠశాల, రామవరం ప్రభుత్వ పాఠశాలలో జాబ్ రాలేదు పదో తరగతి చదివిన పలువురు విద్యార్థులకు ఈరోజు ఎమ్మెల్యే పుష్పగుచ్చాల అందించి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఈ ఏడాది మొట్టమొదటిసారిగా కాకినాడ జిల్లాకు చెందిన ఓ విద్యార్థిని 600 కు 600 మార్కులు సాధించి రికార్డు సృష్టించిందని , తమ నియోజకవర్గంలో అత్యధికంగా ప్రభుత్వ స్కూల్ విద్యార్థి 592 మార్కులు సాధించి రికార్డ్ సృష్టించాడని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ప్రమాణాలతో విద్యాబోధన చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయ బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు.

## బేగంపేటలో జై భీమ్ జై బాబు జై సంవిధాన్.

కమాన్ పూర్

. రామగిరి మండలంలోని బేగంపేట గ్రామంలో శుక్రవారం జై భీమ్ జై బాపు జై సంహిదాన్ కార్యక్రమాన్ని

రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొద్ద బాపన్న మరియు రామగిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కండే పోశం మరియు బేగంపేట గ్రామ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు.జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ భారీ ర్యాలీలో తాజా మాజీ ఎంపీపీ అరేల్లి దేవక్క – కొమరయ్య గౌడ్ పాల్గొన్నారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఫోటోలు, రాజ్యాంగం పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ప్రజలకు రాజ్యాంగం విలువను తెలుపుతూ తాజా మాజీ ఎంపీపీ రేల్లి దేవక్క – కొమరయ్య గౌడ్ గారు ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ....

కేంద్ర బీజేపీ పాలనలో రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం హక్కులను కాలరాస్తు, మహాత్మా గాంధీ చూపిన అహింస, శాంతి సిద్ధాంతాలను విస్మరిస్తుందన్నారు. భారత రాజ్యాంగాన్ని దేశ సమగ్రతను కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదముతో పెద్ద ఎత్తున ఉద్యమిద్దమని పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం అంటే ప్రధాని మోదీకి ఏమాత్రం విలువ లేదని, అందుకే పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ ను కించపర్చే విధంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడారని మండిపడ్డారు. భారత రాజ్యాంగం అంటే బీజేపీ దృష్టిలో పుస్తకం మాత్రమేనని, కానీ తమ దృష్టిలో రాజ్యాంగం అంటే పవిత్ర గ్రంథం అని పేర్కొన్నారు. దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసమే 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. పేదలంటే మోదీకి పట్టింపే లేదని, ఆయన ధ్యాసంతా దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడంపైనే ఉందని నాయకులు ధ్వజమెత్తారు.

ఈ కార్యక్రమంలో బేగంపేట కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు కల్వల శంకర్ యూత్ అధ్యక్షులు ఊదరి కుమార్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొరకొప్పుల తులసిరాం గౌడ్ తీగల రాజమల్లు శ్రీరాముల కుమార్ యాదవ్ బొంతల సదానందం కొత్తూరి మోహన్ సుద్దాల కిరణ్ లక్కార్తి మల్లయ్య గుండా శ్రీనివాస్ రేణికుంట్ల కొమురయ్య రేగళ్ళ రాజేశం అనవేణ రాజమల్లు మాతంగి కుమార్ రంగం దశరథం కందుకూరి శ్యామ్ అమ్మ సారయ్య బరుపటి కొమురయ్య ఆరంద రాజు లక్కార్తీ శ్రీను తాళ్లపల్లి అంజయ్య మరియు హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

.

# మే రాకుండానే మండుతున్న సూరీడు

అదిలాబాద్, ఏప్రిల్ 25,

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత వారం రోజులుగా ఎండ తీవ్రత పెరిగిపోయింది. నిప్పుల కొలిమిలా మారిపోయింది. బుధవారం గరిష్టంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో జిల్లాలో ఉదయం నుంచే భానుడు?. భగభగలా మండిపోతున్నాడు.దీంతో జిల్లాలోని ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో సైతం మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మూడు రోజులుగా అన్ని మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో అధికారులు ఆరెంజ్, రెడ్ అలర్ట్ జారీ చేశారు.ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పెళ్లిళ్లు, శుభకార్యాలకు వెళ్లేందుకు కూడా జనాలు జంకుతున్నారు. దాహం తీర్చుకునేందుకు చల్లని శీతల పానీయాల వైపు మొగ్గుచూపుతున్నారు. కొంత మంది వడదెబ్బకు గురై ఆసుపత్రుల పాలవుతున్న సంఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ లోని పలు ప్రాంతాలో ఐదు మంది వడ దెబ్బతో మృతి చెందినట్లు తెలిసింది.ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీలను విపరీతంగా వాడుతున్నారు. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తల ను పాటిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఇంట్లోంచి బయటకు రావడం లేదు.ఏప్రిల్ నెలలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఉంది. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. రానున్న మే మాసంలో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళనలో జనాలు ఉన్నారు. రోహిణి కార్తె నాటికి పరిస్థితి మరింత మారిపోయే అవకాశం ఉంది.

ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి?.

వేసవిలో వడదెబ్బ నుంచి రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు. తలనొప్పి, వికారం, కళ్లు తిరగడం, వాంతులు చేసుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని హెచ్చరిస్తున్నారు. ప్రతీరోజూ 5 నుంచి 6 లీటర్ల నీటిని తాగాలని, శీతల పానీయాలకు బదులు మజ్జిగ, నిమ్మ, పండ్ల రసాలు తాగడం ఉత్తమమని అంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఎండలో ప్రయాణం చేయకూడదని సూచిస్తున్నారు.

# హైడ్రా కొత్త లోగో రెడీ

హైదరాబాద్, ఏప్రిల్ 25, (

హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణ, ప్రకృతి విపత్తుల నిర్వహణకు ఏర్పాటు చేసిన హైడ్రా ఇకపై కొత్త లోగోతో కార్యకలాపాలను కొనసాగించనుంది. ఇప్పటి వరకూ ఈవీడీఎం లోగోతోనే పనిచేసిన హైడ్రా లోగో మార్చింది. హైదరాబాద్ నగరాన్ని సూచించేలా హెచ్ అక్షరంపై నీటి బొట్టు ఉన్న లోగోను రూపొందించారు. చెరవులను కాపాడుకుంటూ, జల సంరక్షణ చేపడుతూ హైదరాబాద్ ను విపత్తుల నుంచి రక్షించుకుందామనే సూచకంగా కొత్త లోగోను తీర్చిదిద్దారు.కొత్త లోగోను హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారికంగా ఆమోదించారు. హైడ్రా కార్యకలాపాలు, సిబ్బంది యూనిఫామ్, వాహనాలపై నూతన లోగోను ముద్రించనున్నారు. హైడ్రా అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో కొత్త లోగోను అప్డేట్ చేశారు.

బతుకమ్మ కుంటలోనే బతుకమ్మ ఉత్సవాలు

వచ్చే బతుకమ్మ ఉత్సవాల నాటికి బతుకమ్మ కుంటను సిద్ధం చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. బతుకమ్మ కుంటకు సంబంధించిన కోర్టు వివాదం మంగళవారం పరిష్కారమయ్యిందన్నారు. బుధవారం హైడ్రా కమిషనర్ అంబర్ పేటలోని బతుకమ్మ కుంటను సందర్శించారు. స్థానికుల సమక్షంలో బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు.యుద్ధ ప్రాతిపదికన ఈ చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ చెరువును పునరుద్ధరిస్తే పరిసరాలన్నీ ఆహ్లాదకరంగా మారుతాయని అన్నారు. పనులకు సహకరించాలని స్థానికులను కోరారు. ఈ కార్యక్రమానికి స్థానికులు పెద్దయెత్తున హాజరయ్యారు. అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తామని స్థానికులు కమిషనర్కు హామీ ఇచ్చారు.ఫిర్యాదు స్వీకరించిన 24 గంటల్లోనే మురుగు సమస్యకు హైడ్రా పరిష్కారం చూపింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలం మల్లంపేటలోని రామచంద్రయ్య కాలనీకి మురుగు ముప్పును తొలగించింది. చెన్నం చెరువు నుంచి రేళ్లకుంటకు వెళ్లే కాలువకు మధ్యలో ఆటంకాలు సృష్టించడంతో రామచంద్రయ్య కాలనీలో కొంత భాగం మురుగు ముప్పును ఎదుర్కొంది.మీటరుకు పైగా ఇళ్లు మురుగులో మునిగిపోవడంతో అక్కడి నివాసితులు ఇళ్లను ఖాళీ చేయాల్సి వచ్చింది. మురుగు నీటిలో మా ఇళ్లు నీట మునిగాయని.. నెల రోజులుగా ఇళ్లు ఖాళీ చేసి బయట తలదాచుకుంటున్నామని రామచంద్రయ్య కాలనీ వాసులు హైడ్రా ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు.

మురుగు నీటి సమస్య

దుండిగల్ మున్సిపాలిటీలోని చెన్నం చెరువుకు నిజాంపేట మున్సిపాలిటీ మురుగు నీరు వచ్చి చేరుతోందని.. ఆ నీరు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని రేళ్లకుంటకు చేరాల్సి ఉండగా ఆటంకాలు ఏర్పడ్డాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. రామచంద్రయ్య కాలనీకి పక్కన లే ఔట్ వేసిన వారు కాలువను మూసేయడంతో ఈ ఇబ్బంది తలెత్తిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు.ఈ ఫిర్యాదును గూగుల్ మ్యాప్స్తో పాటు శాటిలైట్ ఇమేజీలలో పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం హైడ్రా అధికారులు అక్కడకు చేరుకుని మురుగు కాలువను పునరుద్ధరించారు.దీంతో రామచంద్రయ్య కాలనీలో నిలిచిన మురుగు నీరు బయటకు వెళ్లింది. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో హైడ్రాకు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా 24 గంటలలోపే పరిష్కారం లభించడం పట్ల రామచంద్రయ్య కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

# భూ భారతి చట్టం ఆధారంగానే భూముల నిర్వహణ

వరంగల్, ఏప్రిల్ 25

తెలంగాణలో భూ భారతి చట్టం అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ఈ సేవలు పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చాయి. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. మరోవైపు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ అధికారులు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. మండలాల వారీగా వీటిని చేపడుతూ... కొత్త చట్టం ప్రయోజనాలను వివరిస్తున్నారుభూముల నిర్వహణతో పాటు రిజిస్ట్రేషన్ల వంటి అంశాలన్నీ కూడా భూ భారతి పోర్టల్ ఆధారంగానే జరగనున్నాయి. గతంలో ఉన్న ఆర్వోఆర్–2020ను రద్దు కావటంతో... భూ భారతి చట్టం ఆధారంగానే భూముల నిర్వహణ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ వంటి ప్రక్రియలో ప్రభుత్వం పలు మార్పులను కూడా తీసుకువచ్చింది.రైతులకు ఇబ్బందులు లేకుండా కొత్త చట్టంలో కీలక సెక్షన్లను పొందుపర్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. పట్టా భూముల యజమానుల హక్కుల సంరక్షణతోపాటు ప్రభుత్వ భూముల పరిరక్షణకు కూడా కొత్త చట్టంలో భద్రతాపరమైన సెక్షన్లను ఏర్పాటు చేశారు. పోర్టల్ లో చూస్తే లావాదేవీల నిర్వహణతో పాటు సమాచార సేవలను వేర్వురుగా పొందుపరిచారు. అయితే ఇందులో నిషేధిత భూముల జాబితాను కూడా పొందుపరిచారు.

నిషేధిత భూముల వివరాలను ఇలా చెక్ చేసుకోండి:

నిషేధిత భూమి వివరాలు తెలుసుకునేందుకు ముందుగా భూ భారతి అధికారిక పోర్టల్ లోకి వెళ్లాలి.

హోం పేజీలో కనిపించే సమాచార సేవల్లోకి వెళ్లాలి. ఇక్కడ నిషేధిత భూములు అనే ఆప్షన్ ఉంటుంది.

నిషేధిత భూముల ఆప్షన్ పై క్లిక్ మరో పేజీ ఓపెన్ అవుతుంది.

ఇక్కడ జిల్లా, మండలం, గ్రామ వివరాలను నమోదు చేయాలి. అక్కడ సూచించే కోడ్ ను ఎంట్రీ చేయాలి.

సబ్మిట్ చేస్తే గ్రామం వారీగా నిషేధిత భూముల వివరాలు డిస్ ప్లే అవుతాయి.

నిషేధిత భూములపై లావాదేవీలు నిర్వహించడానికి వీలు ఉండదు.

గతంలో ధరణి పోర్టల్ ఉండగానే..ఈ భూముల వివరాలను ప్రత్యేక కాలమ్ లో ఉంచారు. అయితే కొన్ని పట్టా భూములు కూడా ఈ జాబితాలో చేరాయనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి. వీటిని పరిశీలించి.. తొలగించే అధికారం కలెక్టర్లకు ఉండేది. అయితే ఈ విషయంలో చాలా ఇబ్బందులు ఉన్నాయనే విమర్శలు వచ్చాయి. అయితే ప్రస్తుతం భూమి స్వరూపానికి సంబంధించి పూర్తి వివరాలను సమర్పిస్తే... కలెక్టర్ పరిశీలించి... నిషేధిత జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందని ప్రభుత్వం చెబుతోంది.ఇక రాష్ట్రంలో భూ హక్కుల ఏ విధంగా సంక్రమించినప్పటికీ మ్యుటేషన్ చేసి రికార్డుల్లో నమోదు చేస్తారు. కొత్తగా ఇచ్చే పాసుపుస్తకాల్లో సర్వే మ్యాప్ ఉంటుంది. భూ సమస్యల పరిష్కానిరి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుంది. భూ హక్కుల రికార్డుల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చు. ధరణి వ్యవస్థలో అప్పీల్ వ్యవస్థకు చోటు కల్పించలేదు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అక్రమంగా ప్రభుత్వ భూములపై పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం ఉంటుంది.

## తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు పేగు బంధం.

చాలా పార్టీలు పుడుతుంటాయి పోతుంటాయి కానీ బిఆర్ఎస్ పార్టీ లక్ష్యాన్ని ముద్దాడింది.

కేసీఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతుకలను ఏకం చేసింది.

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలింది.

సిద్దిపేట

సిద్దిపేట నియోజకవర్గం కేంద్రం రంగదాం పల్లి అమర వీరుల స్థూపం నుండి వరంగల్ సభ వద్దకు వెయ్యి మంది విద్యార్థి, యువత పాదయాత్ర చేపట్టారు. అమర వీరుల కు నివాళ్లు అర్పించి.. జెండా ఊపి పాదయాత్ర ను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు.

మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ కాశ్మీర్ పెహల్గంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి 2 నిమిషాలు శ్రద్ధాంజలి ఘటిద్దాం. ఈరోజు మన సిద్దిపేట నుండి పాదయాత్రలో బయలుదేరినటువంటి విద్యార్థి యువ మిత్రులకు, ఉద్యమకారులకు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అందరికీ శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నాను. 44 డిగ్రీల ఎండను కూడా లెక్క చేయకుండా 1500 మంది 27వ తేదీన వరంగల్ లో జరగబోయే పార్టీ రజతోత్సవం కోసం స్వచ్ఛందంగా తరలివచ్చిన మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు. తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు అవినావాభావ సంబంధం ఉంది. ఆనాటి కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష కైనా, 2001లో బీఆర్ఎస్ పార్టీ ప్రారంభమైన సందర్భమైన సిద్దిపేటకు పేగు బంధం ఉందని అన్నారు.

బిఆర్ఎస్ పార్టీ పుట్టిన నాడు చాలామంది చాలా రకాలుగా మాట్లాడారు. గాలి బుడగ లాంటిది పాలపొంగు లాంటిదని అమాసకు పుట్టింది పున్నానికి పోతది అని కూడా అన్నారు. మనల్ని అన్న వాళ్లు ఆగమయ్యారు తప్ప టిఆర్ఎస్ పార్టీ ఆగం కాలేదు. చాలా పార్టీలు పుడుతుంటాయి పోతుంటాయి కానీ బిఆర్ఎస్ పార్టీ లక్ష్యాన్ని ముద్దాడింది. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా చరిత్రలో నిలిచింది. కేసీఆర్ గారి నాయకత్వంలో అంబేద్కర్, గాంధీల మార్గంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాం. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు బోధించు, సమీకరించు, పోరాడు అని అన్నారు. అదే పద్ధతిలో కెసిఆర్ గారు, ప్రొఫెసర్ జయశంకర్ గారు ప్రజలందరికీ తెలంగాణ ఎందుకు అవసరమో బోధించారు. సమైక్యవాదులపై, ఢిల్లీ పెద్దలపై పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించారు. 1969లో చాలామంది అమరులయ్యారు. ఎంతోమంది విద్యార్థులు మరణించారు. పోలీస్ కాల్పుల్లో 369 మంది చనిపోయారు. ఆనాటి హింసను దృష్టిలో పెట్టుకొని మలిదశ ఉద్యమంలో కేసీఆర్, గాంధీ చూపిన బాటలో తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపారు.

14 ఏళ్ల ఉద్యమం, 10 ఏళ్ల ప్రభుత్వం ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం. ఏ పాత్ర అయినా బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ పక్షం. రాష్ట్ర సాధన కోసం, మన ఆత్మగౌరవం కోసం 14 ఏళ్లు పోరాటం చేసాం. పదేండ్ల టిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి సంక్షేమాల్లో దేశానికి ఆదర్శంగా నిలిపాము. ధాన్యం ఉత్పత్తిలో, తలసరి ఆదాయంలో, జిఎస్డిపిలో తెలంగాణను నెంబర్ వన్ గా నిలిపాము. అంతేకాదు డాక్టర్ల ఉత్పత్తిలో కూడా తెలంగాణ నెంబర్ వన్. తెలంగాణ రాష్ట్రం ప్రారంభించిన పథకాలు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చింది, కాంగ్రెస్ చెప్పిన మోసపూరిత మాటలు, అబద్ధపు హామీలు ప్రజలకు

## బాబోయ్ ఉచిత ఆర్ టిసి ప్రయాణం పథకం వద్దు

కొడిమ్యాల,ఓ అవ్వా!ఎటుపోతున్న వే సంచులు బాగా పట్టుకుని పోతున్నావు అని అడిగింది లచ్చమ్మ నర్సమ్మను ఎటు లేదవ్వ గా జగిత్యాల లో ఉల్లిగడ్డలు, ఎల్లి పాయలు ఇక్కడికన్నా అగ్గో అత్తున్నాయట గాడికోయ్యి తీసుకొద్దామని పోతున్నా అని చెప్పింది నర్సవ్వ అయ్యో గట్లనా జర్ర ఆగరాదు నేనుకూడా అత్త సంచులు పట్టుకొని అన్నది లచ్చవ్వ ఇద్దరు కలసి బస్టాండ్ కాడి కెళ్ళి నిలవడి బస్ కోసం ఎదురు సూడంగానే వాళ్ళ ఇంటి దగ్గర ఉన్న ఎల్లవ్వ కనిపించింది. ఓ ఎల్లవ్వ నువ్వేటు పోతున్నావే బస్సు కాడికచ్చినవ్ అనంగానే ఎటులేదే మీరు మాట్లాడుకునేది ఇన్నానే నేను గూడ ఉల్లి గడ్డలు కొంకుందామని అచ్చిన అన్నది నీ బస్ ఇంకా అత్తలేదు గీ బస్సు ఎప్పుడు అత్తదో ఏమో అని అటు ఇటు సూడంగానే కట్టే పట్టుకుని అటు ఓ ముసలయ్య అచ్చిండు. అగో గీ తాతమన రాములు తాత లెక్కనే ఉన్నాడు.ఓ రాములు తాతా ఏడికే పోతున్నావు గీ బస్సు దగ్గరికి అచ్చినవ్ అని అడగంగానే జగితలా పొయ్యత్త బిడ్డా!ఓ రెండు ధోతుల జోడలు కొంకచ్చు కుంటా అని అచ్చిన గాని మమ్మల్ని బస్సు యెడ ఎక్కనిత్తండ్లు మొత్తం ఆడోళ్ళ తోటే నిండి పాయె మేము ఎక్కి నంక నిలువడి నిలవడి సచ్చేంత పనవుతుంది అనగానే ఎల్లవ్వ ఇంకా నయ్యం నీ పని నయ్యముంది ఇప్పుడు, ఇప్పుడు మా ఆడోళ్ళను సూడంగానే బస్సు ఆపకుంటా బుర్రు మని పోతుండ్లు ఆర్టీసీ వాళ్లకు కూడ అర్థమయ్యింది

## ఉగ్రవాద చర్యలను ఖండిస్తూ ప్రజాసంఘాల కొవ్వొత్తుల ర్యాలీ.

బద్వేలు

(సిపిఎం) అనుబంధ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బద్వేలు నాలుగు రోడ్ల సెంటర్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు గురువారం రాత్రి కాశ్మీర్ పహల్గాన్ పర్యాటక ప్రాంతంలో పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు చేసిన దాడులను ఖండిస్తూ దేశంలో శాంతిని నెలకొల్పాలని ఉగ్రవాద సంస్థలను రూపుమాపాలని, దాడులకు పాల్పడి అమాయక ప్రాణాలు తీసిన నిందితులకు ఉరిశిక్ష విధించాలని కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను మాట్లాడుతూ

జమ్మూ కాశ్మీర్ లోని పహల్గావ్ పర్యాటక ప్రాంతంలో టూరిస్టులపై ఉగ్రవాదులు కాల్పుల జరిపి 28 మంది అమాయకులను పొట్టనపెట్టుకున్నారు. ఈ సంఘటనను పిరికిపందా చర్యగా అభివర్ణిస్తూ తీవ్రంగా ఖండించారు.ఉగ్రవాదుల కాల్పులలో అసువులుబాసిన, నేలకొరిగిన భారత ముద్దు బిడ్డలకు కన్నీటి నివాళులు అర్పిస్తూ ప్రగాఢ శ్రద్ధాంజలి సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు,స్వల్పంగా గాయపడ్డవారు,తీవ్రంగా గాయపడ్డా వారు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరారు.మృతిచెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. అక్కడ తిరిగి మామూలు పరిస్థితులు ఏర్పడాలని అందుకు అందరూ సహకరించాలని సంయమనంతో సామరస్యపూర్వకంగా సోదరభావంతో మెలగాలని అన్నారు మృతి చెందిన కుటుంబాలకు భారత ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి 5 కోట్ల రూపాయలు ఆర్థిక సాయం అందించి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు

## మైనింగ్ ఆఫీసు మూసివేత

మహబూబ్ నగర్, ఏప్రిల్ 25,

నాగర్ కర్నూల్ జిల్లా మైనింగ్ శాఖ కా ర్యాలయానికి అద్దె భవనం దొరకక అవస్థలు తప్పడం లేదు. గత కొద్దికాలంగా ప్రస్తుతం ఉన్న అద్దె భవనంలో కార్యాలయం ఖాళీ చేయాలని యజమానులు ఒత్తిడి తేవడంతో అధికారులు అయోమయంలో పడ్డారు. గత ప్రభుత్వం అన్ని శాఖలకు ఉమ్మడిగా జిల్లా ల్లో కలెక్టరేట్ కార్యాలయాన్ని నిర్మించినప్పటికీ ఆ కార్యాలయంలో మైనింగ్ శాఖకు భవనాన్ని కేటాయించకపోవడంతో చాలాకాలంగా మార్కెట్ యార్డ్ సమీపంలోని అదే భవనంలోనే మైనింగ్ శాఖను కొనసాగించారు. గత కొన్ని నెలలపాటు ఖాళీ చేయా లని ఒత్తిడి తెచ్చినప్పటికీ అధికారులు స్పం దించకపోవడంతో గత రెండు రోజుల క్రితం అద్దె భవనం యజమానులు కార్యాలయానికి ఇంటర్నెట్, విద్యుత్ కనెక్షన్ వంటివి తొలగించారు.కార్యాలయానికి సేవ లు అందుకునే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని ఆయా రెంట్ బిల్డింగ్ కోసం అన్వేషణ జరుగుతున్నప్పటికీ రెంట్ ధర ఎక్కువగా చెబుతుండడంతో అధికారులు అయోమయంలో పడ్డారు. ప్రభుత్వం నిర్మించిన పాత కలెక్టరేట్ భవనం, ప్రస్తుత కలెక్టరేట్ భవనాలు అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని కార్యాలయాలు నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని విమర్శలు ఉన్నాయి.ప్రస్తుతం అద్దె భవనం దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్న మై నింగ్ శాఖ కార్యాలయానికి కూడా జిల్లా ఉన్నతాధికారులు కార్యాలయాన్ని ఏర్పాటుకు సహకరించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులు.ప్రస్తుతం జిల్లాలో మన ఇసుక వాహనం పథకం అమల్లోకి తీసుకొచ్చిన నేపథ్యంలో వినియోగదారులు సామాన్యులు ఇంటి నిర్మాణం కోసం ఇసుక ఆన్లైన్ దరఖాస్తులను చేసుకుంటున్నారు. దీంతోపాటు ఆయా వినియోగదారులకు రీచ్ నుం చి ఇసుకను తరలించిన అనంతరం వాటి నివేదికలను ఆన్లైన్లో పొందుపరచాల్సి ఉం టుంది ఆ తర్వాతే ఇసుక ట్రాక్టర్ యజమానులకు చెల్లింపులు బ్యాంకు ద్వారా పూర్తి అ వుతాయి. దీంతోపాటు మైనింగ్ శాఖ సం బంధించిన అన్ని సేవలు నిలిచిపోయాయి. దీంతో సామాన్యులు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం అద్దె భవనం కోసం జిల్లాలో అక్కడక్కడ అన్వేషణ జరుగుతోంది. ఒక ప్రాంతంలో అద్దె భవనాన్ని పరిశీలించారు. శుక్రవారం లేదా శనివారం రో జు పరిశీలించి మైనింగ్ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం సేవలు ఫోన్ ద్వారా కొనసాగిస్తూనే ఉ న్నామంటున్నారు అధికారులు.

## పరిసరాల పరిశుభ్రత-ప్రజారోగ్యానికి తొలిమెట్టు

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ. బాలకృష్ణ నాయక్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి జెండా ఊపి ర్యాలీ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ

మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాపిస్తుంది. మురుగునీటి నిల్వలున్న ప్రాంతాల్లో ఈ దోమల లార్వా వృద్ధి చెందుతుంది. మలేరియా జ్వరానికి మూలం 'ప్లాస్మోడియం' అనే పరాన్నజీవి. ఇది దోమలతో ముఖ్యంగా ఆడ అనాఫిలస్ దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తిస్తుంది. దోమలు తమ గుడ్లను రక్తంలో వృద్ధి చేసుకోవటానికి మనుషులను కుడుతుంటాయి. అప్పటికే మలేరియాతో బాధపడుతున్న వ్యక్తిని దోమ కుడితే దానికీ పరాన్నజీవి సోకుతుంది. ఆ దోమ మరొకరిని కుట్టినప్పుడు లాలాజలం ద్వారా వ్యక్తి రక్తంలోకి పరాన్నజీవి ప్రవేశిస్తుంది. ఇది కాలేయంలోకి చేరుకొని పరిపక్వమై, వృద్ధిచెందుతుంది. కాలేయ కణాలను ఇన్ఫెక్షన్‌కు గురిచేస్తుంది. ఆ కణాలు విచ్చిన్నం కావటం వల్ల పరాన్న జీవులు రక్తంలోకి, తర్వాత ఎర్ర కణాలకు చేరుకుని ఇన్ఫెక్షన్‌ను కలుగ చేస్తాయి. మలేరియా కారక పరాన్న జీవిలో ఫాల్సిఫారమ్, వైవాక్స్, ఒవేల్, మలేరియా అనే ముఖ్య రకాలున్నాయి. రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ వారి ఆదేశాల మేరకు ఏడాది పొడవునా దోమల నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాం.

గతంతో పోలిస్తే మలేరియా కేసులు ఏటేటా తగ్గుముఖం పడుతుండటం ఎంతో స్వాగతించాల్సిన విషయం. దోమలు కుట్టకుండా చూసుకోవటం-దోమ తెరలు వాడటం, ఇంటి పరిసరాల్లో దోమల నియంత్రణ మందులు వాడటం - కొబ్బరి చిప్పలు, పాతటైర్లు వంటివి లేకుండా చూసుకోవాలి.-కూలర్లలో నీరు లేకుండా చూసుకోవాలి.

మలేరియా లక్షణాలైన చలి, వణుకుతో కూడిన జ్వరం-తలనొప్పి, ఒంటినొప్పులుపరీక్షలు ర్యాపిడ్ డయాగ్నొస్టిక్ టెస్ట్ (ఆర్‌డిటి) ప్యారాసైట్ ఎఫ్, వి ద్వారా ఫాల్సిఫారమ్, వైవాక్స్ రకం మలేరియాను నిర్ధారించొచ్చు.

రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో...జాతీయ కీటక జనిత వ్యాధి నిరోధక కార్యక్రమం (ఎన్‌వీబీడీసీపీ)లో భాగంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, జపనీస్ ఎన్సెఫలైటిస్, ఫైలేరియాకు సంబంధించిన కార్యక్రమాలను రాష్ట్రప్రభుత్వం, ఎన్‌హెచ్‌ఎం సహకారంతో నిర్వహిస్తోంది. మలేరియా, ఇతర వ్యాధికారక దోమలతో కలిగే వ్యాధులకు ప్రాథమిక నిర్ధారణ, పూర్తి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. సమగ్ర దోమ నియంత్రణ చర్యలు (ఎల్ఎల్ఐఎన్ఎన్)లో భాగంగా పురుగుమందుల స్ప్రే (ఐఆర్ఎస్)లను ప్రతిరోజూ విద్యా శాఖ, గ్రామీణ మంచినీటి సరఫరా, పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖల సమన్వయంతో సంయుక్తంగా నిర్వహిస్తున్నాం. 2025 లో జనవరి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మలేరియా కేసులు నమోదు కాలేదు.ప్రత్యేక కార్యక్రమాలు వెక్టర్ కంట్రోల్ అండ్ హైజీన్ యాప్ ప్రవేశపెట్టి వ్యాధి కారక, దోమల నియంత్రణ చర్యలపై డిజిటల్ ప్లాట్‌ఫాంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అమలు చేస్తున్నాం. జిల్లా కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్ఓలు సమీక్షా సమావేశాలు నిర్వహించి వ్యాధుల నియంత్రణపై చర్యలు తీసుకుంటున్నారు.గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు స్వచ్ఛత, వ్యక్తిగత రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నాం.

## అఘోరి అరెస్ట్... విచారణ... హై డ్రామా..

మెదక్, ఏప్రిల్ 25,

ఘోరీ.. తెలుగు రాష్ట్రాల్లో కొన్నాళ్లుగా హల్‌చల్ చేస్తోంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన యువకుడు శ్రీనివాస్ అఘోరీగా మారినట్లు ప్రచారం చేసుకుంటున్నాడు. శ్మశానంలో పూజలు, రోడ్లపై హల్‌చల్ చేస్తూ.. పోలీసులను, సామాన్యులను ఇబ్బంది పెడుతున్నాడు. ఇటీవల ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడు. అఘోరీపై పోలీసులకు ఫిర్యాదులు అందడంతో అరెస్టు చేశారు. అతడిని జైలుకు తరలించే క్రమంలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.తెలుగు రాష్ట్రాల్లో కొన్నాళ్లుగా హల్‌చల్ చేస్తున్న అఘోరీ తెలంగాణలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి. అతడి వయసు 27 ఏళ్లు. కేదార్‌నాథ్‌లో సాధువుగా జీవిస్తున్నాడు. అతను తన కలలో 'అర్ధనారీశ్వర' రూపాన్ని చూసినట్టు పేర్కొన్నాడు, దీని స్ఫూర్తితో లింగ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకోవాలని నిర్ణయించాడు. ఈ ప్రక్రియ రెండు దశల్లో జరిగినట్లు వైద్యులు గుర్తించారు.

చెన్నైలో మొదటి శస్త్రచికిత్స..

మొదటి దశలో, అతని శరీరం నుంచి కొన్ని పురుష అవయవాలు (పురుష జననేంద్రియాలు) తొలగించబడ్డాయి. ఈ శస్త్రచికిత్స తర్వాత అతను ఇండోర్‌కు తిరిగి వచ్చి, తన ఆధార్ కార్డు, పాన్ కార్డు వంటి అధికారిక పత్రాలను నవీకరించాడు.జూన్ 28, 2024న, ఇండోర్‌లోని భండారీ హాస్పిటల్‌లో డాక్టర్ అశ్విన్ దాస్ (ప్లాస్టిక్, కాస్మెటిక్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్) నేతృత్వంలో ఐదు గంటల పాటు జరిగిన శస్త్రచికిత్సలో అతను పురుషుడి నుంచి స్త్రీగా పూర్తిగా మార్పిడి చెందాడు. ఈ శస్త్రచికిత్స విజయవంతమైనట్లు వైద్యులు ప్రకటించారు. అయితే, వైద్యులు అతను 'అర్ధనారీశ్వర' రూపాన్ని సాధించినట్లు పేర్కొన్న ఊహాగానాలను ఖండించారు, ఇది కేవలం లింగ మార్పిడి శస్త్రచికిత్స అని స్పష్టం చేశారు.

అఘోరీలు శైవ సంప్రదాయంలో భాగమైన సాధువులు, వారు సాంప్రదాయిక సామాజిక నిబంధనలను తిరస్కరించి, ఆధ్యాత్మిక మోక్షం కోసం తీవ్రమైన సాధనలు చేస్తారు. అఘోరీ సంస్కృతిలో 'అర్ధనారీశ్వర' ఒక పవిత్ర భావన, ఇది పురుష, స్త్రీ శక్తుల సమన్వయాన్ని సూచిస్తుంది. ఈ సాధువు తన లింగ మార్పిడిని ఈ ఆధ్యాత్మిక ఆదర్శంతో ముడిపెట్టినప్పటికీ, ఇది అఘోరీ సంప్రదాయంలో సాధారణ ఆచారం కాదు. అఘోరీలు సాధారణంగా శారీరక మార్పుల కంటే మానసిక, ఆధ్యాత్మిక సాధనలపై దృష్టి పెడతారు.

లింగ మార్పిడి శస్త్రచికిత్స లేదా జెండర్ అఫర్మేషన్ సర్జరీ, ఒక వ్యక్తి యొక్క శారీరక లక్షణాలను వారి లింగ గుర్తింపుకు అనుగుణంగా మార్చే వైద్య ప్రక్రియ. ఈ సాధువు విషయంలో, అతను పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈ ప్రక్రియలో సాధారణంగా ఈ క్రింది దశలు ఉంటాయి.వైద్య పరీక్షలు: శస్త్రచికిత్సకు ముందు, రోగి యొక్క శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి హార్మోన్ స్థాయిలు, రక్త పరీక్షలు, మానసిక సంప్రదింపులు నిర్వహించబడతాయి. జెండర్ డిస్ఫోరియా (లింగ గుర్తింపు వల్ల కలిగే మానసిక ఒత్తిడి) నిర్ధారణ కీలకం.హార్మోన్ థెరపీ: ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ వంటి హార్మోన్లను నిర్వహించడం ద్వారా స్త్రీ లక్షణాలను పెంపొందించడం. ఈ సాధువు హార్మోన్ థెరపీ తీసుకున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి.


జైలులో హైడ్రామా..

ఇదిలా ఉంటే.. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన అఘోరీ శ్రీనివాస్, శ్రీవర్షిణీ కేసు జైలు వరకూ వివాదాస్పదంగా మారింది. మోసం కేసులో అరెస్టయిన అఘోరీ, జైలులో తన భార్య వర్షిణిని తన వద్దే ఉంచాలని రచ్చ చేయడం, ట్రాన్స్‌జెండర్ గుర్తింపు వల్ల జైలు అధికారులు ఎదుర్కొన్న సమస్యలు ఈ కేసును మరింత ఆసక్తికరంగా మార్చాయి. అఘోరీ శ్రీనివాస్, ఒక మహిళా నిర్మాతను పూజల పేరుతో రూ.10 లక్షలు తీసుకుని మోసం చేసిన ఆరోపణలతో మోకిలా పోలీసులచే అరెస్టయ్యాడు. ఫిర్యాదు ఆధారంగా, పోలీసులు అతన్ని ఉత్తరప్రదేశ్‌లో అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించారు. రెండు గంటల పాటు విచారణ తర్వాత, అతన్ని చేవెళ్ల కోర్టులో హాజరు చేయగా, న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.సంగారెడ్డి జిల్లాలోని కంది సబ్ జైలుకు తరలించినప్పుడు అఘోరీ శ్రీనివాస్ అరుపులు, కేకలతో హైడ్రామా సృష్టించాడు. తన భార్య శ్రీవర్షిణిని తనతోనే ఉంచాలని, ఆమె లేకుండా తాను ఉండలేనని గట్టిగా అరిచాడు. అతని ప్రవర్తనతో జైలు సిబ్బంది, పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అఘోరీ తన భార్యతో ఒకే బ్యారక్‌లో ఉండాలని డిమాండ్ చేయడం వివాదానికి కారణమైంది.రిమాండ్ ప్రక్రియలో భాగంగా అఘోరీని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించగా, వైద్యులు అతన్ని ట్రాన్స్‌జెండర్‌గా గుర్తించారు. ఈ గుర్తింపు కారణంగా కంది సబ్ జైలు అధికారులు అతన్ని జైలులోకి అనుమతించడానికి నిరాకరించారు. అఘోరీని మహిళా ఖైదీల బ్యారక్‌లో ఉంచాలా, పురుష ఖైదీల బ్యారక్‌లో ఉంచాలా అనే సందిగ్ధంతో జైలు అధికారులు పోలీసులకు తిరిగి అప్పగించారు. మరోసారి లింగ నిర్ధారణ పరీక్షల తర్వాత, కోర్టు సూచనల మేరకు అఘోరీని చంచల్‌గూడ జైలుకు తరలించారు.అఘోరీతోపాటు అరెస్టయిన శ్రీవర్షిణీ, తన తల్లిదండ్రులతో వెళ్లేందుకు నిరాకరించింది. దీంతో ఆమెను హైదరాబాద్‌లోని కస్తూర్బా గాంధీ హోంకు తరలించారు. వర్షిణీ తనతో జైలులో ఉంచాలని అఘోరీ చేసిన డిమాండ్ పోలీసులకు సవాలుగా మారింది. వర్షిణీ కుటుంబం, ఆమెను అఘోరీ మాయమాటలతో బలవంతంగా పెళ్లి చేసుకున్నాడని ఆరోపిస్తోంది, ఇది ఈ కేసుకు మరో కోణాన్ని జోడించింది.అఘోరీ రచ్చ మధ్యలో, పోలీసులు సహనంతో వ్యవహరించారు. అఘోరీ తన భార్యతో కలిసి విచారణలో సహకరిస్తానని చెప్పడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, అతని ట్రాన్స్‌జెండర్ గుర్తింపు, జైలు బ్యారక్ సమస్య, వర్షిణీతో సంబంధం వంటి అంశాలు ఈ కేసును సంక్లిష్టంగా మార్చాయి.

## భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

అపారమైన మేధస్సుతో భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త మన శ్రీనివాస రామానుజన్. 1887 డిసెంబర్ 22న తమిళనాడులోని ఉత్తర అర్కాట్ జిల్లా ఈరోడ్‌లో ఓ నిరుపేద కుటుంబంలో పుట్టాడు. ఆయన తలిదండ్రులు కోమలమ్మాళ్, శ్రీనివాస అయ్యంగార్. పన్నెండేళ్ల వయసులోనే అసాధారణ బాలునిగా గుర్తింపు పొందిన రామానుజన్ 'ఆయిలర్' సూత్రాలు, త్రికోణమితికి చెందిన అనేక సమస్యలను స్వయంగా సాధించాడు. రామానుజన్‌లోని తెలివితేటలను బయటకు తీసుకువచ్చిన గ్రంథం కార్ రాసిన 'సినాప్సిస్', అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్ద పెద్ద ప్రొఫెసర్లు సైతం ఎన్నో పుస్తకాలు రిఫర్ చేసినా అర్థం చేసుకోలేకపోయిన సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవాడు. అప్పటికే అందులో చాలా




సమస్యలు నిరూపించబడ్డాయన్న విషయం తెలియకపోవడంతో వాటిని తన పద్ధతితో సాధించాడు.కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ ఎఫ్.ఏ. పరీక్ష తప్పాడు. తర్వాత మద్రాస్‌లోని పచ్చయ్యప్ప కాలేజీలో చదువుకు చేరాడు. అక్కడ గణితోపాధ్యాయునిగా ఉన్న ఎన్.రామానుజాచారి సమస్యలను కఠినంగా చెప్పుంటే, రామానుజన్ వాటిని తనదైన రీతిలో తక్కువ సోపానాలతో సాధించే వాడు. రామానుజన్ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. తర్వాత రామానుజం 1909లో జానకి అమ్మాళ్‌ను పెళ్లి చేసుకున్నాడు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై పరిశోధనలు కొనసాగించేవాడు. 1913లో మద్రాస్ పోర్ట్‌ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా?వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రే హెరాల్డ్ హార్డీ (1877-1947)కి పంపాడు. ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి.హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్సిటీకి ఆహ్వానించారు. అక్కడ రాత్రనక, పగలనక గణితం పైనే ఏకాగ్రత పెట్టి కొత్త సిద్ధాంతాలను కనిపెట్టాడు రామానుజన్. ఫిబ్రవరి 28, 1918లో 'ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ' గౌరవం పొందిన రెండవ భారతీయుడిగా, 1918 అక్టోబర్‌లో 'ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజ్' గౌరవం పొందిన మొదటి భారతీయుడిగా చరిత్రకెక్కాడు. 1919 మార్చిలో భారతదేశానికి తిరిగి వచ్చాడు. మనదేశ ఔన్నత్యాన్ని జగతికి చాటిన రామానుజన్, అనారోగ్య కారణంగా చివరకు ఏప్రిల్ 26, 1920న అస్తమించాడు. అప్పటికి ఆయన వయసు 33. చివరిదశలో 'మ్యాజిక్ స్క్వేర్', 'ప్యూర్ మాథ్స్'కు చెందిన నంబర్ థియరీ, 'మాక్ తీటా ఫంక్షన్స్' చాలా ప్రసిద్ధి పొందాయి. వీటి ఆధారంగా ఆధునికంగా కనుగొన్న స్ట్రింగ్ థియరీ, క్యాన్సర్ పరిశోధనలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని 1986-87 రామానుజన్ శతజయంతి ఉత్సవాల్లో గణిత శాస్త్రవేత్తలు ప్రకటించారు. రామానుజన్ నోటు పుస్తకాలపై, గణిత సిద్ధాంతాలపై రామానుజన్ ఇన్స్టిట్యూట్‌లో, అమెరికాలోని 'ఇలినాయిస్' యూనివర్సిటీలో నేటికీ రీసెర్చ్ జరుగుతోంది. గణితశాస్త్రంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును 'జాతీయ గణితదినోత్సవం'గా ప్రకటించింది.

## అంగట్లో సరుకుల్లా బర్త్ సర్టిఫికెట్లు.. రూ.15 వేలు

హైదరాబాద్, ఏప్రిల్ 25,

దేశంలో ఉగ్రదాడి అలజడి రేపిన సమయంలో తెలంగాణలోని కొందరు ఉద్యోగుల తీరు ఆందోళన కలిగిస్తోంది. కొందరు ఉ ద్యోగులు డబ్బు కోసం ఎంతకైనా తెగించి అంగట్లో సరుకుల్లా ఎవరికైనా బర్త్ సర్టిఫికెట్లు జారీ చేసే స్థాయికి దిగజారడం దేశ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తుంది. ప్రభుత్వ యంత్రాంగంలోని కొందరు వ్యక్తులు స్వార్థపూరితంగా వ్యవహరించడం వల్ల దేశ భద్రత ప్రమాదంలో పడుతోంది. వ్యవస్థలోని అవినీతిని, బాధ్యతారాహిత్యాన్ని కూడా తెలియజేస్తున్నాయి.దేశంలో అక్రమంగా ప్రవేశించిన ఇద్దరు బంగ్లాదేశీయులకు నకిలీ బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు జారీ చేసి వారు పాస్‌పోర్ట్ పొందేలా చేసిన ఘటనలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నార్సింగి మున్సిపాలిటీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి జి.సుధీర్ కుమార్ , మహ్మద్ ముఖీబ్, టి.సాయి కిరణ్, జి.రంజిత్‌కాంత్ , బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ హసిబుల్, రోహన్ షాలను అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ప్రధాన నిందితుడు హసిబుల్ ఢాకా నుంచి నాలుగేళ్ల క్రితం రూ.25 వేలు చెల్లించి అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించాడు. కోల్‌కతాలో జోయన్ చౌదరి అనే నకిలీ పేరుతో ఆధార్ కార్డు పొందాడు. అక్కడ కరాటే కోచ్‌గా పనిచేస్తూ.. 2023లో మలక్‌పేట్‌కు చెందిన జయాచౌదరితో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం పెంచుకున్నాడు. తాను కోల్‌కతా పౌరుడినంటూ నమ్మించి ఆమెను వివాహం చేసుకున్నాడు.మలక్‌పేట్‌లో నివాసం ఉంటున్న హసిబుల్.. నార్సింగి మున్సిపాలిటీ ఉద్యోగి సుధీర్‌కు రూ.15,000 లంచం ఇచ్చి నకిలీ జనన ధ్రువీకరణ పత్రం సేకరించాడు. తరువాత ఓటరు కార్డు కూడా పొందాడు. ఇదే మార్గంలో బంగ్లాదేశ్‌కే చెందిన రోహన్ షాకూ నకిలీ బర్త్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు ఇప్పించాడు. వీరిద్దరూ పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేయగా.. అనుమానాస్పదంగా ఉండటంతో టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగింది. మఫ్టీలో నార్సింగి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లిన పోలీసులు ఫేక్ బర్త్ సర్టిఫికెట్ కావాలని అడగగానే సుధీర్ అంగీకరించడంతో బండారం బయటపడింది. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి మలక్‌పేట్ పోలీసులకు అప్పగించారు.

## ఆపరేషన్ కర్రెగుట్ట...

ఖమ్మం, ఏప్రిల్ 25,

: కర్రెగుట్ట చుట్టూ యుద్ధవాతావరణం నెలకొంది. ఆపరేషన్ కగార్ పేరుతో 20 వేల మంది భద్రతా బలగాలు తెలంగాణ?ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టను చుట్టుముట్టాయి. అదే సమయంలో హెలికాప్టర్ ద్వారా ఆపరేషన్ కూడా నడుస్తోంది. మూడు రోజులుగా ఈ ఆపరేషన్ నడుస్తోంది. కర్రె గుట్టపై దాదాపు వెయ్యి మంది మావోయిస్టులు డెన్ ఏర్పాటు చేసుకున్నట్టు సీఆర్పీఎఫ్ అనుమానిస్తోంది. కర్రెగుట్టపై ది మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత హిడ్మా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆపరేషన్ కగార్ పేరుతో ఇప్పటి వరకు దండకారణ్యంలోని అబూజ్ మడ్ ప్రాంతాన్ని దాదాపుగా స్వాధీనం చేసుకున్నాయి కేంద్రబలగాలు. అబూజ్ మడ్‌కు ఆనుకొని కర్రెగుట్ట మొదలవుతుంది.కర్రెగుట్టకు సంబంధించి.. బీజాపూర్ జిల్లాలోని ఊసూరు బ్లాక్, ఆవు పల్లి, పూజారి కాంకేడ్ ప్రాంతాలు ఛత్తీస్ గఢ్‌లో ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాలకు విస్తరించి ఉన్నాయి. కర్రె గుట్టలపై తెలంగాణలో పాముడూరు, తడపల, జెల్ల, దోలి, చెలిమల, బందారు పల్లి, ముకునూరు గ్రామాలుండేవి. ఈ గ్రామాలను గతంలోనే ఖాళీ చేయించి వారికి వేరే ప్రాంతాల్లో పునరావాసం కల్పించారు. అయితే పెనుగోలు గ్రామస్తులు మాత్రం అక్కడే ఉన్నారు.అబూజ్ మడ్ పై కేంద్ర బలగాలు ఆపరేషన్ మొదలు పెట్టగానే మావోయిస్టులు సమీపంలోనే ఉన్న కర్రెగుట్టకు మారినట్టు తెలుస్తోంది. ఇక్కడ డెన్ లు ఏర్పాటు చేసుకొని ఆయుధాలను దాచినట్టు చెబుతున్నారు. ఇక్కడికి పోలీసులు, భద్రతా బలగాలు రాకుండా గుట్ట చుట్టూ ల్యాండ్ మైన్స్ పెట్టినట్టు సమాచారం. పలువురు ఆదివాసీలు వేట కోసం కర్రెగుట్టకు వెళ్లి ఇటీవల మృత్యువాత కూడా పడ్డారు.మావోయిస్టులు కర్రెగుట్టపై డెన్ ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం అందుకున్న కేంద్ర బలగాలు స్పెషల్ ఆపరేషన్ కు శ్రీకారం చుట్టాయి. మూడు వైపుల నుంచి గుట్టను చుట్టుముట్టాయి. దీంతో పాటు హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా అణువణువూ తనిఖీ చేస్తున్నాయి. అబూజ్ మడ్ పరిధిలోని ఆదివాసీ గూడేలకు రోడ్లు వేసుకుంటూ ఆపరేషన్ మొదలు పెట్టిన సీఆర్పీఎఫ్ బలగాలు ప్రస్తుతం కర్రెగుట్ట వద్దకు చేరుకున్నాయి. అయితే ఈ ఆపరేషన్ రాష్ట్ర పోలీసులకు సంబంధం లేకుండా జరుగుతోంది. అదే విధంగా ఫారెస్టు అధికారులు సైతం కర్రెగుట్ట వైపు రావద్దంటూ సీఆర్పీఎఫ్ ఆదేశాలు జారీ చేసింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వరకు స్థానిక పోలీసులు ఎంటర్ అయ్యే అవకాశం లేదు.మావోయిస్టులు కర్రెగుట్టను సేఫ్టీ ప్లేస్‌గా భావిస్తున్నారు. ఇదొక గుట్టల సముదాయం.. ఒక గుట్ట దిగగానే కొంత మైదాన ప్రాంతం ఉంటుంది.. ఆ వెంటనే గుట్ట స్టార్ట్ అవుతుంది. గుట్టల కింద సహజ సిద్ధంగా ఉండే బంకర్లు, సొరంగ మార్గాలున్నాయి. ఒక్కో బంకర్ చాలా విశాలంగా ఉంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సెలయేళ్లు కూడా ప్రవహిస్తూ ఉంటాయి. మూడు కాలాలూ నీటి వసతి ఉంటుందని అంటున్నారు. అయితే అబూజ్ మడ్‌ను సీఆర్పీఎఫ్ బలగాలు స్వాధీనం చేసుకున్న దరిమిలా.. మావోయిస్టులు కర్రెగుట్టలను సేఫ్టీ ప్లేస్ గా భావించే భారీ మొత్తంలో ఆయుధాలను తీసుకొని ఇక్కడికి వచ్చి ఉంటారని తెలుస్తోంది. ఇక్కడే డెన్ ఏర్పాటు చేసి ఉంటారనే అనుమానాలున్నాయి.ఆపరేషన్ కగార్‌లో భాగంగా కర్రెగుట్టపై బేస్ క్యాంప్ ఏర్పాటు చేసుకొనేందుకు సీఆర్పీఎఫ్, భద్రతా బలగాలు రెడీ అవుతున్నాయి. ఇక్కడ ఆయుధాలను భద్రపర్చిన మావోయిస్టులు బలగాలపైకి దాడి చేస్తే వారిని పట్టుకోవడమే ఈ బేస్ క్యాంప్ లక్ష్యమని అంటున్నారు. ఈ ఆపరేషన్ మూడు నెలల పాటు కొనసాగుతుందని తెలుస్తోంది. ఏది ఏమైనా మావోయిస్టుల ఏరివేతలో ఇది అతి పెద్ద ఆపరేషన్ గా చెబుతున్నారు.

# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర గురించి గ్రామ గ్రామాన సమావేశాలు పెట్టి వివరించాలి : కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రిల్ 25: భారత రత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆ మహనీయుని జీవిత చరిత్ర పై జిల్లా కేంద్రంలోని రోటరీ క్లబ్ భవనంలో జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు అధ్యక్షతన జిల్లా సదస్సు నిర్వహించడం జరిగింది.మొదట మొన్న కాశ్మీర్ లో ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారికి సంతాపం తెలియజేస్తూ మౌనం పాటించడం జరిగింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర గురించి గ్రామ గ్రామాన, వాడ వాడలో సమావేశాలు పెట్టి వివరించాలని అన్నారు. ప్రతి ఒక్కరు తెలుసుకోవలసిన చరిత్ర ఆ మహనీయునిది అని ప్రతి బీజేపీ కార్యకర్త ఈ విషయంలో ముందుకు రావాలని అన్నారు. చిన్న నాటి నుండి ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి ప్రపంచంలోనే అతి పెద్ద భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే స్థాయికి ఎదగటంలో ఆయన జీవితం గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవలసిన అవసరం ఉందని అన్నారు. ముఖ్య వక్త గా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ, స్వతంత్రం అనంతరం లోకసభ ఎన్నికల్లో అంబేద్కర్ ని ఓడించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని, తమ కుటుంబ సభ్యులకు భారత రత్నలు ఇప్పించుకున్న చరిత్ర కలిగిన నెహ్రూ కుటుంబ సభ్యులకు అంబేద్కర్ కి భారత రత్న ఇవ్వదానికి కూడా మనసు రాలేదని అన్నారు. బీజేపీ సంకీర్ణంలోని ప్రభుత్వం వారికి భారత రత్న ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు కూడా పార్లమెంట్ భవనంలో ఆ మహనీయుని విగ్రహం లేదని,ఆయన విగ్రహాన్ని పార్లమెంట్లో ప్రతిష్ఠించిన చరిత్ర బీజేపీ ది అని గుర్తు చేశారు. ఆ మహనీయుని ఆశయాల సాధన బీజేపీ, నరేంద్ర మోదీ తో సాధ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే అరుణా తార, మాజీ మంత్రి నేరేళ్ళ ఆంజనేయులు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, రంజిత్ మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, రాము, రవీందర్ రావు, కార్యక్రమ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 25: నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం బిచ్కుంద మండల కేంద్రంలోని కే.జయశ్రీ ఇంటిని కలెక్టర్ పరిశీలించారు. తాను, తన భర్త కూలీ పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించు కుంటున్నామని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలనీ కలెక్టర్ ను కోరారు. ప్రస్తుతం ఉన్న షెడ్ లో నివసిస్తున్నామని, తన కున్న ఇంటి స్థలంలో ఇల్లు కట్టుకుంటానని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే 5 లక్షల రూపాయలతో పాటు ఇతర మార్గాల ద్వారా ఇల్లు నిర్మించుకుంటానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# 14 ఏప్రిల్ 2025 నుండి మీ సేవా కేంద్రంలో భూ సమస్యలపై దరఖాస్తు సమర్పిస్తే భూ భారతి చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటాం : జిల్లా కలెక్టర్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 25: 14 ఏప్రిల్ 2025 నుండి మీ సేవా కేంద్రంలో భూ సమస్యలపై దరఖాస్తు సమర్పిస్తే భూ భారతి చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని,భూ భారతి చట్టం పై జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులను జిల్లాలో ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగా శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలోని రైతువేదిక, బిచ్కుంద మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో నిర్వహించిన అవగాహన సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి చట్టం 14 ఏప్రిల్ 2025 న ప్రారంభించడం జరిగిందని . చట్టం పై ప్రజలకు, రైతులకు అవగాహన సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ధరణి స్థానంలో భూ భారతి భూమి హక్కుల చట్టం తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని, 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసి %ప్ర%లో క్రమబద్ధీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీఓ లు విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్ , స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. అట్టి వాటిని రికార్డులలో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇస్తారని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీచేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్ తరహాలో రైతులకు భూధార్ కార్డుల జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి చట్టంలో ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఇంకే నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. గతంలో ధరణిలో అప్పీలు కు ఆస్కారం లేనందున సివిల్ కోర్టుకు వెళ్లవలసి ఉండేదని, ప్రస్తుతం తహసీల్దార్ ఇచ్చిన తీర్పులో అభ్యంతరం ఉంటే ఆర్డీఓ కు, ఆర్డీఓ తీర్పులో అభ్యంతరం ఉంటే కలెక్టర్ కు అప్పీలు. చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. హక్కుల రికార్డుల్లో ఉన్న లైసెన్సు గల సర్వేయర్ తో భూమి సర్వే చేయించుకొని మ్యాప్ తయారు చేయించుకున్నట్లయితే మండల సర్వేయర్ సరి చూసిన తర్వాత తహసీల్దార్ పాసుపుస్తకంలో సర్వే మ్యాప్ ను ఉంచడం



జరుగుతుందన్నారు. ఏ మైనా భూ సమస్య ఉంటే సదరు పార్టీలకు నోటీసులు జారీ చేయాలని ఎవిడెన్స్ రికార్డు చేయాలనీ స్పీకింగ్ ఆర్డర్స్ స్పష్టమైన రిమార్కులతో నమోదు చేయాలని తెలిపారు. ప్రస్తుతం మీ సేవలో దరఖాస్తు పెడితే భూ భారతి చట్టం ప్రకారం విచారణ చేపట్టి నిర్ణీత సమయంలోగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలపై విచారణ చేసి స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భూ భారతి చట్టం లింగంపేట్ మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు జరుగుచున్నదని తెలిపారు. ప్రజలందరూ భూ భారతి పై అవగాహన కల్పించుకోవాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పంటలు సాగు చేసే పొలాల్లో ఫాం పాండ్స్ నిర్మించుకోవాలని, భూ గర్భ జలాలు అంతరించి పోతున్న తరుణంలో వర్షపు నీటిని భూమిలోకి ఇంకిపోయేవిధంగా ఫాం పాండ్స్, ఇంకుడు గుంతలు, కాంటూరు కందకాలు ఏర్పాటుచేసుకోవాలని రైతులకు సూచించారు. వీటి నిర్మాణాలవలన భూగర్భ నీటి సాంద్రత పెరుగుతుందని తెలిపారు. ప్రతీ గ్రామ పంచాయతీలో కనీసం 5 ఫామ్ పాండ్స్ నిర్మించాలని, ఉపాధి హామీ పథకం క్రింద ఈ పనులు చేపట్టవచ్చని తెలిపారు. ఉపాధి హామీ సిబ్బంది రైతులకు వివరించి ప్రోత్సహించాలని తెలిపారు. జుక్కల్ లో జరిగిన అవగాహన సదస్సులో రైతులు రమేష్, రాములు మాట్లాడుతూ, రైతుల సమస్యలు దృష్టిలో పెట్టుకొని భూ భారతి చట్టం తీసుకురావడం జరిగిందని తెలిపారు. స్థానిక అధికారులు ద్వారా సమస్యలు పరిష్కరించే విధంగా చట్టం తేవడం మంచి పరిణామం అని అన్నారు. అంతకుముందు చట్టం పై రూపొందించిన వివరాలను ఆయా తహసీల్దార్లు వివరించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు భూ భారతి పై రూపొందించిన వీడియో ప్రదర్శించారు.ఈ సదస్సులో ఆయా మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు, పలువురు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు ఎండతీవ్రతపై అవగాహన సదస్సు



మందమర్రి,(భారత శక్తి విలేకరి), ఏప్రిల్ 25: మందమర్రి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో ఎండతీవ్రతపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ మధ్యకాలంలో ఎండలు తీవ్రమవుతున్నాయనితెల్లవారక ముందే విధులు ప్రారంభించాలని సూచించారు.

ప్రతి కార్మికుడు తమ వద్ద వాటర్ బాటిల్ ఉంచుకోవాలని, తలకు టవల్ చుట్టుకోవాలని, అలసట ఏర్పడితే ఓఆర్ఎస్ వాటర్ లో కలుపుకుని తాగాలని తెలిపారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటి రెవెన్యూ ఆఫీసర్ కృష్ణప్రసాద్, సానిటరీ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ శ్యాంబాబు, సిస్టం మేనేజర్ శిరీష్, మెడికల్ హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్ తదితరులు ఉన్నారు.

# ఎంఎస్ఎంఈ ల సాధికారత తోనే.. రాష్ట్ర సాధికారిక సాధ్యం: రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్.ఆర్.ఐ. ఎంపవర్మెంట్ మరియు రిలేషన్స్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్





కడప, ఏప్రిల్ 25(భారత శక్తి) : సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)ల సాధికారతతోనే.. రాష్ట్ర సామాజిక, ఆర్థిక పరిపుష్టి సాధ్యం అవుతుందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్.ఆర్.ఐ. ఎంపవర్మెంట్ %డ% రిలేషన్స్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని పిజిఆర్ ఎస్ హాలులో.. జిల్లాలో ఎంఎస్ఎంఈ, సెర్ప్ కార్యకలాపాలపై.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, రాష్ట్ర ప్రభుత్వ విప్ లు, కడప, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు ఆర్. మాధవి రెడ్డి, సి.ఆదినారాయణ రెడ్డి, జేసి అదితిసింగ్ లతో కలిసి రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్.ఆర్.ఐ. ఎంపవర్మెంట్ %డ% రిలేషన్స్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో వ్యాపార, పెట్టుబడి ధోరణిలో పారిశ్రామిక రంగం వైపు అవగాహన పెంచడం, పెట్టుబడి సాయం అందిస్తోందన్నారు. దేశంలో 10 లక్షల నుండి 120 కోట్ల పెట్టుబడితో నిర్వహించే ప్రతి పరిశ్రమను సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల క్రింద చేర్చడం జరిగిందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దేశం సర్వతో ముఖాభివృద్ధి చెందాలంటే భారీ పరిశ్రమలతో పాటు ఎంఎస్ఎంఈ ల పురోభివృద్ధి కూడా ఎంతో ముఖ్యం అన్నారు. పరిశ్రమలలో ఒక భాగంగా ఉన్న ఎంఎస్ఎంఈ విభాగాన్ని ఒక ప్రత్యేక పారిశ్రామిక రంగంగా ఒక పాలసీని తీసుకురావడం, అందుకు సంబంధించి "ఉద్యం" పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరుగుతోందన్నారు. ఒక వ్యాపారాన్ని ప్రారంభించే ప్రతి ఒక్కరు ఉద్యం పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రభుత్వం నుండి అందే అన్ని రకాల రాయితీలను పొందేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతీ ఒక్కరూ ఏదో ఒక రంగంలో స్వయం ఉపాధిని పొందుతున్నారంటే జిల్లా యంత్రాంగం ఎంతో కృషి చేస్తోందని అందుకు అభినందనలు తెలుపుతున్నానన్నారు. ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను అందిపుచ్చుకుని ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా రాణించాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలి కుటుంబం ఒక నూతన పారిశ్రామిక వేత్తగా రాణించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కడప జిల్లా పరిశ్రమల గురించి ప్రస్తావిస్తూ ఈ జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలో జరుగుతున్న మహిళాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి, సాధికారిత, పొదుపు సంఘాల బలోపేతంలోనే సాధ్యం అవుతుందన్నారు. పిఎమ్ఈజిపి, పిఎమ్ విశ్వకర్మ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఎంటర్ప్రెన్యూర్ షిప్ ను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. ఏపి ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పోరేషన్ ద్వారా ర్యాంప్ ప్రోగ్రాం లాంచ్ చేయడం జరిగిందన్నారు.జిల్లా నుండి ఎలెక్ట్రిక్ ట్రాన్స్ఫార్మర్స్, బెరైటీస్, బేరియం క్లోరైడ్ వంటి ఉత్పత్తులు అధికంగా మేజర్ ఎగుమతులు చేయడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ ల అభివృద్ధి కోసం ఐబీఆర్ ట్రైనింగ్, జెడ్ సర్టిఫికేషన్, వెండర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం వంటి ప్రభుత్వ ప్రోత్సాహక కార్యక్రమాల ద్వారా ఎంటర్ప్రెన్యూర్లకు ప్రోత్సాహాన్ని కల్పిస్తోందన్నారు.జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామిక వేత్త తయారు కావలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్ష అని ఆ దిశగా మహిళలను యువతను జిల్లా అధికారులు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని మహిళా పొదుపు సంఘాలను ఈ-కామర్స్ బిజినెస్ వైపు అడుగులు వేయించి.. ప్రపంచ గుర్తింపు తో పాటు.. సంపూర్ణ సాధికారిత సాధించేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమల కేంద్రం క్రింద రూ. 17,012.48 కోట్ల పెట్టుబడులతో మొత్తం 28 భారీ పరిశ్రమలు నడుస్తున్నాయని, దాదాపు 16,208 మందికి ఉపాధిని కల్పిస్తున్నాయన్నారు. అలాగే జిల్లాలో ఎంఎస్ఎంఈ వివరాలను ఆయన తెలియజేస్తూ.. 79,438 పవర్ కనెక్షన్లు, 3,429 మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు, 17,100 సర్వీసింగ్ యూనిట్లు, 9,617 ట్రేడ్ యూనిటు, 17,243 నాట్ వర్కింగ్ యూనిట్లు, 32, 618 నాట్ ఎంఎస్ఎంఈ యూనిట్లు, 80,007 సర్వేడ్ యూనిట్లు ఉన్నాయన్నారు. జిల్లా మొత్తంగా ఏర్పాటైన యూనిట్లలో 77,746 యూనిట్లు ఉద్యం రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందన్నారు. కొత్త యూనిట్ల స్థాపనకు జిల్లాలో ఇప్పటి వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా.. అందిన దరఖాస్తుల్లో 3,526 ఇండస్ట్రియల్ క్లియరెన్స్ కోసం అందాయి.. 3,426 ఆమోదం పొందాయంట్, 86 తిరస్కరించబడ్డాయన్నారు. 14 ప్రాసెసింగ్ లో ఉన్నాయని, ఎలాంటి దరఖాస్తులు పెండింగులో లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మంచి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. కడప జిల్లాలో ఆ దిశగా కొప్పర్తి పారిశ్రామిక వాడను.. రాష్ట్రంలోనే మోడల్ ఇండస్ట్రియల్ పార్కుగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే.. కొప్పర్తి పారిశ్రామిక వాడలో జిల్లాకే తలమానికంగా "ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)" క్లస్టర్ లో పరిశ్రమలు రూపు దిద్దుకుంటున్నాయన్నారు. ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన కంపెనీలు కొప్పర్తి పారిశ్రామిక వాడలో రూపుదిద్దుకుంటున్నాయని.. దీంతో జిల్లా యువతకు భారీగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు, కాంట్రాక్టర్లకు, పెట్టుబడిదారులకు మంచి అవకాశాలు పెరగనున్నాయని.. భవిష్యత్తులో జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధిలోకి రానుందని తెలిపారు. ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ఇండస్ట్రీలలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఇండస్ట్రీలో మ్యాన్ పవర్ అవసరం చాలా ఎక్కువగా ఉందన్నారు. స్థానిక యువత లోకల్ గా ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకోవాలన్నారు. ఉద్యోగార్థులు చిన్న ఉద్యోగం అనే ఆలోచన లేకుండా ఉన్న అవకాశాన్ని అందుకుని, పూర్తి స్థాయిలో ఆ రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అపుడే వారి అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. యువత ఆలోచనా విధానంలో మార్పు తీసుకురాగలగాలన్నారు. ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డిలు మాట్లాడుతూ... దేశంలోనే మొట్టమొదటిగా స్వయం సహాయక సంఘాల వ్యవస్థను ఏర్పాటు చేసిన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఎన్నో రకాల సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సహకారంతో.. ఆర్థిక పరిపుష్టిని సాధించాయన్నారు. టిక్కి ఆర్గనైజేషన్ ప్రతినిధి రామ్మూర్తి నాయక్, డిక్కీ కో ఆర్డినేటర్ శివశంకర్, ఫ్యాప్సియా ప్రతినిధి గల్లా శ్రీధర్, జ్ఞానప్రకాశ్ కోఆర్డినేటర్ కొత్తగా ఎంటర్ప్రెన్యూషిప్ తీసుకుని యూనిట్లు నడుపుతున్న వారికి ప్రభుత్వం నుండి అందే రాయితీలను 6-12 నెలల్లోనే విడుదల చేస్తే.. బ్యాంకర్ల ఒత్తిడి లేకుండా యూనిట్ల నిర్వహణ సజావుగా జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ, డిఆర్డీఏలో ఎంఎస్ఎంఈ ల నిర్వహణ, కార్యాచరణపై వివిధ అంశాలపై జిల్లా అధికారులతో రాష్ట్ర మంత్రి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపి ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, ఇండస్ట్రియల్ జీఎం చంద్ బాషా, డిఆర్డీఏ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, డిపిఎంలు, ఏ.పి.డి.లు, మెప్మా సి.ఎం.ఎం.లు, సెర్ప్ సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి 7వ వార్డులోని సువర్చల సహిత హనుమాన్ ఆలయ 8 వ వార్షికోత్సవ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణా రెడ్డి

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 25: కామారెడ్డి పట్టణం 7వ వార్డులో ఆర్ అండ్ బి నగర్ కాలనీలో గల సువర్చల సహిత హనుమాన్ ఆలయ 8 వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు సీతారాముల కళ్యాణ వేడుకలలో కామారెడ్డి శాసన సభ్యులు శ్రీ కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పాల్గొన్నారు.



# డీజే లతో బ్యాండ్ కార్మికుల ఉపాధికి కళ్లెం

మందమర్రి, (భారత శక్తి విలేకరి) ఏప్రిల్ 25:సాంకేతికత పెరిగిపోతున్న ఈ కాలంలో శుభకార్యాలైన ఫంక్షన్ లైన సభలు సమావేశాల్లో డప్పులు మంగళ వాయిద్యాలు బ్యాండ్ బృందాల అవసరం లేకుండా ఈ మధ్యకాలంలో ఈవెంట్ ఆర్గనైజర్లు అతి శక్తివంతమైన డీజేలను ఉపయోగిస్తూ బ్యాండ్ కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. ఈ సందర్భంగా మందమర్రి ప్రెస్ క్లబ్ లో బ్యాండ్ కార్మికులు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శుభకార్యాలకు ఫంక్షన్లకు ఈవెంట్ ఆర్గనైజర్ లను ఆశ్రయించడంతో వారు నిర్వాహకులను ఆకర్షించడానికి అతి పవర్ఫుల్ టూ పిన్,ఫోర్ పిన్ డీజే లను వాడుతూ శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్నారు,ఈ డి.జే ల ప్రభావం వల్ల చిన్నపిల్లలకు, వృద్ధులకు గుండె సంబంధిత వ్యాధితో బాధపడేవారికి ఇబ్బంది కరంగా ఉన్నది. ఎవరూ కూడా దీనిని గురించి పట్టించుకోవడం లేదు. సౌండ్ పొల్యూషన్ వలన చాలా ఇబ్బందికరంగా ఉంటున్నది అని ప్రజల అభిప్రాయం. అలాగే రాత్రిపూట బరత్ లను నిర్వహించడం వలన ప్రజలకు ఆటంకం కలిగిస్తూ అధిక శబ్దాన్ని ఉపయోగించి రోజంతా పనిచేసి అలసిపోయి నిద్రిస్తున్న అందరికి ఇబ్బందికరంగా చేస్తున్నారు. దీనికి ఒక నిర్ధిష్టమైన కాల పరిమితి ఏమి లేదు. ఎవరికి వారే స్వేచ్ఛగా, యదేచ్ఛగా జనాలకు ఇబ్బందులు పెడుతున్నారు.డీజేలో మ్యూజిక్ మోజులో డాన్సులు చేస్తూ యువకులు ఎందరో గుండెపోటుతో మరణించడం కూడా జరుగుతుందని అన్నారు. ఈ డీజేల ఉపయోగంతో బ్యాండ్ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని



ఉపాధి లేకపోవడంతో తీసుకువచ్చిన అప్పులను తీర్చలేక కుటుంబాన్ని పోషించలేక మానసికంగా కృంగిపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మందమర్రి ఏరియా బ్యాండ్ కార్మికులమందరం ఒక అసోసియేషన్ గా ఏర్పడినామని మా హక్కులు సాధించడానికి పోరాటం చేస్తామని అన్నారు . డీజే లను ప్రభుత్వ అధికారులు నిషేధించాలని పర్మిషన్ ఇవ్వరాదని మేము అందరం కలిసి అధికారులను ప్రజాప్రతినిధులను మీడియా వారిని వేడుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజికల్ బ్యాండ్ మందమర్రి అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ తాజుద్దీన్ బాబా కోశాధికారి ఎండి అక్బర్ బాషా ఎండి సలాం సహాయ కార్యదర్శి వినోద్ సాయి కృష్ణ చోటు మియా పడగల అఖిల్ ఎండి సుకూర్ ఎండి అబ్జల్ శశిధర్ దుర్గం శ్రీనివాస్, పాల్గొన్నారు.

# ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాక్‌కు బుద్ధి చెప్పాలి

భువనగిరి టౌన్, ఏప్రిల్ 24: దేశంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌కు కేంద్ర ప్రభుత్వం బుద్ధి చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్ అన్నారు. జమ్మూకాశ్మీర్ పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళిగా బుధవారం రాత్రి భువనగిరిలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా కుహనా సెక్యులర్ వాదులు కళ్లు తెరిచి నిజమైన టెర్రరిస్టులను గుర్తించాలన్నారు. మృతులకు నివాళులు అర్పించి పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం భాస్కర్, పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ మాయ దశరథ, చందా మహేందర్‌గుప్త, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్, కె.మల్లిఖార్జున్, బూరుగు మణికంఠ, మంగు నర్సింహారావు, భట్టు క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

పహల్‌గామ్ దాడి హేయమైన చర్య అని మునిసిపల్ మాజీ చైర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్ అన్నారు. దాడిని నిరసిస్తూ బుధవారం రాత్రి భువనగిరిలో నిర్వహించిన కొవ్వొత్తుల



ర్యాలీలో వారు మాట్లాడారు. ఉగ్రవాదాన్ని నియంత్రించాలని, బాధితుల కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల బాల్‌రాజ్, సామల రవీందర్, చప్పిడి శిరీష, గుర్రాల శ్రీనివాస్, తాడూరి నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

# జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 25: శుక్రవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు.ముక్త కంఠంతో అందరూ ఈ దాడిని ఖండిస్తూ ఈరోజు శుక్రవారం రోజున చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబాలకు దేవుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించాలన్నారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ,జమ్మూ కాశ్మీర్ పహాల్గామ్ లోని పర్యాటకుల బృందాన్ని లక్ష్యంగా చేసుకొని వారిపై జరిగిన భయంకరమైన ఉగ్రదాడిని ఖండిస్తున్నాం అని అన్నారు.ఇది అమానవీయ చర్య అని విచారం వ్యక్తం చేస్తూ.. ఉగ్రవాద దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను అన్నారు.ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని బహిరంగంగా కఠినాతి కఠినంగా శిక్షించాలని కలలో కూడా ఇలాంటి చర్యలు పాల్పడాలంటే వెన్నులో వణుకు పుట్టే విధంగా శిక్ష అమలు చేయాలన్నారు.కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాద దాడిని భారతదేశాన్ని మాత్రమే కాకుండా యావత్ ప్రపంచాన్ని కుదిపేసింది. ఈ దాడిలో చాలా మంది పర్యాటకులు చనిపోయారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఉగ్రవాదానికి మతం ఉండదని చిన్న చీమకు కూడా హాని తలపెట్ట వద్దని ఇస్లాం చెప్తుంది అన్నారు. ప్రభుత్వం ఉగ్రవాదంపై తీసుకునే ఎలాంటి చర్య అయినా సరే మా మద్దతు ఉంటుంది. మానవత్వం ఉన్నవారు ఎవరైనా సరే ఈ హేయమైన చర్యను ఖండించాల్సిందే అన్నారు.

# ఫల రాజుకు కష్టాలు

మిర్యాలగూడ వ్యవసాయం): పండ్లలో రారాజు అంటే ఎవరికైనా టక్కున గుర్తొచ్చేది మామిడి కాయ. మెరిసే ఎండలో రకరకాల రంగులతో కనువిందు చేసే మామి డి కాయల కోసమే వేసవి ఎపుడు వస్తుందా అంటూ ఎదురు చూసే వారు ఉన్నారంటే అతియోశక్తి కాదు. మార్కెట్లో ఎన్ని రకాల పండ్లు ఉన్నా మామిడిదే అగ్ర స్థానం. అటువంటి రారాజుకే బండెడు కష్టాలు వచ్చి పడ్డాయి. ప్రతికూల వాతావర ణం మామిడి సాగుకు ప్రతిబంధకం గా మారింది. నడి వేసవి వచ్చినా మార్కెట్లో మామిడి కాయలు అంతగా కనిపించడం లేదు.

రాష్ట్రంలో మొత్తం 3లక్షల ఎకరాలు, ఉమ్మడి జిల్లాలో 24,584 ఎకరాల విస్తీర్ణంలో మామిడి సాగవుతోంది. సూర్యాపేట జిల్లాలో 11,460, యాదాద్రి జిల్లాలో 10,874, నల్లగొండ జిల్లాలో 2,250 ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా బంగినపల్లి రకం 95శాతం సాగవుతోంది. దశేరి, హిమాయత్, కేసరి, మల్లిక అనే రకాలను తినడానికి, జ్యూస్ రకాలు, చెరుకురసాలు, చిన్న, పెద్ద రసాలు, పచ్చళ్లకు జలాల్, నీలం, తెల్లగులాబి రకాలు సాగవుతున్నాయి.



ఈ ఏడాది గడ్డుకాలం

రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మామిడికి ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో పం డిన బంగినపల్లి మామిడిని బాద్‌షా అని పిలుస్తారు. ఈ ప్రాంతం నుంచే అధికంగా మామిడి అరబ్ దేశాలకు ఎగుమతి అవుతోం ది. ఉమ్మడి జిల్లాలో సైతం బంగినపల్లి అధికంగా సాగవుతోంది. ఈ ఏడాది ఆశించి న స్థాయిలో దిగుబడులు రాక రైతులు నష్టాలపాలయ్యారు. వేసవిలో సాధారణం గా మార్చి నెల వచ్చిందంటే మామిడి రాక మొదలవుతుంది. ఈ సారి మాత్రం ఏప్రిల్ నెల ముగుస్తున్నా ఆశించిన స్థాయిలో మా ర్కెట్లో ఈ పండ్లు కనిపించడం లేదు. ఈ ఏడాది మామిడికి గడ్డుకాలంగా నిలిచింది. మామిడిలో జనవరిలో పూత దశకు వస్తుం ది. ఈ సారి మాత్రం ఫిబ్రవరిలో పూత వచ్చింది. మార్చి వరకు మంచు కురవడం తో పూత దశలో తేనె మంచు పురుగు, బూడిద తెగులు కాయలకు ఆశించి తీవ్ర నష్టాన్ని కలిగించినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణంగా మామిడిలో ఎకరానికి 5-6టన్నులు దిగుబడి వస్తుంది. ఈ ఏడాది 2-3టన్నులకు మించి దిగుబడి రాలేదు. మామిడి యజమాన్యం లో సమస్యలు, నీటి కొరత, తోట లు సుమారు 20 ఏళ్ల క్రితం పెట్టినవి అధికంగా ఉండటంతో వాతావరణాన్ని తట్టుకోలేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, అతి వేగం గా వీచే ఈదురు గాలులకు పిందె దశ నుంచి కాయ సైజ్‌కు వచ్చాక కూడా రాలిపోవడం, వాతావరణంలో మార్పులను సకాలంలో గుర్తించకపోవడం ప్రధాన సమస్యగా రైతులు పేర్కొంటున్నారు. దిగుబడులు లేక పెట్టిన పెట్టుబడులు చేతికి రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర లేక

ప్రతి ఏటా దిగుబడులు తగ్గుతు వస్తున్నాయి..అయినా మామిడికి మార్కెట్లో ధరలు పలకడంతో కొంత మేరకు రైతులకు గిట్టుబాటు అయింది.. ప్రస్తుతం మార్కెట్లో మామిడి కాయలు పెద్ద మొత్తంలో రాక పోయినా ధర లేకుండా పోయింది..పోయిన ఏడాది కిలో రూ.150ల వరకు ధర ఉండగా నేడు కాయలు పరిమాణాన్ని అనుసరించి వంద రూపాయలకు కిలోన్నర వరకు మామిడి కాయలు విక్రయిస్తున్నారు.. మామిడి గిరాకీ లేకపోవడంతో ధర పెరగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. కిలోకు రూ. 30-40 మాత్రమే గిట్టుబాటు కావడంతో మిగులు బాటు ఉండటం లేదని రైతులు చెపుతున్నారు.

ఐదేళ్లుగా మామిడి సాగులో సమస్యలు:నరేష్, ఉద్యానవన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, గడ్డిపల్లి, సూర్యాపేట జిల్లా

మామిడి తోటల్లో ఐదేళ్లుగా దిగుబడులు పడిపోతున్నాయి. వాతావరణంలో సమూల మార్పులు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అధిక ఉష్ణోగ్రతలు, పూత ఆలస్యంగా రావడం, మంచు కురవడంతో తేనె మంచు పురుగు, బూడిద తెగులు ఆశించి పంటకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. చాలా వరకు తెగుళ్లను సకాలంలో గుర్తించి సమగ్ర యాజమాన్య చర్యలు చేపట్టకపోవడం, ముదురు తోటలు అధికంగా ఉండటంతో తెగుళ్లను సమర్థంగా తట్టుకోలేక దిగుబడులపై ప్రభావం పడుతోంది.

నాకు మామిడి పండ్లు అంటే చాలా ఇష్టం. వేసవి వచ్చిదంటే చాలు రకరకాల పండ్లు తినే వాడిని. ఏటా మార్చి వచ్చిందంటే కాయలు మార్కెట్లో కనిపించేవి. ఈ సారి కాయ చాలా ఆలస్యంగా ఏప్రిల్ మొదటి వారంలో అరకొరగా వచ్చాయి. కాయ పరిమాణం, నాణ్యతలో చాలా తేడాలు ఉన్నాయి. ధర లేకున్నా, రుచిలో తేడా ఉంది.

ఏటా వేసవి మొదలు జూన్ వరకు మామిడి కాయలకు చాలా డిమాండ్ ఉండేది. ఈ సారి మాత్రం ఏప్రిల్‌లో మార్కెట్‌కు కాయలు వచ్చాయి. గత ఏడాది మంచి కాయలకు కిలో రూ.150 వరకు ధర ఉంది. ప్రస్తుతం రూ.100కు కిలోన్నర వరకు విక్రయిస్తున్నాం. అయినా పెద్దగా గిరాకీ లేదు. రైతుల వద్ద నుంచి రూ.40 వరకు కొనుగోలు చేస్తున్నాం. పెద్దగా నాణ్యత ఉండటం లేదు. ఎండలు అధికంగా ఉండటంతో మామిడి వినియోగం కూడా తగ్గింది.

# మందమర్రి లో మహిళల హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలు




మందమర్రి,ఏప్రిల్ 25 (భారత శక్తి): మందమర్రిలో రాష్ట్రస్థాయి 54వ సీనియర్ మహిళల హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలను ఈనెల 28 29 30 తేదీలలో మందమర్రి సింగరేణి హై స్కూల్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కనపర్తి రమేష్ తెలిపారు. ఈరోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ సభ్యులు మరియు జనరల్ సెక్రెటరీ కనపర్తి రమేష్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ సౌజన్యంతో ఈనెల 28 29 30 తేదీల్లో సింగరేణి హై స్కూల్ మైదానంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్స్ షిప్ పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 20 మంది క్రీడాకారుల చొప్పున 200 మంది పోటీల్లో పాల్గొన్నారని అదనంగా 50 మంది క్రీడల శిక్షకులు సిబ్బంది హాజరు అవుతారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరపున 20 మంది సీనియర్ మహిళా క్రీడాకారులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ ఛాంపియన్షిప్ పోటీలకు సింగరేణి సంస్థ అవసరమైన ఏర్పాట్లు చేస్తుందని అందుకు సంస్థ యాజమాన్యానికి మేనేజర్ దేవేందర్ కు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ క్రీడలను ముందుండి నడిపేందుకు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గోనే శ్యాంసుందర్రావు అసోసియేషన్ చైర్మన్ సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ రావు లు ఉంటారని వారి ఆధ్వర్యంలోనే చాంపియన్షిప్ పోటీలు విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలు గుజరాత్ లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ కోశాధికారి అలుగువెల్లి రమేష్ రెడ్డి, కోచ్ సొనార్కర్ అరవింద్, ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు కాంపల్లి సమ్మయ్య, ఆర్గనైజింగ్ నెంబర్ కర్ర మహేందర్ రెడ్డి, ఎగ్గటి రాజేశ్వర్, రాజమౌళి లు పాల్గొన్నారు.

# మత్తు వదిలిస్తున్నారు

-సూర్యాపేట( మద్యం తాగి వాహనాలు నడిపే వారికి చిక్కులు ఎదురుకానున్నాయి. ప్రతి రోజూ జిల్లాలో ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంకెన డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ వెళ్తే ఖచ్చితంగా పట్టుబడాల్సిందే. వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపుతున్నారు. కోర్టుల్లో జరిమానాలు, జైలు శిక్ష విధిస్తున్నారు. జిల్లాలో అనేకమంది మద్యం తాగి పోలీసులకు పట్టుబడినప్పటికీ వారిలో మార్పు రావడంలేదు.

మత్తులో ప్రమాదాలు

మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. వీరి వల్ల మద్యం తాగని వారు కూడా ప్రమాదాలకు బారినపడుతున్నారు. మద్యం మత్తులో వాహనాలను అదుపు చేయలేకపోవడంతో ఎంతోమంది మృతి చెందడం, గాయపడు తున్నారు. సూర్యాపేట జిల్లా పరిధిలో మేళ్లచెర్వు ప్రాంతంలో ముగ్గురు యువకులు మద్యం తాగి రాత్రి వేళ బైక్‌పై వెళ్తూ ముందు వెళ్తున్న లారీని గుర్తించలేక ఢీకొట్టి అక్కడకక్కడే మృతి చెందారు. తాజాగా సూర్యాపేట పట్టణంలో ఓ వ్యక్తి మద్యం తాగి బైక్‌పై ఇంటికి వెళ్లే సమయంలో ముందు వెళ్తున్న మరో బైక్‌ను ఢీకొట్టి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో చోటు చేసుకున్నాయి.

నియంత్రణకు పోలీసుల చర్యలు

డ్రంకెన డ్రైవ్‌లను నియంత్రించేందుకు పోలీసులు సమావేశాలు, ప్రచార మాధ్యమాలు, పోస్టర్లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఫలితాలు రావడంలేదు. మద్యం తాగి యథేచ్ఛగా వాహనాలు నడుపుతున్నారు. డ్రంకెన డ్రైవ్‌తో కలిగే అనర్థాల గురించి పోలీసులు సమావేశాలు ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా సినిమా థియేటర్లు, సోషల్ మీడియాలో కూడా ప్రచారం చేస్తున్నారు.

జరిమానా నుంచి మొదలు

మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే వివిధ రకాలుగా చర్యలు చేపడుతున్నారు. మొదటిసారి పట్టుబడితే మద్యంశాతాన్ని బట్టి రూ.500 నుంచి రూ.5వేల జరిమానా విధిస్తున్నారు. రెండోసారి పట్టుబడితే జైలు శిక్ష పడుతోంది. రెండో, మూడోసారి పట్టుబడితే వారి డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేయిస్తున్నారు.

మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులకు శిక్ష విధించనున్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేని మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల డ్రైవింగ్ పట్ల అనుభవం, ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు క్షతగాత్రులవుతున్నారు. అయితే జిల్లాలో మాత్రం ఇప్పటివరకు మైనర్లకు వాహనాలు ఇచ్చిన త ల్లిదండ్రులపై కేసులు నమోదు చేసిన సంఘటనలు లేవు.



# రో - కో సూపర్ ఫామ్.. ఫ్యాన్స్ రీఎంట్రీ అడిగేలా..

గతేడాది టీ20 ప్రపంచ కప్‌ను టీమ్‌ఇండియా కైవసం చేసుకుంది. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్ రోహిత్ శర్మ. ఇక ఫైనల్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన ఆటగాడు విరాట్ కోహ్లీ. అనూహ్యంగా వీరిద్దరూ ఆ వెంటనే పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికేశారు. అంతా షాక్.. ఎందుకలాంటి నిర్ణయం తీసుకున్నారనే చర్చ మొదలైంది. ఇప్పుడు ఐపీఎల్‌లో వారి ఆటతీరు చూశాక.. కాస్త తొందరపడ్డారేమో అనిపిస్తోంది.

ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ రేసులోకి విరాట్ కోహ్లీ దూసుకొచ్చాడు. ప్రస్తుతం 392 పరుగులతో రెండో స్థానంలో నిలిచాడు. ఇందులో ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. తొమ్మిది మ్యాచుల్లో 65.33 సగటుతో పరుగులు చేయడం గమనార్హం. గత టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో కోహ్లీ 76 పరుగులు చేశాడు. మిగతా ఏడు మ్యాచుల్లో చేసినవి కేవలం 75 కావడం గమనార్హం. ఆ తర్వాత ఆడిన ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ తరఫున రెండో టాప్ స్కోరర్. అది వన్డే ఫార్మాట్. కుదురుకోవడానికి కాస్త సమయం తీసుకోవచ్చు. కానీ, తీవ్ర పోటీ ఉండే ఐపీఎల్‌లో తొలి బంతి నుంచే బాదుడు మొదలుపెట్టాలి. ఈ విషయంలో కోహ్లీ ఒకేసారి రెండు రకాల పాత్రలను పోషించాడు. వికెట్ పడినప్పుడు లేదా సహచర బ్యాటర్ ఎటాకింగ్‌కు వెళ్లినప్పుడు తాను యాంకర్ పాత్ర పోషించాడు. జట్టుకు అవసరమైన సందర్భంలో దూకుడూ ప్రదర్శించాడు. తాజాగా రాజస్థాన్‌పైనా కీలకమైన ఇన్నింగ్స్‌తో కోహ్లీ అదరగొట్టాడు. ఐపీఎల్ (%ళూా%) 18వ సీజన్‌లో కోహ్లీ తన జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఛాంపియన్‌గా నిలపాలనే ఏకైక లక్ష్యంగా ఆడుతున్నట్లు కనిపిస్తోందని మాజీల అభిప్రాయం. ప్రతి మ్యాచ్‌లోనూ గెలుపు కసి అతడిలో కనిపిస్తోంది.

రోహిత్ అలా..

విరాట్‌తో పోలిస్తే రోహిత్ శర్మ ఆటతీరు పూర్తి భిన్నం. ఇద్దరూ ఓపెనర్లుగా వస్తున్నారు. కానీ, విరాట్ ప్రతి బంతిని స్టాండ్స్‌లోకి పంపిద్దామని భావించడు. రోహిత్ మాత్రం మొదటి బంతి నుంచే ఎటాకింగ్ గేమ్ ఆడేస్తాడు. అది కొన్నిసార్లు జట్టుకు మంచి చేసినా.. త్వరగా పెవిలియన్‌కు చేరడం వల్ల వ్యక్తిగతంగా ఎలాంటి ఘనతలు అందుకోలేకపోతుంటాడు. ఈసారి ఐపీఎల్‌లో కూడా రోహిత్ ఇంపాక్ట్ ప్లేయర్‌గానే బరిలోకి దిగుతున్నాడు. ఒక మ్యాచ్‌లో బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. తొలి ఆరు మ్యాచుల్లో అతడు చేసిన పరుగులు 82 పరుగులు. ఇందులో ముంబయి గెలిచినవి మూడు. ఎప్పుడైతే వరుసగా రెండు హాఫ్ సెంచరీలు చేశాడో.. అక్కడ్నుంచి ముంబయి ప్లేఆఫ్స్ రేసులో ముందుకొచ్చింది. గత రెండు మ్యాచుల్లోనూ ఆ జట్టు విజయం సాధించింది. రోహిత్ వరుసగా 76, 70 పరుగులు చేసి జట్టును గెలిపించాడు.

ఆ మాటతో.. ఆశలు

ప్రస్తుతం రోహిత్, విరాట్ ఫామ్‌ను చూస్తుంటే.. అసలు వీరెందుకు టీ20లను వదిలేశారా? అనిపిస్తోంది. అయితే, గత ఏడాది కొన్ని మ్యాచుల్లో వారి ఆటను చూశాక విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఫామ్ తాత్కాలికం.. క్లాస్ శాశ్వతం అనే నానుడి ఇప్పుడు రోహిత్ - కోహ్లీకి సరిగ్గా సరిపోతుంది. రోహిత్ వయసు మరో ఐదు రోజుల్లో 38 ఏళ్లకు చేరుతుంది. కోహ్లీ వయసు ఇంకా 36 ఏళ్లే. గతంలో 40 సంవత్సరాలు వచ్చినా మంచి ఆటతీరు ప్రదర్శించిన క్రికెటర్లను చూశాం. ఇటీవల విరాట్ ఓ మాట అన్నాడు.. ఒలింపిక్స్‌లో టీమ్‌ఇండియా ఫైనల్‌కు చేరితే తాను ఆడేందుకు సిద్ధంగా ఉంటానన్నాడు. లాస్ ఏంజెలెస్ వేదికగా 2028లో ఒలింపిక్స్ జరుగుతాయి. ఇందులో క్రికెట్‌కు చోటు దక్కిన సంగతి తెలిసిందే. అంటే మరో మూడేళ్లపాటు ఇదే ఫామ్‌ను కొనసాగిస్తూ వెళ్తానని పరోక్షంగా చెప్పినట్లైంది. ఇక రోహిత్ విషయంలో స్పష్టత లేదు. హిట్‌మ్యాన్ తన రిటైర్‌మెంట్‌ను వెనక్కి తీసుకోవడం అసాధ్యమే. ఎన్ని సాధించినా వన్డే ప్రపంచ కప్ గెలిస్తేనే అసలైన మజా వస్తుందని ఇప్పటికే రోహిత్ తన మనసులోని మాట వెల్లడించాడు. అంటే, మరో రెండేళ్ల తర్వాత (2027) జరగబోయే వన్డే కప్ కోసం ఇప్పట్నుంచే రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పుడు వీరిద్దరి ఆటతీరు చూశాక.. వచ్చే ఏడాది పొట్టి కప్ బరిలోకి దిగాలని కోరుకునేవారూ లేకపోలేదు. మరి రో - కో ఏం చేస్తారో చూడాలి మరి..!

# నా కుటుంబాన్నీ వదలట్లేదు: పాక్ అథ్లెట్‌కు ఆహ్వానంపై నీరజ్ చోప్రా ఆవేదన



: పాకిస్థాన్ జావెలిన్ త్రో స్టార్ అర్షద్ నదీమ్‌ను భారత్‌కు ఆహ్వానించడంపై భారత జావెలిన్ హీరో నీరజ్ చోప్రా విమర్శలు ఎదుర్కొంటున్నాడు. పహల్గాం ఘటన నేపథ్యంలో పాక్‌పై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో పాక్ అథ్లెట్‌ను ఆహ్వానించాల్సిన అవసరం లేదని పలువురు అభిప్రాయపడ్డారు. మే నెలలో బెంగళూరు వేదికగా ఎన్‌సీ క్లాసిక్ జావెలిన్ ఈవెంట్ జరగనుంది. ఈక్రమంలో తనపై వస్తున్న విమర్శలకు నీరజ్ చోప్రా స్పందించాడు. చోప్రా కూడా ఆర్మీకి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. ఈసందర్భంగా తన కుటుంబం పైనా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తంచేశాడు.

‘‘సాధారణంగా నేను తక్కువగా మాట్లాడతా. అలాగని తప్పు అని భావించిన వాటికి వ్యతిరేకంగా మాట్లాడను అనే అర్థం కాదు. దేశంపై నా ప్రేమ విషయానికొస్తే ఏమాత్రం వెనకడుగు వేయను. అలాగే నా కుటుంబంపై గౌరవంగా ఉంటా. నీరజ్ చోప్రా క్లాసిక్ ఈవెంట్‌కు అర్షద్ నదీమ్‌ను ఆహ్వానించడంపై చాలామంది నాపై వ్యాఖ్యలు చేశారు. అందులో చాలావరకు అసభ్యకరమైనవి ఉన్నాయి. వారు నా కుటుంబాన్ని కూడా వదల్లేదు. నేను అథ్లెట్‌గానే అర్షద్‌ను ఆహ్వానించాను తప్ప, ఇందులో మరే ఉద్దేశం లేదు. ఎన్‌సీ క్లాసిక్ లక్ష్యం అత్యుత్తమ అథ్లెట్లను భారత్‌కు తెప్పించడమే. ప్రపంచవ్యాప్త క్రీడా కార్యక్రమాలను నిర్వహించగలమని చెప్పేందుకే. ఇదంతా సోమవారానికి ముందే జరిగింది. పహల్గాంలో ఉగ్రదాడికి ముందే ఇలాంటి నిర్ణయం తీసుకున్నాం. ఆ తర్వాత 48 గంటల్లో చాలా మార్పులు జరిగాయి. అర్షద్ ఎన్‌సీ క్లాసిక్‌కు హాజరుకావడమనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఎప్పుడైనా నా దేశ ప్రయోజనమే నా మొదటి ప్రాధాన్యం. ఈ ఘటనలో నా దేశ ప్రజలను పోగొట్టుకున్నా. వారి కుటుంబాలకు మద్దతుగా నిలుస్తా. పహల్గాం విషయంలో నాకు బాధతోపాటు కోపమూ ఉంది.’’

‘‘భారత్ గర్వపడేలా ఎన్నోఏళ్లుగా కష్టపడ్డా. అయినా దేశంపై నా చిత్తశుద్ధిని ప్రశ్నించడం బాధగా అనిపించింది. నన్ను, నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేసిన వారికి సమాధానం ఇచ్చేందుకే ఈ వివరణ ఇస్తున్నా. మనమంతా సాధారణ ప్రజలం. అనవసరమైన అపోహలను సృష్టించొద్దు. కొన్ని మీడియాల్లోను తప్పుడు కథనాలు ప్రసారం చేశారు. నేను దీని గురించి మాట్లాడలేదు కాబట్టే క్రియేట్ చేసినట్లు ఉన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను ఎలా మార్చుకుంటారో కూడా అర్థం కావడంలేదు. గతంలో నా తల్లి అమాయకంగా అన్న మాటలను ప్రశంసించారు. ఇప్పుడు అదే పబ్లిక్ నన్ను టార్గెట్ చేయడం బాధాకరం. ఎక్కడికి వెళ్లినా భారత్‌ను ప్రతిఒక్కరూ గుర్తు చేసుకోవాలని కష్టపడతా. సరైన కారణాలతో విమర్శలు చేస్తే గౌరవంగా ఉంటుంది. జై హింద్’’ అని నీరజ్ సుదీర్ఘమైన పోస్టును పెట్టాడు.





# అందుకు అంగీకరించినట్లే: పాక్ ఉప ప్రధాని వ్యాఖ్యలపై డానిష్ కనేరియా ఫైర్

జమ్ముకశ్మీర్‌లోని పహాల్గాం ఘటనపై పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు విమర్శలకు దారితీశాయి. ఉగ్రవాదులను ‘స్వాతంత్ర్య సమరయోధులు’ అంటూ పిచ్చి ప్రేలాపనలు చేశారు. దీనిపై ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాడు. ఇప్పటికే పాక్ ప్రధాని మౌనంగా ఉండటంపై ప్రశ్నల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే.

‘‘పాకిస్థాన్ ఉప ప్రధాని ఉగ్రవాదులను ఫ్రీడమ్ ఫైటర్స్ అంటూ సంబోధించారు. ఇది అవమానకరమే కాకుండా.. ఉగ్రవాదానికి వేం మద్దతిస్తున్నాం, ప్రోత్సహిస్తున్నామంటూ బహిరంగంగా అంగీకరించినట్లు అయింది’’ అని డానిష్ పోస్టు పెట్టాడు. ఇప్పటికే పాకిస్థాన్ ఉగ్రవాదులను కాపాడటంతోపాటు ఆశ్రయం కల్పించడంపై డానిష్ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తూనే ఉన్నాడు. తాను పాక్ లేదా ఇక్కడి ప్రజలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం లేదని స్పష్టంచేశాడు.

మీ వల్లే దేశమంతా బాధపడుతోంది

‘‘నేను ఇక్కడ పాకిస్థాన్ లేదా దేశ ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. ఉగ్రవాదం చేతిలో పాక్ తీవ్రంగా బాధపడుతోంది. శాంతి కోసం నిలబడే నాయకత్వం అవసరం ఉంది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించేవారు కాదు. నేను గర్వంగా పాక్ క్రికెట్ జెర్సీని ధరించా. మైదానంలో నా చెమటను చిందించా. చివరికి నన్ను ట్రీట్ చేసిన విధానం కూడా పహల్గాం బాధితులకు భిన్నంగా లేదు. హిందువుగా ఉన్నందుకే లక్ష్యంగా మారా. ఉగ్రవాదాన్ని సమర్థించేవారు సిగ్గుపడాలి. హంతకులను రక్షించేవారు సిగ్గుపడాలి. నేనెప్పుడైనా మానవత్వం, వాస్తవం వైపే నిలబడతా. పాకిస్థాన్ ప్రజలు కూడా ఇలానే ఉంటారని భావిస్తున్నా. వారిని తప్పుదోవ పట్టించొద్దు’’ అని సుదీర్ఘమైన పోస్టు పెట్టాడు.

జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న ఉగ్రదాడి ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ స్పందించకపోవడంపై ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా విమర్శలు గుప్పించాడు. ప్రధాని షరీఫ్‌కు వాస్తవం తెలుసంటూ వ్యాఖ్యానించాడు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నట్లు పేర్కొన్నాడు.

# 78వేల సంవత్సరాలైనా మిల్లీమీటర్ భూమిని లాక్కోలేరు: పాక్‌కు గావస్కర్ చురక

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు దారుణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికే ఈ ఘటనపై ప్రపంచవ్యాప్తంగా సంఘీభావం వ్యక్తమైంది. ప్రధాని నరేంద్ర మోదీ గట్టి చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. పలువురు భారత మాజీ, ప్రస్తుత క్రికెటర్లు తమ సంతాపం తెలియజేశారు. క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కాస్త ఘాటు వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు వేదికగా జరిగిన ఆర్సీబీ, ఆర్‌ఆర్ మ్యాచ్ అనంతరం సునీల్ గావస్కర్ ఉగ్రదాడిని ఖండిస్తూ స్పందించారు. ఉగ్రవాదులు, వారి మద్దతుదారులు 78 ఏళ్లలో సాధించింది ఏమీ లేదని, భవిష్యత్తులోనూ ఎలాంటి మార్పు ఉండదని పాక్‌కు పరోక్షంగా చురకలంటించారు.

‘‘ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఇది భారతీయులందరిపైనా ప్రభావం చూపిస్తుంది. ఈ సందర్భంగా ఉగ్రవాదులను, వారికి మద్దతుగా నిలిచే వారిని ఒక ప్రశ్న అడుగుదామనుకుంటున్నా. ఇదంతా ఏం సాధించడానికి చేస్తున్నారు? గత 78 ఏళ్లలో ఒక్క మిల్లీమీటర్ భూమినైనా కదల్చగలిగిరా? వచ్చే 78 వేల సంవత్సరాల తర్వాతైనా ఎలాంటి మార్పులు ఉండవు. మరి ఎందుకు ప్రశాంతంగా జీవించకుండా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. మనం మరింత దృఢంగా ముందుకు సాగాలనేదే నా విజ్ఞాపన’’ అని గావస్కర్ వెల్లడించారు.



# పాస్‌లను అమ్ముకుంటున్నారు

హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)కు సన్‌రైజర్స్ ఇస్తున్న ఐపీఎల్ కాంప్లిమెంటరీ పాస్‌లను కొన్ని ప్రైవేటు, ఇన్‌స్టిట్యూషన్ క్లబ్‌లు బ్లాక్‌లో అమ్ముకుంటున్నాయని హెచ్‌సీఏ మాజీ కార్యదర్శి శేష్‌నారాయణ ఆరోపించాడు. ఎఫ్7 నుంచి ఎఫ్16 వరకు ఉన్న కార్పొరేట్ బాక్సుల్ని హెచ్‌సీఏలోని కీలక వ్యక్తులు పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించాడు. ఈమేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి శేష్‌నారాయణ బహిరంగ లేఖ ద్వారా ఫిర్యాదు చేశాడు. సన్‌రైజర్స్‌కు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజిలెన్స్ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. కాంప్లిమెంటరీ పాస్‌లు, సన్‌రైజర్స్‌తో సంబంధాలు, హెచ్‌సీఏ పరిపాలన వ్యవహారాలపై శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది.




# మారుతీ సుజుకీ చరిత్రలోనే అత్యధిక డివిడెండ్: షేరుకు రూ.135..

దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ మదుపర్లకు చరిత్రలోనే అత్యధిక డివిడెండ్ ప్రకటించింది. తాజాగా మార్చితో ముగిసిన త్రైమాసిక ఫలితాలను వెల్లడించింది. గతేడాది ఇదే సీజన్‌తో చూస్తే సమీకృత నికర లాభం 1.04 శాతం తగ్గి రూ.3,911.1 కోట్లకు పరిమితమైంది. ఇక సంస్థ ఆపరేషన్స్ నుంచి వచ్చిన ఆదాయంలో మాత్రం 6.37 శాతం వృద్ధి నమోదై రూ.40,920.1 కోట్లకు చేరింది. గతేడాది ఇది రూ.38,585.2 కోట్లుగా నిలిచింది.

ఈ సారి అత్యధిక వార్షిక విక్రయాలు, ఎగుమతులు చేసినట్లు మారుతీ సుజుకీ వెల్లడించింది. దేశీయంగా అత్యధిక కార్లను ఎగుమతి చేసిన సంస్థగా వరుసగా నాలుగోసారి నిలిచింది. భారత్ నుంచి ఎగుమతైన ప్యాసింజర్ కార్లలో 43 శాతం ఈ కంపెనీవే. ఈ నేపథ్యంలో బోర్డు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుకు రూ.135 బోనస్‌గా ఇవ్వాలని నిర్ణయించింది. కంపెనీ బీఎస్ఈలో నమోదైన నాటి నుంచి చెల్లించిన అత్యధిక డివిడెండ్ ఇదే.

'ఈ విటారా' విక్రయాలు సెప్టెంబర్ నుంచి..

మారుతీ సుజుకీ ఎలక్ట్రిక్ కారు 'ఈ విటారా' విక్రయాలు ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నుంచి ప్రారంభించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. కంపెనీ నుంచి వస్తున్న తొలి బ్యాటరీ వాహనం ఇదే కావడం విశేషం. దీనిని గుజరాత్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తున్నారు. ఈ కారును కేవలం భారత్‌లోనే కాకుండా 100 దేశాలకు కూడా ఎగుమతి చేయనున్నారు. వీటిల్లో జపాన్, ఐరోపా దేశాలున్నాయి. కంపెనీ నాలుగో త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన అనంతరం ఛైర్మన్ ఆర్.సి.భరద్వాజ్ ఈ విషయాన్ని వెల్లడించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ దాదాపు 70,000 యూనిట్లను ఉత్పత్తి చేస్తుందన్నారు. వీటిల్లో అత్యధిక భాగం ఎగుమతులకే అని పేర్కొన్నారు.

ఈ కారును తొలిసారి భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ప్రదర్శించారు. దీనిని బీఈవీ ప్లాట్‌ఫామ్ హెర్టెక్ట్ ఈపై నిర్మించారు. దీనిలో రెండు 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ ఆప్షన్లు ఉండనున్నాయి. ఒక్క సారి ఛార్జ్ చేస్తే ఏకధాటిగా 500 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు.

# ఆరోగ్య బీమా ఇలా ఉండాలి

అనుకోని అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్తే.. రూ.లక్షల్లోనే బిల్లులు అవుతున్న పరిస్థితిని చూస్తూనే ఉన్నాం. ఇలాంటప్పుడు మన కష్టార్జితం మొత్తం హరించుకుపోతుంది. దీనికి పరిష్కారం ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవడమే. నాలుగేళ్లుగా వీటిని తీసుకునే వారి సంఖ్య బాగా పెరిగిందన్న మాట వాస్తవం. ఈ నేపథ్యంలో ఎవరికి ఏ పాలసీ నప్పుతుంది.. దానిని ఎలా ఎంచుకోవాలి అని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కొత్తగా ఉద్యోగంలో చేరారా?

చిన్న వయసులో ఉన్నప్పుడు పాలసీ తీసుకోవడం ఎంతో సులభం. 30 ఏళ్ల లోపు వారు పాలసీ తీసుకునేటప్పుడు సాధారణంగా ఏం చూడాలంటే..వేచి ఉండే సమయం: ఈ వయసులో ఉన్న వారికి ముందస్తు వ్యాధులు ఉండే అవకాశం చాలా తక్కువ. కాబట్టి, పాలసీలో వేచి ఉండే సమయం ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలి. ఒకవేళ పాలసీ తీసుకునే ముందు బీపీ, మధుమేహంలాంటివి ఉన్నా.. వాటికి పాలసీ వీలైనంత తొందరగా వర్తించాలి.

విలువకు తగ్గట్టుగా: ఉద్యోగం వచ్చిన కొత్తలో ఆర్థిక ప్రణాళికలను ప్రారంభించి, మంచి రాబడి వచ్చేలా మదుపు చేయాల్సి ఉంటుంది. ఇదే సూత్రం ఆరోగ్య బీమాకూ వర్తిస్తుంది. మీరు చెల్లించే ప్రీమియానికి తగిన విలువ ఇచ్చే పాలసీల వైపు మొగ్గు చూపండి.

దేశ వ్యాప్తంగా: ఇప్పుడు యువత ఎప్పటికప్పుడు ఉద్యోగాలు, ప్రాంతాలు మారుతున్నారు. కాబట్టి, దేశ వ్యాప్తంగా ఎక్కడ ఉన్నా.. మీ పాలసీ రక్షణ కల్పించేలా ఉండాలి. అందుకే, పాలసీని ఎంచుకునేటప్పుడు నెట్‌వర్క్ ఆసుపత్రుల వివరాలను కచ్చితంగా చూసుకోండి.

సేవలు ఎలా ఉన్నాయి: బీమా సంస్థ పాలసీ అందించడం మొదలు.. క్లెయింల పరిష్కారం వరకూ మీకు ఎంత వేగంగా సేవలను అందించగలదు అనేది ముందుగానే పరిశీలించండి. అనుకోకుండా ఆసుపత్రిలో చేరాల్సి వస్తే.. క్లెయిం చెల్లింపులు సరిగా ఉన్నాయా లేదా చూడండి. చెల్లింపుల చరిత్ర సరిగ్గా ఉన్న బీమా సంస్థ నుంచి పాలసీని తీసుకున్నప్పుడే మీరు భరోసాగా ఉండగలరు.

30-55 ఏళ్ల మధ్యలో..

వయసు పెరుగుతున్న కొద్దీ.. అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం లేకపోలేదు. వేచి ఉండే సమయం, ముందస్తు వ్యాధులు, నెట్‌వర్క్ ఆసుపత్రులు, క్లెయింల పరిష్కారం వంటి అంశాలతోపాటు ఈ వయసులో ఉన్న వారు పరిశీలించాల్సిన అదనపు అంశాలు కొన్ని ఉన్నాయి.

ఎక్కువ మొత్తంలో: ఉద్యోగంలో చేరిన కొత్తలో.. చిన్న వయసులో ఉన్నప్పుడు తీసుకున్న పాలసీలు ఇప్పుడు పూర్తి స్థాయి రక్షణ ఇవ్వలేకపోవచ్చు. 40-50 ఏళ్ల వయసులో బాధ్యతలు అధికంగా ఉంటాయి. ఆసుపత్రి ఖర్చులూ దీనికి కలిస్తే.. ఇబ్బందులు తప్పవు. ఈ వయసులో ఉన్నవారు కనీసం రూ.10లక్షలకు తక్కువ కాకుండా పాలసీని తీసుకోవడం మంచిది.

కుటుంబం అంతటికీ: ఈ వయసులో ఉన్నవారు తప్పనిసరిగా తమ కుటుంబానికి అంతటికీ వర్తించేలా ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీని ఎంచుకోవాలి. జీవిత భాగస్వామి, పిల్లలు, తనపై ఆధారపడిన తల్లిదండ్రులకూ పాలసీ రక్షణ ఉండాలి. యాజమాన్యం అందించే బృంద బీమా పాలసీతోపాటు, సొంతంగా మరో పాలసీ తీసుకోవడం ఎప్పుడూ అవసరం.

పదవీ విరమణకు దగ్గరలో..

పదవీ విరమణ ప్రణాళికలో ఆరోగ్య బీమాకూ ప్రాధాన్యం ఇవ్వాలి. 55 ఏళ్లు దాటిన తర్వాత బీమా పాలసీలో కేవలం ఆసుపత్రి చికిత్సకే కాకుండా.. ఆరోగ్య సంరక్షణకూ ప్రాధాన్యం కల్పించేలా ఉండాలి. మధుమేహం, బీపీలాంటి వ్యాధులకూ పాలసీలో పరిహారం కల్పించాలి.

ఇంటి వద్ద చికిత్స: ఆసుపత్రిలో చేరడంతోపాటు ఇంటివద్ద చికిత్స తీసుకునే సందర్భంలోనూ పాలసీ పరిహారం ఇచ్చేలా ఉండాలి. సాధ్యమైనన్ని డే కేర్ చికిత్సలకూ పాలసీ రక్షణ అందించేలా ఉండాలి.

టెలీ మెడిసిన్ సేవలకూ: ఇప్పుడు వైద్యం కోసం కచ్చితంగా ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం లేదు. టెలిమెడిసిన్ ప్రాధాన్యం పెరిగింది. మీరు ఎంచుకునే పాలసీలో ఇలాంటి వెసులుబాటూ ఉండాలి.

తీవ్ర వ్యాధులకూ..

అనుకోకుండా ఆసుపత్రిలో చేరినప్పుడు ఆరోగ్య బీమా పాలసీలు పరిహారం ఇస్తాయి. కానీ, కొన్నిసార్లు తీవ్ర వ్యాధుల బారిన పడే ఆస్కారమూ ఉంది. ఇలాంటప్పుడు పరిహారం కోసం క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలను ఎంచుకోవడం ఎంతో అవసరం. క్యాన్సర్, గుండె జబ్బులు, మూత్రపిండాల వంటి వాటి బారిన పడినప్పుడు చికిత్స ఖర్చుతో నిమిత్తం లేకుండా ఈ పాలసీలు పరిహారం అందిస్తాయి.

# పన్ను ఆదా డబ్బుతో ఏం చేస్తున్నారు?

%ఈ రోజుల్లో ఆర్థిక స్వేచ్ఛ అందరి లక్ష్యం.దీన్ని నెరవేర్చుకునేందుకు కొత్త పన్ను విధానం మనకో మంచి అవకాశాన్ని ఇస్తోంది. పన్ను చెల్లింపుదారులకు భారం కాకుండా ఇది తోడ్పడనుంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయపు పన్నులో మిగిలిన మొత్తాన్ని ఏం చేయాలన్నది ఇప్పుడు కీలకం.




%ఈ రోజుల్లో ఆర్థిక స్వేచ్ఛ అందరి లక్ష్యం.దీన్ని నెరవేర్చుకునేందుకు కొత్త పన్ను విధానం మనకో మంచి అవకాశాన్ని ఇస్తోంది. పన్ను చెల్లింపుదారులకు భారం కాకుండా ఇది తోడ్పడనుంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయపు పన్నులో మిగిలిన మొత్తాన్ని ఏం చేయాలన్నది ఇప్పుడు కీలకం.

పన్ను చెల్లింపుదారులు ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న ఆదాయ పరిమితి పెంపు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చింది. కొత్త పన్ను విధానాన్ని ఎంచుకున్న ఉద్యోగులకు రూ.12,75,000 (ప్రామాణిక తగ్గింపు రూ.75 వేలతో కలిపి) వరకూ పన్ను ఉండదు. దీంతో ఈ విధానాన్ని ఎంచుకునే వారు గతంలోలాగా పన్ను ఆదా కోసం పెద్దగా ప్రణాళికలు వేసుకోవాల్సిన అవసరం ఉండటం లేదు. పన్ను భారం తగ్గడం సంతోషించాల్సిన విషయమే. అదే సమయంలో పెట్టుబడులను విస్మరించడం సరికాదు.

ఏమిటీ విధానం..

సంప్రదాయ పన్ను విధానంలో సెక్షన్ 80సీ, సెక్షన్ 80డీ తదితర సెక్షన్ల కింద, గృహరుణానికి చెల్లించిన వడ్డీకి మినహాయింపులు ఉంటాయి. కొత్త పన్ను విధానంలో ఇవేవీ ఉండవు. రూ.12,75,000 వరకూ పన్ను ఉండదు. ఒకవేళ ఈ పరిమితి దాటితే.. పన్ను శ్లాబులు అమల్లోకి వస్తాయి.

అప్పుడు పన్ను శ్లాబులు ఇలా ఉంటాయి...

రూ.4,00,000 వరకూ పన్ను ఉండదు.

రూ.4 లక్షలు - రూ.8 లక్షల వరకూ 5%

రూ.8 లక్షలు - 12 లక్షల వరకూ 10%

రూ.12 లక్షలు - 16 లక్షల వరకూ 15%

రూ.16 లక్షలు - 20 లక్షల వరకూ 20%

రూ.20 లక్షలు - రూ.24 లక్షల వరకూ 25%

రూ.24 లక్షలు ఆ పైన 30% మేరకు పన్ను చెల్లించాల్సి వస్తుంది. పాత పన్నుల విధానంతో పోలిస్తే కొత్తదానిలో శ్లాబుల సంఖ్య ఎక్కువ.

ఖర్చు చేయొద్దు..

ఆదాయపు పన్ను ఆర్థిక ప్రణాళికలో ఒక భాగం మాత్రమే. పెట్టుబడులు కేవలం పన్ను ఆదా కోసమే కాకూడదు. దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు ఇవి ఎంతో అవసరం. మిగిలిన సొమ్మును ఖర్చు చేయడం ప్రారంభిస్తే.. ఈ లక్ష్యాలు సాధించడం కష్టం అవుతుంది. అందుకే, ఈ మొత్తాన్ని పెట్టుబడులకు మళ్లించడం అలవాటు చేసుకోండి. నెలకు రూ.4,000 చొప్పున ఈక్విటీ ఫండ్లలో మదుపు చేశారనుకుందాం. అప్పుడు సగటు వార్షిక రాబడి 12 శాతం అంచనాతో.. 15 ఏళ్ల తర్వాత మీ చేతిలో రూ.19,03,726 వరకూ ఉంటాయి. ఇప్పుడు పన్ను చెల్లిస్తున్నామనే భావనలోనే ఉండి, ఆ మొత్తాన్ని పెట్టుబడి పెట్టడం అలవాటు చేసుకోండి.

నెలకు రూ.5వేల వరకూ..

పన్ను వర్తించే ఆదాయం (60 ఏళ్ల లోపు వ్యక్తులకు) రూ.12,75,000 ఉందనుకుందాం. కొత్త పన్ను విధానం శ్లాబుల ప్రకారం లెక్కిస్తే... రూ.60,000 వరకూ పన్ను వర్తిస్తుంది. దీనికి సెక్షన్ 87ఏ కింద రిబేటు ఉంటుంది. అంటే.. ఈ రూ.60,000 చెల్లించక్కర్లేదు.

పాత పన్ను విధానంలోనూ ఒకసారి ఉదాహరణను చూద్దాం.. మొత్తం ఆదాయం రూ.12,75,000 ఉందనుకుందాం. ఇందులో నుంచి ప్రామాణిక తగ్గింపు రూ.50,000 ఉంటుంది. సెక్షన్ 80సీ కింద రూ.1,50,000, సెక్షన్ 80డీ కింద రూ.25,000, గృహరుణం వడ్డీ రూ.2,00,000, ఎన్‌పీఎస్‌లో పెట్టుబడి రూ.50,000 ఉన్నాయనుకుందాం. అప్పుడు పన్ను వర్తించే ఆదాయం రూ.8,00,000 అవుతుంది. దీనిపై అన్ని రుసుములూ కలిపి రూ.79,960 పన్ను చెల్లించాల్సి ఉంటుంది. చూశారా? కొత్త పన్ను విధానం ప్రయోజనం ఎంతో. ఈ లెక్క సరే.. కొత్త పన్ను విధానం వల్ల నెలకు రూ.5,000 వరకూ మిగులుతున్నాయి. దీన్ని ఏం చేయాలన్నదే ఇప్పుడు ఆలోచించాలి.

ఇలా చేయొచ్చు..

నెలకు రూ.4,000-రూ.5,000 వరకూ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయొచ్చు.

బ్లూచిప్ కంపెనీల షేర్లలనూ పెట్టుబడి పెట్టుకోవచ్చు. మార్కెట్ గురించి పూర్తి అవగాహన ఉన్నప్పుడే ఇది మంచిది. లేకపోతే నష్టపోయే ప్రమాదం ఉంది.

జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్) లేదా బీమా సంస్థలు అందించే యాన్యుటీ ప్లాన్లలో పెట్టుబడి పెట్టేందుకు ప్రయత్నించొచ్చు.

బంగారంలో ఈటీఎఫ్ లేదా ఫండ్ల రూపంలో మదుపు చేసేందుకు వీలుంది.

మీ దగ్గర అత్యవసర నిధి లేకపోతే దాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నించండి. ఇందుకోసం రికరింగ్ డిపాజిట్ లేదా లిక్విడ్ ఫండ్లలో జమ చేస్తూ వెళ్లొచ్చు.

ఈఎల్ఎస్ఎస్‌లు ఉన్నవారు: ఆదాయంతో నిమిత్తం లేకుండా కొత్త పన్ను విధానంలోకి మారే వారికి ఇక నుంచి ఎలాంటి పన్ను ఆదా పెట్టుబడుల అవసరమూ ఉండదు. ఇలాంటి వారు ఇప్పటికే ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల(ఈఎల్ఎస్ఎస్)లో మదుపు చేస్తుంటే.. వాటి స్థానంలో సాధారణ ఈక్విటీ, డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలోకి మారొచ్చు.

గృహరుణం తీర్చేందుకూ: ఈ ఏడాదిలో గృహరుణ వడ్డీ రేటు 50 బేసిస్ పాయింట్ల వరకూ తగ్గింది. ఇది మంచి అవకాశం. రుణాన్ని వేగంగా తీర్చేందుకు ఇది మంచి అవకాశం ఏడాదికి ఒక ఈఎంఐని అధికంగా చెల్లించేందుకు ఈ మిగులు మొత్తాన్ని వాడుకోవచ్చు.

బీమా పాలసీని ఒకసారి పరిశీలించండి. ఆదాయం, బాధ్యతలకు అనుగుణంగా పాలసీ ఉందా చూడండి. ఒకవేళ లేకపోతే దాన్ని పెంచుకోండి. దీనికి ప్రీమియం కోసం ఈ మిగులు మొత్తంలో కొంత వినియోగించుకోండి.

# ఇక అమెరికాలో 'మేక్ ఇన్ ఇండియా'

## ఐఫోన్లే.. తయారీ మొత్తం భారత్‌లోనే..

అమెరికా, చైనా భారీ స్థాయిలో పరస్పర సుంకాలు విధించుకోవడంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం రాజుకుంది. ఈ క్రమంలోనే టారిఫ్‌ల నుంచి తప్పించుకునేందుకు దిగ్గజ సంస్థ యాపిల్ (ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. ఇందులో భాగంగానే అమెరికా మార్కెట్లో విక్రయించే ఐఫోన్ల తయారీ మొత్తాన్ని భారత్‌కు తరలించాలని కంపెనీ యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.



2026 నాటికి అమెరికా (%ఖూూ%) మార్కెట్ కోసం ఐఫోన్ల తయారీ ప్రక్రియ మొత్తం భారత్ కేంద్రంగానే జరిగేలా యాపిల్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సదరు కథనాల సారాంశం. ఇప్పటివరకు అమెరికా వెలుపల తయారు చేస్తున్న ఐఫోన్లలో భారత్ వాటా 14% కాగా.. దాదాపు 80 శాతం ఐఫోన్లు చైనాలోనే తయారవుతున్నాయి. ఇప్పుడు సుంకాల నేపథ్యంలో యాపిల్‌పై అదనపు భారం పడనుంది. చైనా నుంచి అమెరికాలో దిగుమతి చేసుకుంటే, 145% పన్ను కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో చైనా, భారత్‌లో తయారు చేసే ఐఫోన్ల ధరల మధ్య అమెరికా విపణిలో భారీ వ్యత్యాసం ఉంటోంది. ఈ క్రమంలోనే తయారీని భారత్‌కు మార్చాలని యాపిల్ యోచిస్తోంది. అదే జరిగితే.. ఇక అగ్రరాజ్య మార్కెట్‌లో 'మేక్ ఇన్ ఇండియా' ఐఫోన్లే కన్పిస్తాయి.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ తొలిసారి ఎన్నికైనప్పుడే చైనాతో వాణిజ్య విరోధం మొదలైంది. ఫలితంగా బలమైన ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా మరో దేశాన్ని ఎంచుకోవాలని యాపిల్ సహా పలు బహుళజాతి సంస్థలు భావించాయి. అదే సమయంలో స్మార్ట్‌ఫోన్లపై తయారీ ఆధారిత ప్రోత్సాహకాలు కల్పిస్తామని 2020లో భారత ప్రభుత్వం ప్రకటించింది. దీంతో యాపిల్ మనదేశంలో ఐఫోన్ల అసెంబ్లింగ్‌ను ప్రారంభించింది. గత ఆర్థిక సంవత్సరంలో యాపిల్ 22 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను భారత్‌లో తయారు చేసింది. ఇందులో 18 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను సంస్థ ఇతర దేశాలకు ఎగుమతి చేసింది.

# అతడితో నా అనుబంధానికి పేరు పెట్టలేను: సమంత



ఒక్క అంశం ఆధారంగా కెరీర్‌ను నిర్ణయించలేమని సమంత అన్నారు. తాజాగా కోలీవుడ్‌లో నిర్వహించిన గోల్డెన్ క్వీన్ పురస్కారాల్లో సమంత గోల్డెన్ క్వీన్‌గా అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అలాగే దర్శకుడు, నటుడు రాహుల్ రవీంద్రన్‌తో తన అనుబంధాన్ని పంచుకున్నారు.

"నాకు ఆరోగ్యం బాగాలేనప్పుడు రాహుల్ నావెంటే ఉన్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. నా స్నేహితుడు, సోదరుడు, కుటుంబ సభ్యుడు, రక్తసంబంధీకుడా అని చెప్పలేను" అన్నారు. అభిమానుల గురించి మాట్లాడుతూ.. "ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం నా అదృష్టం. లక్‌తో పాటు నేను పడిన కష్టమే ఈరోజు ఇంతమంది అభిమానానికి కారణం. దేవుడిచ్చిన వరంగా భావిస్తాను. మనం తీసుకునే ఒక్క నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. ఒకవేళ ఎవరైనా అలా డిసైడ్ చేస్తే అది అబద్ధమే అవుతుంది. తెలిసి, తెలియక తీసుకున్న ఎన్నో నిర్ణయాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయి" అని సమంత తెలిపారు.

సమంతతో సినిమా కచ్చితంగా తీస్తాను: సుధ కొంగర

ఈ కార్యక్రమంలో దర్శకురాలు సుధ కొంగర మాట్లాడుతూ సమంతపై ప్రశంసల వర్షం కురిపించారు. "సమంతకు నేను అభిమానిని. 5 సంవత్సరాలుగా ఆమెను దగ్గర నుంచి చూస్తున్నాను. ఆమె బాధపడినప్పుడు నాకు కన్నీళ్లు వచ్చేవి. సమంతను చూసి ఎంతోమంది అమ్మాయిలు ధైర్యం తెచ్చుకోవాలి. ఆమెతో సినిమా తీయాలని రెండుసార్లు ప్రయత్నించాను. కానీ, కుదరలేదు. ఎప్పటికైనా సమంతతో కచ్చితంగా సినిమా తీస్తాను. ఆమె నటించిన 'ఊ అంటావా..' పాట నాకు చాలా ఇష్టం" అని చెప్పారు. ఈ మాటలకు సమంత స్పందిస్తూ.. తనకు యాక్షన్ ఫిల్మ్ చేయాలనుందని చెప్పారు. కచ్చితంగా యాక్షన్ ఫిల్మ్ చేద్దామని సుధ అన్నారు.



# ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ పాత్రలో బాలీవుడ్ నటుడు

%ముంబయి: 'పఠాన్', 'వార్' వంటి చిత్రాలతో దర్శకుడిగా ఫేమ్ అందుకున్నారు సిద్ధార్థ్ ఆనంద్. ప్రస్తుతం ఆయన 'వైట్' (%ఔప్త్రఛ్వ%) అనే భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న ఈ సినిమా కోసం ఆయన నిర్మాత మహావీర్ జైన్‌తో చేతులు కలిపారు. ఇందులో బాలీవుడ్ నటుడు విక్రాంత్ మస్సే ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. త్వరలో పట్టాలెక్కనున్న ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికర విషయం నెట్టింట చక్కర్లు కొడుతోంది.

ఇందులో విక్రాంత్.. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, ఆర్ట్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. కొలంబియాలో చోటు చేసుకున్న అంతర్యుద్ధాన్ని పరిష్కరించడంలో ఆయన ఏవిధంగా కీలక పాత్ర పోషించారనేది ఇందులో చూపించనున్నట్లు సమాచారం. మౌంటూ బస్సీ ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించనున్నారు. ప్రస్తుతం కొలంబియాలో ఈ సినిమాకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. రెగ్యులర్ షూట్ జులై నుంచి ప్రారంభం కానుంది. దేశవిదేశాలకు చెందిన టెక్నీషియన్స్ ఇందులో భాగం కానున్నారు. మరోవైపు ఈ ప్రాజెక్ట్ కోసం విక్రాంత్ సన్నద్ధమవుతున్నారు. గతేడాది ఆయన శ్రీశ్రీ రవిశంకర్‌ను కలిసి ఎన్నో విషయాలడిగి తెలుసుకున్నారు.

# ఆరోజు నాకెంతో ఆనందంగా అనిపించింది: నాగచైతన్య



నటుడు నాగచైతన్య ఫుడ్ బిజినెస్‌లో రాణిస్తోన్న విషయం తెలిసిందే. కొన్నేళ్ల క్రితం ఆయన నగరంలో 'షోయు' పేరుతో ఒక రెస్టరంట్ ప్రారంభించారు. దీనిని ఉద్దేశించి తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. రుచికరమైన వంటకాలను అందించడమే తమ లక్ష్యం అన్నారు. అనంతరం ఆయన 'షోయు'ను ఉద్దేశించి ఇటీవల హీరో ఎన్టీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు.

"'దేవర' ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల జపాన్‌కు వెళ్లిన ఎన్టీఆర్.. మా రెస్టరంట్ గురించి మాట్లాడారు. హైదరాబాద్‌లోని 'షోయు'లో జపనీస్ ఫుడ్ దొరుకుతుందని.. జపనీస్ ఫేమస్ ఫుడ్ సుషీ ఇక్కడ చాలా బాగుంటుందని ఆయన చెప్పారు. దానికి సంబంధించిన వీడియో చూసి ఆరోజు నాకెంతో ఆనందంగా అనిపించింది" అని చైతన్య చెప్పారు. 'షోయు' గురించి గతంలో చైతన్య మాట్లాడారు. "ప్రీమియం క్లౌడ్ కిచెన్ పెట్టాలని లాక్‌డౌన్‌లో ఆలోచన వచ్చింది. అలా పుట్టిందే మా రెస్టరంట్. ప్రస్తుతం మంచిగా సాగుతుంది" అని తెలిపారు.

'తండేల్'తో ఈ ఏడాది ఆరంభంలోనే విజయాన్ని అందుకున్నారు నటుడు నాగచైతన్య. ప్రస్తుతం తాను కార్తిక్ దండుతో చేయనున్న సినిమా కోసం వర్క్ చేస్తున్నట్లు తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. మైథలాజికల్ థ్రిల్లర్ మూవీగా ఇది సిద్ధం కానుందని తెలిపారు. భారీ వీఎఫ్ఎక్స్ హంగులతో దీనిని రూపొందించనున్నామని తెలిపారు. నాగచైతన్య 24వ ప్రాజెక్ట్‌గా రానున్న ఈ సినిమా పేరు కూడా ఆయన ఇంటర్వ్యూలో చెప్పి.. తర్వాత నాలుక్కరచుకున్నారు. దీనికి సంబంధించిన క్లిప్ బయటకు వచ్చింది. అయితే అందులో టైటిల్‌ను మ్యూట్ చేశారు.

# సిక్స్ ప్యాక్‌పై సూర్య తండ్రి వ్యాఖ్యలు.. మా గురించి వాళ్లు మర్చిపోయారన్న విశాల్




సిక్స్ ప్యాక్ బాడీని ఉద్దేశించి నటుడు సూర్య ( తండ్రి శివకుమార్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. కోలీవుడ్‌లో సిక్స్ ప్యాక్ బాడీ ట్రై చేసిన వ్యక్తి తన తనయుడు సూర్యనే అంటూ వ్యాఖ్యలు చేశారు. కోలీవుడ్‌లో చర్చకు దారితీసిన ఈ వ్యాఖ్యలను ఉద్దేశించి తాజాగా నటుడు విశాల్ స్పందించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన్ని ఈ విషయంపై ప్రశ్నించగా.. శివకుమార్ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయనే అర్థం వచ్చేలా నవ్వారు. "కోలీవుడ్‌లో తొలిసారి సిక్స్ ప్యాక్ బాడీ ట్రై చేసింది ధనుష్. వెట్రిమారన్ రూపొందించిన 'పొల్లాధవన్' సినిమా కోసం అతను ఆరు పలకల దేహంతో కనిపించాడు. ఆ తర్వాత నేను 2008లో వచ్చిన 'సత్యం' కోసం సిక్స్ ప్యాక్ చేశా. 'మదగజ రాజ'లోనూ అదే లుక్‌లో కనిపించా. ఆ విషయాలను వాళ్లు మర్చిపోయి ఉండొచ్చు" అని వివరించారు. అనంతరం ఆయన నడిగర్ సంఘం బిల్డింగ్ గురించి మాట్లాడారు. మరో నాలుగు నెలల్లో ఆ బిల్డింగ్ నిర్మాణం పూర్తవుతుందన్నారు. నటుడు కార్తి ఆ నిర్మాణపనులను దగ్గరుండి చూసుకుంటున్నారని తెలిపారు.

శివకుమార్ ఏమన్నారంటే..:

సూర్య హీరోగా నటించిన సరికొత్త చిత్రం 'రెట్రో'. కార్తిక్ సుబ్బరాజు దర్శకుడు. పూజా హెగ్డే కథానాయికగా నటించారు. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం ఇటీవల చెన్నైలో జరిగింది. ఇందులో సూర్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు. కెరీర్ ఆరంభంలో సూర్య ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నారో ఆయన తండ్రి శివకుమార్ తెలియజేశారు. "కెరీర్ ఆరంభం నుంచి మా అబ్బాయి ఎంతో కష్టపడ్డాడు. నేడు ఈ స్థాయికి వచ్చాడు. ఎంతోమంది అభిమానాన్ని సొంతం చేసుకున్నాడు. ఒకానొక సమయంలో నాన్‌స్టాప్‌గా నాలుగు గంటలపాటు డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తుండేవాడు. నిజాయతీగా మరో విషయం చెబుతున్నా. నా తనయుడి కంటే ముందు కోలీవుడ్‌లో ఎవరూ సిక్స్ ప్యాక్ ట్రై చేయలేదు. సినిమాల కోసం అలాంటి బాడీ ట్రై చేసిన మొదటి వ్యక్తి మా అబ్బాయి. మా అబ్బాయి విషయంలో నేనెంతో గర్వపడుతున్నా" అని శివకుమార్ తెలిపారు. తండ్రి మాటలతో అక్కడే ఉన్న సూర్య ఎమోషనల్ అయ్యారు.

# 'దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్'కు 'క' నామినేట్

: నటుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'క' నూతన దర్శకులు సుజిత్, సందీప్ సంయుక్తంగా తెరకెక్కించారు. నయన్ సారిక, తన్వీ రామ్ కథానాయికలు. దీపావళి కానుకగా గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈసినిమా మంచి స్పందన సొంతం చేసుకుంది. కిరణ్ అబ్బవరం కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. తాజాగా ఈ సినిమా ఓ సంస్థ నిర్వహించే 'దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్'కు నామినేట్ అయింది. ఉత్తమ చిత్రం విభాగానికి ఈ సినిమా నామినేట్ అయినట్లు టీమ్ ప్రకటించింది. దిల్లీ వేదికగా ఈ నెలాఖరున జరగనున్న వేడుకల్లో విజేతలకు పురస్కారాలు అందించనున్నారు.



'క' విషయానికి వస్తే.. ఫాంటసీ థ్రిల్లర్‌గా రూపొందింది. డాల్బీ విజన్: ఆటమ్స్ టెక్నాలజీలతో తెరకెక్కించారు. అభినయ్ వాసుదేవ్ (కిరణ్ అబ్బవరం) అనాథ. ఇతరుల ఉత్తరాలు చదువుతూ.. తన సొంతవాళ్లే రాశారని ఊహించుకుంటూ జీవితాన్ని గడిపే వ్యక్తి. అలా ఓ రోజు ఉత్తరం చదువుతుండగా ఆ ఊళ్లో కనిపించకుండా పోయిన అమ్మాయిల గురించి ఓ విషయం తెలుస్తుంది. ఆ తర్వాత అతని జీవితంలో ఎలాంటి సంఘటనలు ఎదురయ్యాయి..? అనే నేపథ్యంలో సిద్ధమైన చిత్రమిది.

# ప్రపంచంలో నాకు అదే పెద్ద అవార్డు: నాని

ప్రస్తుతం 'హిట్ 3' ప్రచారంలో బిజీగా ఉన్నారు నాని. మే 1న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో యాంకర్ సుమతో ఆయన ముచ్చటించారు. మిమ్మల్ని చిరంజీవి ప్రశంసించడం ఎలా అనిపించింది అని అడగ్గా.. " ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఆయన ఎన్నో జనరేషన్స్‌ను చూశారు. ఆయన కెరీర్‌లో 75 శాతం పూర్తయిన తర్వాత నేను ఇండస్ట్రీకి వచ్చాను. అలాంటి వ్యక్తికి నాపై నమ్మకం ఉందంటే అంతకుమించిన ఆనందం ఉంటుందా.. ఆయన ప్రశంస నాకు ప్రపంచంలోనే పెద్ద అవార్డు" అని సమాధానమిచ్చారు.

విశ్వక్ సేన్, అడివి శేష్ 'హిట్ 3'లో కనిపిస్తారా?

నాని: వాళ్లు ఉన్నారో, లేరో చెప్పను. కానీ, ఇందులో చాలా సర్‌ప్రైజ్‌లు ఉంటాయి.

నాని ఎవరంటే ఏం చెబుతారు?అసిస్టెంట్ డైరెక్టర్, యాక్టర్, నిర్మాత?

నాని: కచ్చితంగా యాక్టర్ అనే చెబుతాను. అదే నా వృత్తి. డైరెక్షన్ వైపు వెళ్లే ఆలోచన లేదు.

'ది ప్యారడైజ్' గురించి చెప్పండి?



నాని: అది చాలా డిఫరెంట్ ఫిల్మ్. యాక్షన్ డ్రామా. ఇప్పటివరకూ అలాంటి సినిమా రాలేదు.

హీరోలకు మీరిచ్చే సలహా ఏంటి?

నాని: సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి గుర్తింపుతెచ్చుకున్న వాళ్లు ఎంతోమంది ఉన్నారు. అప్‌కమింగ్ హీరోలు కూడా వాళ్లని చూసి మొదటి సినిమాకే గుర్తింపు రావాలి అనుకుంటారు. కానీ, వాళ్లు ఎంతో కష్టపడితేనే గుర్తింపు వచ్చిందనేది తెలుసుకోవాలి. 'అష్టా చమ్మా' కంటే ముందు నుంచే నేను ఇండస్ట్రీలో ఉన్నాను. 7 ఏళ్లు కష్టపడితే ఆ సినిమాలో అవకాశం వచ్చింది.

# అండగా నిలవాలి

మనం పరిసరాలను గమనిస్తూనే పెరుగుతాం. చుట్టుపక్కల వారిని అనుకరిస్తూనే నేర్చుకుంటాం. ఇవి పుట్టినప్పటి నుంచే అలవడతాయి. తల్లి కళ్లలోకి చూడటం, స్పర్శను గుర్తించటం, నవ్వితే నవ్వటం, మాటలకు స్పందించటం తొలిరోజుల్లోనే అబ్బుతాయి. నెమ్మదిగా తల్లిదండ్రుల మాటలను అనుకరించటం, అత్తాత్తా అనటం, ఇతర పిల్లలను చూసి సంతోషించటం, వారితో కలవటానికి ఆసక్తి చూపటం నేర్చుకుంటాం. ఆ తర్వాత పదాల మధ్య సంబంధాలను గుర్తించటం, అర్థవంతమైన మాటలు మాట్లాడటం, నలుగురితో కలివిడిగా ఉండటం, కలిసి ఆడుకోవటం వంటివీ నరే సరి. అప్రయత్నంగానే నేర్చుకునే ఇలాంటి భాషా, భావోద్వేగ, సామాజిక నైపుణ్యాలు చదువుకోవటానికి, తోటి పిల్లలతో కలవటానికి.. పెద్దయ్యాక సమాజంలో పైకి ఎదగటానికి, ఆటుపోట్లను ఎదుర్కోవటానికి ఎంతో అవసరం. ఆటిజమ్ బారినపడ్డ పిల్లల్లో ఇవే కొరవడతాయి. దీని ప్రభావాలు జీవితాంతం కొనసాగుతూ వస్తుంటాయి. అయితే తొలిదశలోనే చికిత్స చేస్తే సమస్య ముదరకుండా చూడొచ్చు. మిగతా పిల్లల మాదిరిగా జీవించేలా చేయొచ్చు. కాకపోతే ముందే గుర్తించటం, వారికి ఓపికగా అండగా నిలవటం ముఖ్యం




ఏంటీ సమస్య?

ఆటిజమ్‌అనేది మెదడు ఎదుగుదలతో ముడిపడిన సమస్య. వీరి మెదడు ఆకారం బాగానే ఉంటుంది గానీ కొన్ని భాగాల్లో లోపాలు సమస్యకు దారితీస్తాయి. మన మెదడులోని నాడీ కణాలు ఒకదాంతో మరోటి అనుసంధానమై సమాచారాన్ని అంది పుచ్చుకుంటాయి. మాట్లాడటం, నడవటం, సమయానికి అనుగుణంగా స్పందించటం వంటి పనులన్నీ దీని చలవే. ఆటిజమ్‌లో ఇదే లోపిస్తుంది. తల్లి కడుపులో ఉన్నప్పుడే.. పిండంలో మెదడు ఏర్పడే సమయంలోనే నాడీ కణాల కదలికలు, నాడీ కణాల వృద్ధి, ఇవి అనుసంధానం కావటానికి తోడ్పడే చివర్లు ఏర్పడటంలో లోపాలు తలెత్తటం ఆటిజమ్‌కు దారితీస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు.

ఎందుకొస్తుంది?

ఆటిజమ్ రావటానికి ప్రత్యేకించి ఒక కారణమంటూ లేదు. దీనికి రకరకాల అంశాలు దోహదం చేస్తాయి. అన్నింటికన్నా ప్రధానమైనవి జన్యు లోపాలు. తల్లిదండ్రుల నుంచి సంక్రమించే జన్యు లోపాలతోనే 60-80% వరకూ సమస్య తలెత్తుతుంది. కొన్ని క్రోమోజోముల్లో అసాధారణ మార్పులు ఆటిజమ్‌కు దారితీస్తుంటాయి. కాబట్టి ఒక బిడ్డ ఆటిజమ్‌తో పుట్టినట్టయితే మరోసారి సంతానాన్ని కనాలనుకుంటే జన్యు విశ్లేషణ చేయాల్సి ఉంటుంది.

గర్భం ధరించిన తర్వాత తొలి మూడు నెలల్లో తల్లికి పోషణలేమి, రక్తహీనత, ఇన్‌ఫెక్షన్లు రావటం.. పొగ, మద్యం అలవాట్లు.. కొన్నిరకాల మందులు వేసుకోవటమూ పిల్లల్లో ఆటిజమ్ ముప్పును పెంచొచ్చు.

కాన్పు సమయంలో బిడ్డ మెదడు దెబ్బతిన్నా ఆటిజమ్‌కు దారితీయొచ్చు. పుట్టిన వెంటనే ఏడ్వకపోవటం వల్ల మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోవటం, తక్కువ బరువుతో పుట్టటం కూడా కారణం కావొచ్చు.

ఆలస్యంగా సంతానం కనేవారిలోనూ వీర్యం, అండం నాణ్యత దెబ్బతినటంతోనూ ఆటిజమ్ వచ్చే అవకాశముంది.

ప్రధాన లక్షణాలు

ఆటిజమ్ పిల్లలు పుట్టినప్పుడు బాగానే ఉండొచ్చు. పైకి ఎలాంటి తేడా కనిపించక పోవచ్చు. అయితే ఎదుగుతున్నకొద్దీ.. ముఖ్యంగా రెండేళ్లు వచ్చేటప్పటికి లక్షణాలు బయటపడుతుంటాయి.

భావ వ్యక్తీకరణ లోపం: కొందరు పిల్లల్లో మాటలు ఆలస్యం కావటం, వచ్చినా సరిగా రాకపోవటం, పూర్తి వాక్యాలను పలక లేకపోవటం కనిపిస్తుంటాయి. వీరికి జవాబు చెప్పటం తెలియదు. ఏదైనా అడిగితే దాన్నే తిరిగి వల్లె వేస్తుంటారు. ఉదాహరణకు- నీ పేరేంటని అడిగితే.. తమ పేరు చెప్పకుండా తిరిగి నీ పేరేంటి? అని అడుగుతారు. సమయం, సందర్భం లేకుండా తమకు తెలిసిన విషయాన్నే మళ్లీ మళ్లీ చెబుతుంటారు. కొందరు తమకు అవసరమైన వాటిని నోటితో చెప్పలేరు కూడా. ఆయా వస్తువులను వేలితో చూపిస్తుంటారు. కొందరు సైగలతోనూ భావాలను వ్యక్తం చేయలేకపోవచ్చు. వీరి ముఖంలో భావాలూ పలకవు.

ఇతరులతో కలవలేకపోవటం: మామూలుగా పిల్లలు తోటివారితో కలివిడిగా ఉంటారు. చక్కగా కలిసి ఆడుకుంటారు. పిల్లల మానసిక ఎదుగుదలలో ఇది చాలా ముఖ్యమైన విషయం. అయితే ఆటిజం పిల్లలు ఇతరులతో కలవటానికి ఇష్టపడరు. ఒంటరిగా ఉండటానికి ఇష్టపడుతుంటారు. ఒక్కరే ఆడుకోవటానికి ప్రయత్నిస్తుంటారు. తల్లిదండ్రులు పేరు పెట్టి పిలిచినా స్పందించరు. కళ్లలోకి నేరుగా చూడరు. శరీర హావభావాలను, ముఖంలో భావాలను, గొంతు హెచ్చుతగ్గుల వంటివాటినీ పోల్చుకోలేరు. నువ్వు నేను అనే తేడా తెలియకపోవటం, తల్లిదండ్రులను సొంతవారిగా భావించకపోవటమూ చూస్తుంటాం.

విచిత్ర ప్రవర్తన: కొందరిలో కొన్ని ప్రత్యేక ప్రవర్తనలూ కనిపిస్తుంటాయి. చేసిన పనులే మళ్లీ మళ్లీ చేయటం.. చేతులు, కాళ్లు అదేపనిగా ఊపటం, చప్పట్లు కొట్టటం, తమ చుట్టూ తాము తిరగటం, నోటితో రకరకాల చప్పుళ్లు వంటివి చేస్తుండొచ్చు. తిరుగుతున్న ఫ్యాన్ల వంటి వాటిని తదేకంగా చూస్తుండొచ్చు. కారు, బస్సు బొమ్మలతో కాకుండా వాటి చక్రాలతో ఆడుకుంటుండొచ్చు. ఒకే రకం వస్తువులను సేకరించటం.. వస్తువులను ఒకదాని వెనకాల మరోటి వరుసగా పేర్చటం చేస్తుంటారు. పనులను ఒకేలా, రోజూ అలాగే చేయటానికి ప్రయత్నిస్తుంటారు. ఏమాత్రం అటూఇటైనా చిరాకు పడతారు. ఇలా తమకు తాము స్థిమిత పడాలని చూస్తుంటారు.

జ్ఞానేంద్రియ లక్షణాలు: ఆటిజమ్‌లో జ్ఞానేంద్రియాలతో ముడిపడిన లక్షణాలూ ప్రధానమే. కొందరు చిన్న శబ్దాలనైనా తట్టుకోలేరు. కుక్క అరుపు, మిక్సీ చప్పుళ్ల వంటివి వినగానే భయపడి చెవులు మూసుకొని, పరుగెడుతుంటారు. మరికొందరు చేతులతో దబాదబా బాదుతూ పెద్ద శబ్దాలు చేస్తూ సంతోషిస్తుండొచ్చు కూడా. ఎదుటి వారిని చూసేటప్పుడు వంకరగా చూడొచ్చు. లేదూ కళ్లు మూసుకోవచ్చు. స్పర్శ విషయానికి వస్తే- కొందరు మెత్తటి దుస్తులు బాగా ఇష్టపడొచ్చు. కొందరికి గరుకు దుస్తులు నచ్చొచ్చు. అన్నం నమిలి మింగకపోవచ్చు. కొన్ని పదార్థాలు నచ్చకపోవచ్చు. ఉదాహరణకు- కొందరు పాలు నచ్చక కక్కేస్తుంటారు. వస్తువులను పదే పదే వాసన చూస్తుంటారు కూడా.

ఐదు రకాలు

ఆటిజమ్ లక్షణాలు అందరిలో ఒకేలా ఉండవు. కొందరిలో ఒకట్రెండే కనిపించొచ్చు. కొందరిలో ఎక్కువగా ఉండొచ్చు. తీవ్రంగా లేదా స్వల్పంగానూ ఉండొచ్చు. ఇవి మొదలైన వయసు, తీవ్రత, ముదురుతున్న తీరును బట్టి ఆటిజమ్‌ను ఐదు రకాలుగా విభజించొచ్చు.

1 ఆటిస్టిక్ డిజార్డర్: దీన్నే చైల్డ్‌హుడ్ ఆటిజమ్ అంటారు. ఎక్కువగా కనిపించే సమస్య ఇదే. ఇది ఆడపిల్లల్లో కన్నా మగవారిలో ఎక్కువ.

2 రట్స్ డిజార్డర్: ఏడాది తర్వాత లక్షణాలు కనిపించటం, రెండు మూడేళ్లలోనే తీవ్రం కావటం దీని ప్రత్యేకత. కొందరిలో వచ్చిన మాటలు వెనక్కి పోతుంటాయి. ఇది క్రమంగా ముదురుతూ వచ్చే సమస్య. కొంత కాలం తర్వాత నాడీ సమస్యలూ మొదలు అవుతాయి. కొందరికి ఫిట్స్ రావొచ్చు.

# విమాన ప్రయాణమా?

విమానంలో ప్రయాణించటం సరదాగానే అనిపిస్తుంది. సమయమూ ఆదా అవుతుంది. ఇది నరే గానీ విమాన ప్రయాణం కొన్ని ఆరోగ్య సమస్యలకూ దారితీయొచ్చు. విమానంలో పీడనం, ఉష్ణోగ్రత, ఆక్సిజన్ మోతాదులు మారిపోతుంటాయి. తేమ కూడా సముద్ర మట్టం కన్నా తక్కువగా ఉంటుంది. ఇవన్నీ శరీరం పనితీరు మీద ప్రభావం చూపుతాయి. వేర్వేరు టైమ్‌జోన్ల గుండా సాగటం, చుట్టూ చాలామంది ఉండటమూ కొన్ని చిక్కులు తెచ్చిపెడతాయి. కాబట్టి వీటి గురించి తెలుసుకొని, కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిది.

ఒంట్లో నీటిశాతం తగ్గటం

విమానం కేబిన్‌లో తేమ చాలా తక్కువగా ఉంటుంది. ఎందుకంటే కేబిన్‌లో



తిరిగే గాలిలో సుమారు 50% తేమ బయటకు పోతుంది. మరీ ఎత్తుగా విమానం ప్రయాణిస్తున్నప్పుడైతే తేమ దాదాపు పూర్తిగానూ తగ్గుతుంది. దీంతో గొంతు, ముక్కు, చర్మం ఎండిపోయినట్టు అనిపిస్తుంది.

ఏం చేయాలి?: చేతి సంచీలో ఖాళీ వాటర్ బాటిల్‌ను పెట్టుకోవటం మంచిది. చెకింగ్ పూర్తయ్యాక బాటిల్‌లో నీళ్లు నింపి, విమానంలోకి తీసుకెళ్లటానికి వీలుంటుంది. విమానంలో ఇచ్చే తీపి పానీయాలకు బదులు అప్పుడప్పుడూ బాటిల్‌లో నీళ్లు తాగొచ్చు. గంటలకొద్దీ ప్రయాణం చేసేటప్పుడు ఇదెంతగానో ఉపయోగపడుతుంది. కాంటాక్టు లెన్సులు ధరించేవారు వీటికి బదులు అద్దాలు పెట్టుకోవాలి. దీంతో కళ్లకు అసౌకర్యం కలగకుండా చూసుకోవచ్చు. ముక్కు, కళ్లు, చర్మం పొడిబారతాయని భయపడేవారు ముక్కులో, కళ్లలో వేసుకునే చుక్కల మందు.. చర్మానికి రాసుకునే లోషన్లు వెంట తీసుకెళ్లటం మేలు.

శక్తి తగ్గటం

అధిక ఎత్తుల్లో గాలిలో పీడనం తగ్గుతుంది. దీనర్థం శరీరం ఆక్సిజన్‌ను తక్కువగా తీసుకుంటుందనే. నిజానికి విమాన సంస్థలు కేబిన్‌లో గాలి పీడనం తగ్గకుండా తగు చర్యలు తీసుకుంటాయి. అయినా కూడా సముద్ర మట్టంతో పోలిస్తే పీడనం తక్కువగానే ఉంటుంది. అందువల్ల విమాన ప్రయాణం చేస్తున్నప్పుడు ఒంట్లో ఆక్సిజన్ మోతాదులు పడిపోతాయి. దీంతో శక్తి సన్నగిల్లినట్టు అనిపిస్తుంది. ఒంట్లో నీటిశాతం తగ్గటమూ నిరుత్సాహానికి గురిచేస్తుంది. వేర్వేరు టైమ్‌జోన్లలో ప్రయాణించటం జెట్ ల్యాగ్‌కూ దారితీస్తుంది.

ఏం చేయాలి?: తగినంత నీరు తాగటం ముఖ్యం. ఒకట్రెండు గంటల కన్నా ఎక్కువసేపు ప్రయాణం చేయాల్సి వస్తే అప్పుడప్పుడు సీటులోంచి లేచి, కేబిన్‌లో అటూఇటూ నాలుగడుగులు వేయటం మంచిది. సీటులో కూర్చున్నప్పుడూ కాళ్లూ చేతులూ సాగదీయొచ్చు. నేల మీది నుంచి వస్తువులను కాలి వేళ్లతో పట్టుకుంటున్నట్టు చేయొచ్చు. వేళ్లను, మడమలను కదిలించొచ్చు. వీటితో రక్త ప్రసరణ మెరుగవుతుంది. ఒకవేళ ఒకట్రెండు రోజుల పాటు వేర్వేరు టైమ్ జోన్లలో ప్రయాణిస్తున్నట్టయితే మన టైమ్ జోన్ ప్రకారం నిద్ర వేళలను పాటించాలి.

చెవి దిబ్బడ

విమానం కేబిన్‌లో పీడనం మారుతున్నకొద్దీ లోపలి చెవుల్లోని గాలి పీడనం దానికి అనుగుణంగా సరిదిద్దుకోవటానికి ప్రయత్నిస్తుంది. దీని మూలంగానే శరీరం తూలకుండా ఉంటుంది. విమానం గాల్లోకి లేస్తున్నప్పుడు, కిందికి దిగుతున్నప్పుడు వేగంగా పీడనంలో మార్పులు తలెత్తుతాయి. ఈ సమయాల్లో మధ్య చెవి, యూస్టేషియన్ గొట్టాల చుట్టూ ఒత్తిడి పెరుగుతుంది. దీన్ని సరిచేసుకునే క్రమంలో చెవులు దిబ్బడేస్తాయి. కదలికలకు సంబంధించి మెదడుకు విరుద్ధ సంకేతాలు అందటం వల్ల కొందరికి వికారం వచ్చినట్టూ అనిపించొచ్చు.

ఏం చేయాలి?: విమానం గాల్లోకి లేస్తున్నప్పుడు, కిందికి దిగుతున్నప్పుడు గుటక వేయటం లేదా ఆవలించటం ద్వారా మధ్య చెవి మీద ఒత్తిడి నియంత్రణలోకి వస్తుంది. చెవి దిబ్బడ తొలగుతుంది. వికారం రాకుండా ఉండటానికి రెక్కల వద్ద ఉండే విండో సీటులో కూర్చోవటం మంచిది. ఇక్కడ కదలిక కోణం తక్కువగా ఉంటుంది. ఆకాశం, భూమి కలిసే దృశ్యం కనిపిస్తుంది.

కడుపుబ్బరం

విమానం గాల్లో ఎగురుతున్నప్పుడు కేబిన్‌లో పీడనం తగ్గుతుంది. దీంతో పొట్టలోని గ్యాస్ విస్తరిస్తుంది. జీర్ణకోశంలో, పేగుల్లో నిండిపోతుంది. దీంతో కడుపు ఉబ్బినట్టు అనిపిస్తుంది. బెల్టు బిగుతుగా అవుతుంది.

ఏం చేయాలి?: చిక్కుళ్లు, ఉల్లి, వెల్లుల్లి, కొన్నిరకాల గింజ పప్పులు, పాల ఉత్పత్తులు, పండ్లు గ్యాస్ ఏర్పడేలా చేస్తాయి. ప్రయాణానికి ముందు రోజు నుంచే ఇలాంటి పదార్థాలు తినకుండా చూసుకోవాలి. ప్రయాణంలోనూ సరిపోయే ఆహారాన్నే తినాలి. తగినంత నీరు తాగాలి. కాఫీ, టీ తగ్గించుకోవాలి.

# వ్యాయామంతో కంటి నిండా నిద్ర

కంటి నిండా నిద్రపోవాలని అనుకుంటున్నారా? అయితే క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. రోజూ కాకపోయినా వారానికి కనీసం రెండు, మూడు సార్లు చేసినా చాలు. ఇలాంటివారికి రాత్రిపూట నిద్ర బాగా పడుతున్నట్టు తాజా అధ్యయనంలో బయటపడింది. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఆరోగ్యం ఇనుమడిస్తుందన్న సంగతి కొత్తేమీ కాదు. కంటి నిండా నిద్ర పట్టటానికి, నిద్రలేమి లక్షణాలు తగ్గటానికి శారీరక శ్రమ తోడ్పడుతున్నట్టు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే ఇందుకు లింగ భేదం, వయసు, బరువు, శరీర సామర్థ్యం, మొత్తంగా ఆరోగ్యం, వ్యాయామ రకాలు ఎంతవరకు దోహదం చేస్తాయన్నది కచ్చితంగా తెలియదు. దీన్ని గుర్తించటానికే శాస్త్రవేత్తలు ప్రయత్నించారు. సుమారు 4400 మందిని ఎంచుకొని వారానికి ఎన్నిసార్లు, ఎంతసేపు, ఎంత తీవ్రతతో వ్యాయామం చేస్తున్నారు? వీరిలో నిద్రలేమి లక్షణాలు ఎలా ఉన్నాయి? రాత్రిపూట ఎంతసేపు పడుకుంటున్నారు? పగటిపూట ఎంతవరకు మగతగా ఉంటున్నారు? అనే విషయాలను నిశితంగా పరిశీలించారు. వారానికి కనీసం రెండు, అంతకన్నా ఎక్కువసార్లు (వారానికి గంట, అంతకన్నా ఎక్కువసేపు) వ్యాయామం చేసేవారిని



చురుకుగా ఉన్నవారిగా పరిగణనలోకి తీసుకున్నారు. ఇలాంటివారికి నిద్రలేమి ముప్పు 42% తక్కువగా ఉంటోందని గుర్తించారు. అలాగే వీరిలో నిద్రలేమి లక్షణాలు 22-40 శాతం వరకూ తక్కువగా ఉంటున్నట్టు వెల్లడైంది.

# ఎండ వేడికి గుండె జాగ్రత్త

గుండెజబ్బు ముప్పు కారకాలనగానే అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, అధిక బరువు వంటివే గుర్తుకొస్తాయి. అధిక ఉష్ణోగ్రత ప్రభావమూ తక్కువేమీ కాదు. ఇది రోగనిరోధక వ్యవస్థకు చేటు చేస్తుందని.. ఫలితంగా వాపు ప్రక్రియ పెరిగి, గుండెరక్తనాళాల ఆరోగ్యం దెబ్బతింటుందని తాజా అధ్యయన ఫలితాలు చెబుతున్నాయి.

వేసవిలో అధిక వేడి మూలంగా వడదెబ్బ, నిస్త్రాణ, పిక్కలు పట్టేయటం, తలనొప్పి, చర్మం కమలటం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. అ్తతే ఇవే కాదు.. ఇతరత్రా సమస్యల ముప్పూ పొంచి ఉంటుంది. ఉదాహరణకు- గుండెజబ్బులు. అప్పటికే గుండె జబ్బులతో బాధపడుతుంటే తీవ్రమవుతాయి కూడా. ఇంతకీ వేడికీ గుండెకూ ఏంటీ సంబంధం? వాపు ప్రక్రియే. గుండెజబ్బుల విషయంలో అధిక



వేడిని అంతగా పట్టించుకోరు గానీ ఇదీ ముఖ్యమైన ముప్పు కారకమేనని అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ డేనియల్ డబ్ల్యూ. రిగ్స్ చెబుతున్నారు. వేసవిలో ఎండ ప్రభావానికి గురైనవారి రక్తంలో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) సూచికల మోతాదులు పెరుగుతున్నాయని వివరిస్తున్నారు.

# నాడీ కణాలు దెబ్బతింటేే దీర్ఘకాల జ్ఞాపకాలు

మెదడులోని నాడీ కణాల్లో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) తలెత్తటాన్ని హాని కరమైందనే భావిస్తాం.మెదడులోని నాడీ కణాల్లో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) తలెత్తటాన్ని హాని కరమైందనే భావిస్తాం. ఇది అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి జబ్బులకు



దారి తీస్తుంది మరి. కానీ మెదడు భాగమైన హిప్పో క్యాంపస్‌లోని కొన్ని నాడీకణాల్లో పుట్టుకొచ్చే వాపు ప్రక్రియ దీర్ఘకాల జ్ఞాపకాలు ఏర్పడటానికి కీలకమంటే నమ్ముతారా? ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజమేనని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్ శాస్త్రవేత్తల అధ్యయనంలో బయటపడింది. మన మెదడులో హిప్పోక్యాంపస్‌ను జ్ఞాపక కేంద్రం అనుకోవచ్చు. దీనిలోని కొన్ని నాడీ కణాల డీఎన్ఏ దెబ్బనటం, మరమ్మతు కావటం.. ఒక చట్రంలా కొనసాగుతూ రావటం వల్ల స్థిరమైన జ్ఞాపకాల సముచ్ఛయాలు ఏర్పడుతున్నట్టు తేలింది. మనకు చిన్నప్పటి సంఘటనల వంటి పాత విషయాలు గుర్తుండటానికి తోడ్పడేవి ఈ సముచ్ఛయాలే కావటం విశేషం. ఎలుకలకు స్వల్పంగా, ఒక మాదిరిగా షాక్ ఇవ్వటం ద్వారా ఈ జ్ఞాపకాలు ఏర్పడే ప్రక్రియను శాస్త్రవేత్తలు గుర్తించారు. షాక్ ఇచ్చిన తర్వాత ఎలుకల మెదడులో హిప్పోక్యాంపస్‌లోని నాడీ కణాలను పరిశీలించగా.. వాపు ప్రక్రియ సమాచార మార్గంలో పాలు పంచుకునే జన్యువులు ఉత్తేజితమైనట్టు బయటపడింది. మొదట్లో ఇన్‌ఫెక్షన్ మూలంగా వాపు ప్రక్రియ ఉత్తేజితమైందని శాస్త్రవేత్తలు భావించారు. కానీ మరింత నిశితంగా పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయం వెలుగులోకి వచ్చింది. హిప్పోక్యాంపస్ కణాల సముచ్ఛయాల్లోనే వాపు ప్రక్రియ ప్రేరేపితమైందని, ఇది డీఎన్ఏ దెబ్బతినటానికి నిదర్శనమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మెదడు చర్యల్లో భాగంగా డీఎన్ఏ తరచూ అక్కడక్కడా స్వల్పంగా విచ్ఛిన్నమవుతుంటుంది. ఇవి నిమిషాల్లోనే మరమ్మతు అవుతాయి కూడా. కానీ హిప్పోక్యాంపస్‌లోని నాడీ కణాల్లో డీఎన్ఏ దెబ్బతినటం గణనీయంగా, ఎక్కువకాలం కొనసాగుతుండటం విచిత్రం.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy